RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com

# భారత శక్తి®

తెలుగు దినపత్రిక

VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 19 సంచిక:253 హైదరాబాద్, ఆదివారం, 13 ఏప్రిల్ 2025 పేజీలు: 12 వెల: 1.00





## గొప్ప పర్యావరణ వేత్తను కోల్పోయాం : రేవంత్

హైదరాబాద్, ఏప్రిల్ 12

పర్యావరణ ప్రేమికుడు వనజీవి రామయ్య మృతిపట్ల ఏపీ, తెలంగాణ సీఎంలు, మంత్రులు, ఇతర నేతలుగ్ర్భాంతి వ్యక్తం చేస్తున్నారు. పలు రంగాల ప్రముఖులు వనజీవి రామయ్య లేనిలోటు పూడ్చలేనిది అంటున్నారు. పర్యావరణం కోసం ఆయన చేసిన కృషిని స్మరించుకుంటున్నారు.పద్మశ్రీ వనజీవి రామయ్య మరణం తీవ్రగ్ర్భాంతి కలిగించిందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కోటి మొక్కలు నాటి వనజీవినే? తన ఇంటిపేరుగా మార్చుకున్న గొప్ప పర్యావరణ హితుడు రామయ్య అని కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. వనజీవి రామయ్య కుటుంబ సభ్యులకు సీఎం రేవంత్ ప్రగాఢ సానుభూతి తెలిపారు.పద్మశ్రీ వనజీవి రామయ్య మృతి వార్త తెలిసి ఏపీ సీఎం చంద్రబాబు తీవ్ర విచారానికి లోనయ్యారు. ఒక వ్యక్తిగా ఉండి... పర్యావరణ పరిరక్షణకు కోటి మొక్కలు నాటిన రామయ్య కృషి స్ఫూర్తిదాయకం అన్నారు. నేటి తరానికి రామయ్య ఆదర్శప్రాయుడు. ఆయన మరణం పర్యావరణ పరిరక్షణ ఉద్యమానికి తీరని లోటు అన్నారు. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వనజీవి రామయ్య ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు.



పర్యావరణ పరిరక్షణే ప్రాణంగా బతికారు..

వనజీవి రామయ్య మరణం పచ్చదనానికి తీరని లోటు అని, తెలంగాణ ఒక ప్రపంచ పర్యావరణవేత్తను కోల్పోయిందని వనజీవి మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం తెలిపారు. పర్యావరణ పరిరక్షణే ప్రాణంగా బతికిన పద్మశ్రీ వనజీవి రామయ్య మృతిపట్ల కేసీఆర్ విచారం వ్యక్తం చేస్తూ, సంతాపం ప్రకటించారు. వృక్షో రక్షతి రక్షితః " అనే నినాదాన్ని తన శరీరంలో భాగం చేసుకుని, కోటికి పైగా మొక్కలను నాటి, ప్రపంచానికి పచ్చదనం ప్రాముఖ్యతను ప్రచారం చేసిన వనజీవి రామయ్య లక్ష్యం మహోన్నతమైనదన్నారు. మొక్కల పెంపకం కోసం వనజీవిగా మారిన దర్పల్లి రామయ్య జీవితం రేపటి తరాలకు ఆదర్శనీయమని కొనియాడారు.ప్రపంచ పర్యావరణ కోసం సాగిన మానవ కృషిలో వనజీవి గా వారు చేసిన త్యాగం అసమాన్యమైనదని అన్నారు. అడవులు, పచ్చదనం అభివృద్ధి దిశగా నాటి బి ఆర్ ఎస్ ప్రభుత్వం అమలు చేసిన.. తెలంగాణ కు హరిత హారం... ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు దర్పల్లి రామయ్య అందించిన సహకారం గొప్పదని కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. భవిష్యత్తు తరాలకు మనం అందించే సంపద హరిత సంపదే కావాలని, భౌతిక ఆస్తులు కావనీ కేసీఆర్ పునరుద్ఘాటించారు.పచ్చని అడవులను ధ్వంసం చేస్తూ, వన్యప్రాణులకు నిలువనీడ లేకుండా ప్రభుత్వాలు ప్రదర్శిస్తున్న పర్యావరణ వ్యతిరేక ధోరణులను నిలువరించడానికి, వర్తమాన పరిస్థితుల్లో వేలాది వనజీవి రామయ్యల అవసరం ఉన్నదని కేసీఆర్ స్పష్టం చేశారు. వనజీవి మరణంతో తెలంగాణ ఒక ప్రపంచ పర్యావరణ వేత్తను కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. రామయ్య కుటుంబ సభ్యులకు, అభిమానులకు పర్యావరణ పరిరక్షకులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

===================



## ప్రశాంతంగా సాగిన వీరహనుమాన్ శోభాయాత్ర

హైదరాబాద్: హనుమాన్ విజయయాత్ర సందర్భంగా హైదరాబాద్ నగరంలో నిర్వహించిన 'వీరహనుమాన్ శోభాయాత్ర' ప్రశాంతంగా సాగింది. గౌలిగూడ నుంచి కోఠి, నారాయణగూడ బైపాస్ మీదుగా సికింద్రాబాద్‌లోని తాడ్‌బండ్ హనుమాన్ ఆలయం వరకు ఈ ర్యాలీ కొనసాగింది. భక్తులు భారీగా తరలివచ్చి పాల్గొన్నారు. 12 కిలోమీటర్ల మేర సాగిన ఈ యాత్రకు భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలు, డ్రోన్లతో అడుగడుగునా నిఘా ఏర్పాటు చేశారు. హైదరాబాద్ నగర సీపీ సీవీ ఆనంద్ గౌలిగూడలోని శ్రీరామ మందిరానికి చేరుకుని భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## ప్రైవేటుపరం కాబోతున్న 400 ఎకరాల భూమిని కాపాడాం: మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్: ప్రైవేటుపరం కాబోతున్న 400 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం కాపాడిందని తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఈ భూములు ప్రభుత్వానివేనని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంగా చెప్పినప్పటికీ కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఏఐ వీడియోలు సృష్టించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



"సామాజిక మాధ్యమాల్లో ఫేక్ వీడియోలు వైరల్ చేసి దుష్ప్రచారం చేశారు. హెచ్‌సీయూ భూములు, పరిసరాల్లో ఏనుగులు ఉన్నాయా? విద్యార్థులను ప్రభావితం చేసి ప్రభుత్వ పనులను అడ్డుకోవాలని చూస్తున్నారు. హైదరాబాద్‌కు పెట్టుబడులు, ఉద్యోగాలు రావొద్దని కుట్ర చేస్తున్నారు. సెబీ నిబంధనలకు అనుగుణంగానే బాండ్ల జారీ ప్రక్రియ ఉంటుంది. ఐసీఐసీఐ నుంచి మేం ఎలాంటి లోన్లు తీసుకోలేదు. కంచ గచ్చిబౌలి భూములపై ఎలాంటి వివాదాలు లేవు. రాష్ట్ర ప్రజల సంక్షేమ కార్యక్రమాల కోసమే నిధులు సేకరిస్తున్నాం" అని శ్రీధర్‌బాబు తెలిపారు.

సీఎం పదవిపై కీలక వ్యాఖ్యలు

సీఎం పదవిపై మంత్రి శ్రీధర్‌బాబు కీలక వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌రెడ్డే సీఎంగా ఉంటారని, ఆయనే ఉండి తీరుతారని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం చేస్తూ రేవంత్ అవినీతిరహిత పాలన చేస్తున్నారని కితాబిచ్చారు. కాంగ్రెస్ పార్టీలో అందరూ సమర్థులేనని అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ సచివాలయంలో సమీక్షనిర్వహించారంటూ వచ్చిన వార్తలను శ్రీధర్‌బాబు తోసిపుచ్చారు. ఆమె ఎలాంటి సమీక్ష నిర్వహించలేదన్నారు. " మమ్మల్ని కలవడానికే మీనాక్షి నటరాజన్ సచివాలయానికి వచ్చారు. అక్కడికి ఎవరైనా రావొవచ్చు. భాజపా, భారాస నాయకులు కూడా సచివాలయానికి వస్తారు" అని శ్రీధర్‌బాబు అన్నారు.

## కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి దంపతులకు బెదిరింపులు

హైదరాబాద్: కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి దంపతులకు బెదిరింపులు వచ్చాయి. ఈ ఘటనపై బంజారాహిల్స్ పోలీసుస్టేషన్‌లో విజయశాంతి భర్త శ్రీనివాస ప్రసాద్ ఫిర్యాదు చేశారు. 4 ఏళ్ల క్రితం చంద్రకిరణ్‌రెడ్డి తమను సంప్రదించి, సోషల్ మీడియాలో కంటెంట్ క్రియేటర్‌గా తనను తాను పరిచయం చేసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విజయశాంతి వద్ద సోషల్‌మీడియా హ్యాండ్లర్‌గా అవకాశం ఇవ్వాలని కోరినట్లు వివరించారు.



"చంద్రకిరణ్‌రెడ్డి మాతో కలిసి పనిచేస్తూ తన సొంత వ్యాపారాన్ని బలపరుచుకున్నారు. స్వలాభం కోసం మా పేరును వాడుకున్నారు. అతని పనితీరు నచ్చకపోవడంతో చంద్రకిరణ్ సేవలను వినియోగించుకోలేదు. మేం భాజపాలో ఉన్నప్పుడు అతడితో పరిచయం ఏర్పడింది. ఆ పార్టీలో ఎదిగేందుకు చంద్రకిరణ్ మమ్మల్ని వాడుకున్నారు. భాజపాలో నుంచి బయటకు వచ్చాక అతడి నుంచి మెసేజ్ వచ్చింది. పెండింగ్‌లో ఉన్న నగదు చెల్లింపులు చేయగలరా అని అందులో ఉంది.

ఈక్రమంలో మావద్ద బకాయిలు ఏమీ లేవని సమాధానమిచ్చాం. అయితే ఏప్రిల్ 6న చంద్రకిరణ్‌రెడ్డి బెదిరింపు సందేశం పంపాడు. బకాయిలు తీర్చుకుంటే మీరు శత్రువులు అవుతారని మెసేజ్ చేశాడు. ఆమోదయోగ్యం కాని రీతిలో సందేశాలు ఉన్నాయి. చంద్రకిరణ్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి" అని శ్రీనివాస ప్రసాద్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు వివిధ సెక్షన్ల కింద ఆయనపై కేసు నమోదు చేశారు. (

## రూ.661 కోట్ల ఆస్తుల స్వాధీనానికి ఈడీ నోటీసులు

న్యూఢిల్లీ: నేషనల్ హెరాల్డ్ కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా రూ.661 కోట్ల విలువచేసే స్థిరాస్తుల జప్తునకు నోటీసులు జారీ చేసినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ) శనివారంనాడు తెలిపింది.




నేషనల్ హెరాల్డ్ పత్రికకు అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్) ప్రచురణ కర్తగా ఉంది. స్థిరాస్తుల జప్తునకు సంబంధించి మూడు ప్రాంతాల్లో నోటీసులు అతికించినట్టు ఈడీ ఒక ప్రకటనలో తెలిపింది. ఢిల్లీలోని ఐటీవోలో ఉన్న హెరాల్డ్ హౌస్, ముంబైలోని బాంద్రా ఏరియాలోని ప్రాంగణంలో, లక్నోలోని బిషేశ్వర్ నాథ్ రోడ్డులో ఉన్న ఏజేఎల్ బిల్డింగ్ వద్ద ఈ నోటీసులు అతికించినట్టు పేర్కొంది. ఢిల్లీ, లక్నో ప్రాంగణాలను ఖాళీ చేయాలని ఈ నోటీసులలో కోరింది. ముంబై బిల్డింగ్ వరకూ ఒక ఆప్షన్‌గా దాని అద్దెను ఈడీకి ట్రాన్‌ఫర్ చేసే వెసులుబాటు కల్పించింది. పీఎంఎల్‌ఏ చట్టంలోని సెక్షన్ 8, రూల్ 5(1) కింద ఈడీ ఈ చర్యలు తీసుకుంది. 2023 నవంబర్‌లో ఈడీ ఈ ఆస్తులను జప్తు చేసింది.

నేషనల్ హెరాల్డ్ కేసు

ఏజేఎల్, దాని యాజమాన్య కంపెనీ యంగ్ ఇండియా కంపెనీపై మనీ లాండరింగ్ కేసు ఇది. నేషనల్ హెరాల్డ్ కేసుగా ప్రచారంలో ఉంది. నేషనల్ హెరాల్డ్ పత్రికకు పబ్లిషర్స్‌గా ఏజేఎల్ ఉండగా, యంగ్ ఇండియాలో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీలకు 38 శాతం చొప్పున మెజారిటీ షేర్లు ఉన్నాయి. కాంగ్రెస్‌కు ఏజేఎల్ బకాయి పడిన రూ.90 కోట్లను వసూలు చేసుకునే విషయంలో యంగ్ ఇండియన్‌లో ఆర్థిక అవకతవకలు జరిగాయని ఈడీ ఆరోపిస్తోంది. ఈ కేసులో ఇప్పటికే సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలను ఈడీ విచారించి, వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేసింది.

## వనజీవి రామయ్య మృతిపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి

ఢిల్లీ: పద్మశ్రీ పురస్కార గ్రహీత వనజీవి రామయ్య (85) మృతిపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సుస్థిరత కోసం గళం వినిపించిన వ్యక్తిగా రామయ్య గుర్తుండిపోతారని అన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా తెలుగులో పోస్టు చేశారు. " లక్షలాది మొక్కలు నాటడానికి, వాటిని రక్షించడానికి రామయ్య తన జీవితాన్ని అంకితమిచ్చారు.



ఆయన అవిశ్రాంత కృషి.. ప్రకృతి పట్ల గాఢమైన ప్రేమనూ, భవిష్యత్ తరాలపట్ల బాధ్యతను ప్రతిబింబిస్తాయి. ఆయన చేసిన కృషి.. యువతలో మరింత సుస్థిరమైన హరిత గ్రహాన్ని నిర్మించాలనే తపనను ప్రేరేపిస్తూనే ఉంటుంది. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. ఓం శాంతి" అంటూ రాసుకొచ్చారు.

భారత శక్తి
VOICE OF INDIAN

# ఎట్టకేలకు భారత్ కు రాణా... మోడీ దౌత్య ఫలితం

ముంబయి దాడుల నిందితుడు తహవ్వుర్‌రాణాను అమెరికా భారత్‌కు అప్పగించింది.ముంబయి దాడులకు బాధ్యుడైన తహవ్వుర్ రాణాను అమెరికా అప్పగించిందని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) తెలిపింది.అప్పగింత ప్రక్రియ ప్రారంభం కావడానికి ముందు రాణా.. అమెరికాలో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారని ఎన్ఐఏ తెలిపింది. తేదీ 26 నవంబర్ 2008, ముంబైలో ఉగ్రవాద దాడి జరిగిన రోజు ఇదే. ఈ దాడి జరిగి దాదాపు 17 సంవత్సరాలు అయ్యింది. కానీ ఈ కుట్రలో నిందితులైన చాలా మందికి ఇంకా శిక్ష పడలేదు. ముంబై ఉగ్రవాద దాడుల సూత్రధారి తహవ్వూర్ రాణాను ఎట్టకేలకు అమెరికా నుండి భారతదేశానికి తీసుకువచ్చారు. ఇప్పుడు ఈ ఉగ్రవాద దాడిని ఎలా చేశారు..? ఏ కుట్ర పన్నారో త్వరలో బయటపడనుంది. కుట్ర వెనుక దాగి ఉన్న అన్ని రహస్యాలు బయటపడతాయి.ముంబై దాడుల ప్రధాన నిందితుడు తహవూర్ రాణాను ఎన్ఐఏ అధికారులు పాటియాలా హౌస్ కోర్టులో హాజరుపరిచారు. అక్కడి నుంచి ఎన్ఐఏ అతని 18 రోజుల కస్టడీకి తీసుకుంది. నిందితుడు తహవూర్ రాణా అమెరికాలో నివసిస్తున్న పాకిస్తానీ పౌరుడు. రాణాను ఉరితీయాలనే డిమాండ్ ఉంది. అయితే భారతదేశంలో రాణా తరుఫున కేసును వాదించడానికి, అతనిని ఉరి నుండి కాపాడటానికి, న్యాయవాది పియూష్ సచ్‌దేవా వకల్తా పుచ్చుకున్నాడు. రాణాకు చట్టపరంగా ఉన్న దారులన్నీ మూసుకుపోవడంతో ఆయన అప్పగింత సాధ్యపడిందని తెలిపింది.తహవ్వూర్ రాణా 2013లో ఆయన స్నేహితుడు డేవిడ్ కోల్‌మన్ హెడ్లీతో కలిసి ముంబై దాడులకు పాల్పడినందుకు, డెన్మార్క్‌లో దాడికి ప్రణాళిక వేసినందుకు అమెరికాలో ఆయన దోషిగా తేలారు.ఈ కేసుల్లో, తహవ్వూర్ హుస్సేన్ రాణాకు అమెరికా కోర్టు 14 సంవత్సరాల జైలు శిక్ష విధించింది.భారీగా ఆయుధాలు ధరించి శిక్షణ పొందిన పది మంది లష్కరే తోయిబా ఉగ్రవాదులు 2008 నవంబర్ 26న ముంబయిలోని అనేక ప్రదేశాలు, ప్రసిద్ధ భవనాలపై దాడులు చేశారు. ఈ దాడులు నాలుగు రోజుల పాటు కొనసాగాయి. 160 మందికి పైగా మరణించారు.ముంబయి నగరం 2008 నవంబర్ 26వ తేదీ రాత్రి, అకస్మాత్తుగా తుపాకీ కాల్పుల శబ్దంతో దద్దరిల్లింది. దాడి చేసిన వ్యక్తులు ముంబయిలోని రెండు ఫైవ్ స్టార్ హోటళ్ళు, ఒక ఆసుపత్రి, రైల్వే స్టేషన్లు, ఒక యూదు కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకున్నారు.మొదట్లో ఇంత పెద్ద దాడి జరుగుతుందని ఎవరూ ఊహించలేదు. కానీ క్రమంగా దాడి తీవ్రత అర్థమయింది.నవంబర్ 26వతేదీ రాత్రి, ఉగ్రవాద నిరోధక దళం చీఫ్ హేమంత్ కర్కరే సహా ముంబయి పోలీసు ఉన్నతాధికారులు కూడా ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయారు.లియోపోల్డ్ కేఫ్, ఛత్రపతి శివాజీ టెర్మినల్ వద్ద ప్రారంభమైన ఈ మారణకాండ తాజ్ మహల్ హోటల్ వద్ద ముగిసేలోపు దీనిని ఆపేందుకు భద్రతా సిబ్బందికి 60గంటల సమయం పట్టింది. 160మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు.దాడిచేయడానికి వచ్చినవారు రెండు గ్రూపులుగా విడిపోయినట్టు ముంబయి పోలీసులు, దర్యాప్తు అధికారులు చెప్పారు.వీరిలో ఇద్దరు వ్యక్తులు లియోపోల్డ్ కేఫ్‌లోకి చేరుకుని విచక్షణారహితంగా కాల్పులు జరిపారు.ఈ కేఫ్‌కి ఎక్కువగా విదేశీయులు వస్తుంటారు.అక్కడ ఉన్న ప్రజలకు ఏం జరుగుతుందో అర్థమయ్యేలోపే వారు విచక్షణారహితంగా తూటాలు పేల్చి అక్కడి నుంచి పారిపోయారు.అధికారిక గణాంకాల ప్రకారం, లియోపోల్డ్ కేఫ్‌లో జరిగిన కాల్పుల్లో 10 మంది మరణించారు.దేశంలో అత్యంత రద్దీగా ఉండే రైల్వే స్టేషన్లలో.. ముంబయిలోని ఛత్రపతి శివాజీ టెర్మినస్ కూడా ఒకటి .ఆ సమయంలో అక్కడ పెద్ద సంఖ్యలో ప్రయాణికులు ఉన్నారు.దుండగులు ఒక్కసారిగా విచక్షణారహితంగా తూటాలు పేల్చారు.ఈ కాల్పుల్లో అజ్మల్ అమీర్ కసబ్, ఇస్మాయిల్ ఖాన్ పాల్గొన్నారని దర్యాప్తు అధికారులు తెలిపారు.తరువాత అజ్మల్ అమీర్ కసబ్ పట్టుబడ్డారు కానీ ఇస్మాయిల్ ఖాన్ చనిపోయారు.ఈ కాల్పుల్లో 58 మంది మరణించారు.పెద్దమొత్తంలో మందుగుండు సామగ్రితో దుండగులు ఈ హోటల్‌లోకి ప్రవేశించారు.ఆ సమయంలో అక్కడ 350 మందికి పైగా ఉన్నారని భావిస్తున్నారు.వారిలో చాలా మందిని దుండగులు బందీలుగా చేసుకున్నారు.దాడి చేసిన ఇద్దరు దుండగులను జాతీయ భద్రతా దళ సిబ్బంది హతమార్చారు.తాజ్ మహల్ హోటల్‌లో చెలరేగిన అగ్నిప్రమాదం ప్రజల గుండెల్లో అలానే ఉంది.కాల్పులు, పేలుళ్ల మధ్య, తాజ్ మహల్ హోటల్ కాలిపోవడాన్ని వారింకా మరచిపోలేరు.ఈ భవనం 105 సంవత్సరాల పురాతనమైనది.గేట్ వే ఆఫ్ ఇండియా సమీపంలో ఉన్న ఈ హోటల్‌కి ఎక్కువగా విదేశీ పర్యటకులు వస్తుంటారు. ఇక్కడి నుంచి సముద్ర తీరం కూడా కనిపిస్తుంది.హోటల్‌పై దాడి జరిగినప్పుడు, భోజన సమయం కావడంతో అక్కడ చాలా మంది గుమిగూడి ఉన్నారు. అప్పుడు దుండగులు అకస్మాత్తుగా కాల్పులు మొదలుపెట్టారు.ప్రభుత్వ గణాంకాల ప్రకారం, తాజ్ మహల్ హోటల్‌లో 31 మంది మరణించారు.దాడి చేసిన నలుగురు వ్యక్తులు భద్రతా సిబ్బంది చేతిలో చనిపోయారు.కామా హాస్పిటల్ అనేది ఓ చారిటీ ఆసుపత్రి, దీనిని 1880లో ఒక సంపన్న వ్యాపారవేత్త నిర్మించారు.ముంబయి పోలీసుల కథనం ప్రకారం, నలుగురు దుండగులు ఒక పోలీసు వ్యాన్‌ను హైజాక్ చేసి, ఆపై ఆపకుండా కాల్పులు జరిపారు.ఈ క్రమంలో వారు ఆసుపత్రిలోపలికి కూడా ప్రవేశించారు.ఆసుపత్రి బయట జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఉగ్రవాద నిరోధక దళం అధిపతి హేమంత్ కర్కరే, ముంబయి పోలీసులకు చెందిన అశోక్ కామ్టే, విజయ్ సలాస్కర్ మరణించారు.దుండగులు నారిమన్ హౌస్‌ను కూడా లక్ష్యంగా చేసుకున్నారు.దీనిని చాబాద్ లుబావిచ్ సెంటర్ అని కూడా పిలుస్తారు.నారిమన్ హౌస్‌లో కూడా అనేక మందిని బందీలుగా చేసుకున్నారు

# బెజవాడ మెట్రో ముందడుగు

విజయవాడ, ఏప్రిల్ 12,

విజయవాడ వాసులకు ఎప్పటి నుంచో కలగా ఉంటున్న మెట్రో ప్రాజెక్టులో కీలక ముందడుగు పడుతోంది. భూసేకరణ చేపట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. దీనికి సంబంధించిన కసరత్తు మొదలు పెట్టారు. గన్నవరం, పెనమలూరు అధికారులు పర్యటించారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణాలు ఊపందుకుంటున్నాయి. ఆ నగరం పూర్తి అయితే దాని ప్రభావం విజయవాడపై పడనుంది. ఇక్కడ ట్రాఫిక్ రద్దీ పెరిగిపోనుంది. అందుకే ముందు జాగ్రత్తగా అక్కడ మెట్రో ప్రతిపాదన తీసుకొచ్చింది ప్రభుత్వం. ఇప్పటికే దీనికి కేంద్రం కూడా ఓకే చెప్పింది. ఇందులో భాగంగా మరో అడుగు ముందుకేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు మెట్రో నడిచే ప్రాంతాల్లో భూసేకరణకు చర్యలు చేపడుతున్నారు. గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల పరిధిలో అధికారు పర్యటించారు. గన్నవరం, కేసరపల్లిలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, రెవెన్యూ అధికారులతో కలిసి విజయవాడ మెట్రో చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ జీపీ.రంగారావు విజిట్ చేశారు. బస్టాండ్, హెచ్‌సీఎల్, కేసరపల్లి కూడలిలో 12:42 మీటర్ల నిష్పత్తితో మెట్రోను నిర్మించనున్నారు. దీనికి అవసరమైన భూసేకరణపై అధికారులు దృష్టి పెట్టారు. విజయవాడ మెట్రో ప్రాజెక్టును మొదటి దశలో రెండు కారిడార్‌లతో పూర్తి చేయానున్నారు. మొదటి కారిడార్‌ను 26 కిలోమీటర్లు పూర్తి చేస్తారు. ఇది పీఎన్‌బీఎస్(పండింట్ నెహ్రూ బస్‌స్టేషన్) నుంచి గన్నవరం వరకు ఉండబోతోంది. రెండోది పీఎన్‌బీఎస్ నుంచి పెనమలూరు వరకు ఉంటుంది. దీని పొడవు 12.4 కిలోమీటర్లు. మొత్తం 38.4 కిలోమీటర్ల మెట్రోప్రాజెక్టును 34 స్టేషన్లతో ఏర్పాటు చేయనున్నారు. రెండో దశలో 27.75 కిలోమీటర్లు విస్తరించనున్నారు. మొత్తంంగా రెండు దశలు కలుపుకుంటే 66.15 నిడివితో విజయవాడ మెట్రోను పూర్తి చేయనున్నారు. మొదటి దశలో 11వేల 9 కోట్లు ఖర్చు చేసేందుకు అంచనాలు సిద్ధమయ్యాయి. ఈ దశలో భూసేకరణ 1152 కోట్లు కేటాయించారు. ఈ ప్రాజెక్టు కోసం 91 ఎకరాలు సేకరించాలనే ప్రతిపాదనను జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి పంపించారు. దీన్ని వేగవంతం చేసేందుకు అధికారులు ఇప్పుడు క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నారు. కృష్ణా జిల్లాలో 70.95 ఎకరాలు, ఎన్టీఆర్ జిల్లాలో 11.71 ఎకరాలు సేకరించనున్నారు. ఈ భూముల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన భూమలు కూడా ఉన్నాయి. రైల్వే శాఖకు చెందిన భూమి ఎకరాకుపైగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన భూమి దాదాపు ఐదు ఎకరాల వరకు ఉంది. మిగతా 75 ఎకరాలకుపైగా భూమిని ప్రైవేటు వ్యక్తుల నుంచి సేకరించాల్సి ఉంది. ఈ మెట్రో ప్రాజెక్టు పూర్తి అయితే విజయవాడ రూపురేఖలు మారిపోతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. అందుకే దీన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని కేంద్రంతో చర్చించి డీపీఆర్‌ను ఒప్పించుకుంది. ఇప్పుడు భూసేకరణకు సంబంధించిన అడ్డంకులను అధిగమించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ మెట్రో ప్రాజెక్టును చాలా భిన్నంగా నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. హైవే గుండా నిర్మిస్తున్నందున వాహనాలకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకోనున్నారు. అందుకే దీన్ని డబుల్ లేయర్ మెట్రో నిర్మించనున్నారు. ఫ్లైఓవర్ మీదుగా మెట్రో ట్రాక్ వేస్తారు. రామవరప్పాడు వద్ద ఒక ఫ్లైఓవర్ ఉంటుంది. దానిపై మరో ఫ్లై ఓవర్ ఉంటుంది. దానిపై మెట్రో లైన్ వస్తుంది. భిన్నంగా ఉండే ఈ మెట్రోతోపాటు విశాఖలో నిర్మించనున్న మెట్రో కోసం కేంద్రం నుంచి భారీగా నిధులు విడుదల చేయాలని ప్రభుత్వం కోరింది. ఈ రెండు నగరాల్లో మెట్రో ప్రాజెక్టుల కోసం 42,362 కోట్లు ఇవ్వాలని రిక్వస్ట్ పెట్టుకుంది.

# పాపం...గోరంట్ల

## మీడియా ముందు ముసుగేసి

అనంతపురం, ఏప్రిల్ 12,

పోలీసుల అదుపులో ఉన్న నిందితుడిపై దాడికి పాల్పడుతూ, పోలీసులపై జులుం ప్రదర్శించి వారి విధులకు ఆటంకం కలిగించిన గోరంట్ల.మాధవ్ తో పాటు ఆయన ఐదుగురు అనుచరులను అరెస్ట్ చేశామని గుంటూరు ఎస్పీ సతీష్ కుమార్ ప్రకటించారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి సతీమణి వైఎస్ భారతిపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసిన చేబ్రోలు కిరణ్ అనే నిందితుడిని అరెస్టు చేసి గుంటూరుకు తరలిస్తుండగా తన అనుచరులతో పోలీస్ వాహనాన్ని అనుసరించారు గోరంట్ల మాధవ్. కారు ఆపి మరీ పోలీస్ కస్టడీలో ఉన్న నిందితుడిపై గోరంట్ల మాధవ్ దాడికి పాల్పడ్డారని ఎస్పీ తెలిపారు. మంగళగిరి రూరల్ పోలీసులు గోరంట్ల మాధవ్, అతని అనుచరుల బారి నుండి నిందితుడిని రక్షించి గుంటూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి తీసుకొస్తుండగా మరలా గోరంట్ల మాధ వ్అతని అనుచరులు పోలీస్ వాహనాన్నితమ వాహనాలతో వెంబడిస్తూ నిందితుడిని , పోలీసులను భయభ్రాంతులకు గురి చేశారని ఎస్పీ తెలిపారు. పోలీస్ కస్టడీలో ఉన్న నిందితుడిపై దాడికి పాల్పడటం, పోలీస్ విధులకు ఆటంకం కలిగించడాన్ని తీవ్రంగా పరిగణించి భవిష్యత్తులో ఎవరూ కూడా ఇటువంటి నేరపూరిత చర్యలకు పాల్పడకుండా ఉండాలని గోరంట్ల.మాధవ్ మరియు అతని అనుచరులపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేశామని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా చట్ట వ్యతిరేక బృందాన్ని పోగుచేయడం. ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యా శాఖ మంత్రి గురించి అసభ్యకరంగా , వ్యక్తిగత దూషణలకు పాల్పడటం వంటి పలు ఘటనలకు సంబంధించి గోరంట్ల మాధవ్ పై కేసులు నమోదై ఉన్నాయన్నారు. అలాగే ఒక పోక్సో కేసుతో పాటు 04 ఇతర కేసులు కూడా నమోదయ్యాయని ఎస్పీ తెలిపారు. గోరంట్ల మాధవ్ మాజీ సీఐ . ఎంతో మంది నిందితుల్ని, నేరస్తుల్ని అలా మీడియా ముందు నిలబెట్టి ఉంటారు..ఇప్పుడు ఆయనే అలా నిలబడాల్సి వచ్చింది. మీడియా ముందు ఆయనను ప్రవేశ పెట్టేందుకు తీసుకు వచ్చే సమయంలో.. ఆయన పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తాము మాజీ పోలీసు అధికారినని..మాజీ ఎంపీనని.. మీడియా ముందు ఎలా నిలబెడతారని ఆయన పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అయితే పోలీసుల కస్టడీలో ఉన్న ఆయనకు ముసుగేసి మీడియా ముందు ప్రవేశ పెట్టి.. ఆ తర్వాత కోర్టుకు తరలించారు. మాజీ ఎంపీగా ఉన్న ఆయన దుందుడుకుగా మాట్లాడుతూ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూంటారు. మామూలుగా అయితే ఆయన అరెస్టు అయ్యే వారు కాదు. అరెస్టు చేస్తారని తెలిసి కూడా ఆయన పోలీసుల కస్టడీలో ఉన్న నిందితుడ్ని పోలీసులపై దౌర్జన్యం చేసి మరీ దాడి చేసే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఆయనను అడ్డుకోవడానికి ఓ పోలీసు అధికారి చెంప చెళ్లుమనిపించారని చెబుతున్నారు. ఇప్పుడు గోరంట్ల మాధవ్ .. జైల్లో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది

# గంటా ఫ్రస్టేషన్ కు ఫుల్ స్టాప్ ఎప్పుడూ...

విశాఖపట్టణం, ఏప్రిల్ 12, (న



గంటాశ్రీనివాసరావు సీనియర్ రాజకీయ నాయకుడు. ఆయన పార్టీలు మారినా అధికారంలో ఉన్న పార్టీలో చేరి మంత్రి అయ్యారు. ఆయనకు ఉన్న అంగబలం, అర్థబలం మంత్రిపదవిని తెచ్చిపెట్టాయి. తొలుత తెలుగుదేశం పార్టీలో చేరి 2004లో చోడవరం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. తర్వాత ప్రజారాజ్యం పార్టీలో చేరి అనకాపల్లి నుంచిపోటీ చేసి గెలుపొందారు. తర్వాత ప్రజారాజ్యం కాంగ్రెస్ లో విలీనం అయిన తర్వాత కాంగ్రెస్ హయాంలో మంత్రి పదవిని చేపట్టారు. 1999లో అనకాపల్లి లోక్ సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2019 లో టీడీపీ నుంచి విశాఖ ఉత్తరం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రకాశం జిల్లాకు చెందిన గంటా శ్రీనివాసరావు విశాఖకు వచ్చి స్థిరపడి పారిశ్రామికవేత్తగా ఎదిగారు. తర్వాత రాజకీయ నాయకుడిగా మారారు.ప్రతి సారీ నియోజకవర్గాలు మారటం ఆయనకు హాబీ. ఒకసారి పోటీ చేసిన నియోజకవర్గంలో మరోసారి పోటీ చేయరు. అలా తన రాజకీయాలను నెట్టుకొస్తున్న గంటా శ్రీనివాసరావుకు ఈసారి మాత్రం చంద్రబాబు కేబినెట్ లో చోటు దక్కలేదు. తనకంటే పార్టీలో జూనియర్ అయిన వంగలపూడి అనితకు హోంమంత్రిగా నియమించడం, అదే జిల్లాకు చెందిన అయ్యన్నపాత్రుడికి స్పీకర్ పదవి రావడంతో గంటా శ్రీనివాసరావుకు మంత్రి పదవి దక్కలేదు. అదే సమయంలో గంటా శ్రీనివాసరావు వియ్యంకుడు నారాయణకు మంత్రి పదవి దక్కడంతో పాటు జనసేన నుంచి కాపులు, టీడీపీ నుంచి కాపులు ఎక్కువగా ఉండటంతో సామాజికవర్గం కూడా గంటా శ్రీనివాసరావును దెబ్బతీసిందనే చెప్పాలిఅయితే గంటా శ్రీనివాసరావుపై అధినాయకత్వానికి గతంలో ఉన్న సదభిప్రాయం మాత్రం లేదనే చెప్పాలి. ఎందుకంటే 2019 ఎన్నికల్లో టీడీపీ నుంచి గెలిచిన గంటా శ్రీనివాసరావు అసెంబ్లీలో పెద్దగా యాక్టివ్ గా లేకపోవడంతో పాటు కనీసం ఆయన కూర్చున్న చోటు నుంచి లేచి అప్పటి అధికారపక్షాన్ని ఎదిరించలేదన్న విమర్శలున్నాయి. అదే సమయంలో చంద్రబాబుపైనా, ఆయన కుటుంబసభ్యులపైన అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నా గంటా శ్రీనివాసరావు పట్టీపట్టనట్లు వ్యవహరించారన్నది ప్రధాన ఆరోపణ. అందుకే ఈసారి మంత్రివర్గంలో దూరం పెట్టారన్నది పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. ఇక ఐదేళ్ల పాటు గంటా శ్రీనివాసరావు సాధారణ ఎమ్మెల్యేగానే చూడాల్సి ఉంటుందిఅందుకే ఆయనలో ఫ్రస్టేషన్ ఎక్కువగా కనిపిస్తుంది. తరచూ ఉద్యోగులపై దూషణలకు దిగడంతో పాటు తరచూ సహనం కోల్పోతున్నారు. అధికారంలోకి వచ్చినా తనకు మంత్రి పదవి రాలేదన్న అక్కసు ఆయనలో అడుగడుగునా కనిపిస్తుంది. ఇక ఐదేళ్ల పాటు కాపు సామాజికవర్గం కోటాలో గంటా శ్రీనివాసరావుకు మాత్రం మంత్రి పదవి దక్కే ఛాన్స్ లేదు. నారాయణ చంద్రబాబు మంత్రి వర్గంలో పూర్తికాలం మంత్రిగా కొనసాగుతారు. అలాగే జనసేన నుంచి ఇద్దరు ముగ్గురు కాపు సామాజికవర్గానికి చెందిన మంత్రులుంటారు. ఈ నేపథ్యంలో గంటా శ్రీనివాసరావుకు కనుచూపు మేరలో మంత్రి పదవి దొరకడం అసాధ్యమని తెలిసి కొంత ఫ్రస్టేషన్ కు గురవుతున్నట్లు కనిపిస్తుంది.

# వన్యజీవి రామయ్య మృతి

ఖమ్మం, ఏప్రిల్ 12

పద్మశ్రీ వనజీవి రామయ్య మృతి పట్ల తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం పట్ల సంతాపం తెలిపారు. రామయ్య మరణం సమాజానికి తీరని లోటని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రాగాడ సానుభూతి తెలియజేశారు. ప్రకృతి, పర్యావరణం లేనిదే మానవ మనుగడ లేదనే సిద్ధాంతాన్ని బలంగా నమ్మిన వ్యక్తి వనజీవి రామయ్య అని సీఎం రేవంత్ అన్నారు. ఆయన సూచించిన



మార్గాలు నేటి యువతకు మార్గదర్శకం అని సీఎం రేవంత్ అన్నారు. పర్యావరణ రక్షణ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన వనజీవి రామయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ప్రాస్థిస్తున్నట్టు సీఎం రేవంత్ తెలిపారు.ప్రకృతి ప్రేమికుడు, హరిత స్వాప్నికుడు, వనజీవి రామయ్య మృతి సమాజానికి తీరని లోటుని మాజీ మంత్రి బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వృక్షో రక్షతి రక్షితః అన్న సిద్ధాంతాన్ని త్రికరణశుద్ధిగా ఆచరించి, మొక్కలను బిడ్డలవలే పెంచిన వ్యక్తి రామయ్య అని హరీష్ రావు అన్నారు.రామయ్య మృతిపై అటు ఏపీ మంత్రి నారా లోకేష్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వనజీవి రామయ్య మరణం బాధాకరం అన్నారు. “వృక్షో రక్షతి రక్షితః” అన్న ఆయన జీవన సందేశమే ఆయన జీవిత సారాంశమని తెలిపారు. చెట్లను మన వంశపారంపర్యంగా భావించి, వాటిని సంరక్షించడం ద్వారా మన భవిష్యత్తును కాపాడతామని చెప్పిన ఆయన, అసలైన పర్యావరణ యోధుడని లోకేష్ తెలిపారు. ఆయన చూపిన మార్గాన్ని మనందరం అనుసరిస్తేనే ఆయనకు నిజమైన నివాళి అవుతుందని లోకేష్ అన్నారు. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి.వృక్షో రక్షతి రక్షితః అన్న సిద్ధాంతాన్ని త్రికరణశుద్ధిగా ఆచరించిన వ్యక్తి పద్మశ్రీ వనజీవి రామయ్య. ఈయన శనివారం(ఏప్రిల్ 12) తెల్లవారుజామున గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. కోటి మొక్కలు నాటి ఇంటి పేరును వనజీవిగా మార్చుకున్న వ్యక్తి దరిపల్లి రామయ్య. ఆయన సేవలకు గాను 2017లో కేంద్ర ప్రభుత్వం రామయ్యను పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది.

# వేగంగా హై స్పీడ్ ట్రైన్స్...

గాంధీనగర్, ఏప్రిల్ 12

గత కొన్నేళ్లుగా భారత రైల్వే వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వందే భారత్, హై స్పీడ్ రైల్, మెట్రో వంటి అత్యాధునిక రైళ్లు ఒక్కొక్కటిగా పట్టాలపైకి ఎక్కి ప్రయాణికులకు సౌకర్యవంతమైందే కాకుండా వేగవంతమైన ప్రయాణాన్ని అందిస్తున్నాయి. ఢిల్లీ నుండి వారణాసి దూరం 840 కి.మీ. ప్రస్తుతం ఈ మార్గంలో రైలులో ప్రయాణించడానికి దాదాపు 12 గంటలు పడుతుంది. ఢిల్లీ-వారణాసి హై స్పీడ్ రైలు కారిడార్ పనులు 2029 నాటికి పూర్తవుతాయి. దీని మొత్తం వ్యయం రూ.43 వేల కోట్లుగా అంచనా వేస్తున్నారు. అయితే వారణాసి నగరం వరకు ఈ మార్గంలో పనులు పూర్తయిన తర్వాత, ఈ మార్గంలో ప్రతిరోజూ 18 రైళ్లు నడుస్తాయని తెలుస్తోంది. ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల మధ్య ప్రతి 47 నిమిషాలకు ఒక బుల్లెట్ రైలు నడుస్తుంది. ఢిల్లీ నుండి వారణాసితో సహా ఉత్తరప్రదేశ్‌లోని అనేక నగరాలకు చేరుకోవడం సులభం అవుతుంది.అంతేకాకుండా దేశవ్యాప్తంగా ప్రధాన రైల్వే స్టేషన్లను ఎయిర్‌పోర్టుల తరహాలో అభివృద్ధి చేస్తోంది కేంద్ర ప్రభుత్వం. ఈ నేపథ్యంలోనే దేశంలో బుల్లెట్ రైళ్లు పరుగులు తీయనున్నాయి. ముందుగా ముంబై-అహ్మదాబాద్ మధ్య బుల్లెట్ రైల్వే కారిడార్ శరవేగంగా రూపుదిద్దుకుంటోంది. ఈ క్రమంలోనే భారతదేశ తొలి హైస్పీడ్ రైలు తయారీకి రంగం సిద్ధం అయింది.ఈ క్రమంలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పార్లమెంటరీ నియోజకవర్గం వారణాసి నుండి రాజధాని న్యూఢిల్లీకి బుల్లెట్ రైలును నడపడానికి భారత ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఢిల్లీ నుండి దాదాపు 840 కి.మీ దూరంలో ఉన్న వారణాసికి ప్రయాణం అంత సులభం కాదు. రైలు అయినా, బస్సు ప్రయాణం అయినా, రోడ్డు ప్రయాణం అయినా, వారణాసి చేరుకోవడం అలసిపోయేలా చేస్తోంది. విమాన ఛార్జీలు ఖరీదైనవి కాబట్టి, అందరూ దీనిని ఉపయోగించుకోలేరు. ఇప్పుడు బుల్లెట్ రైలులో కేవలం మూడున్నర గంటల్లోనే ప్రయాణాన్ని పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.బుల్లెట్ రైలు ఉత్తరప్రదేశ్‌కు ఒక వరం లాంటిది. మీడియా కథనాల ప్రకారం, ఢిల్లీ నుండి వారణాసి వరకు బుల్లెట్ రైలు త్వరలో పరుగులు పెట్టనున్నట్లు తెలుస్తోంది. అయితే ఢిల్లీ-వారణాసి మధ్య ప్రయాణాన్ని కేవలం మూడున్నర గంటల్లో పూర్తి చేయవచ్చు. రెండు నగరాల మధ్య 12 స్టేషన్లు ఉంటాయి. ఈ రైలు ఢిల్లీలోని హజ్రత్ నిజాముద్దీన్ స్టేషన్ నుండి ప్రారంభమై నోయిడా సెక్టార్ 146, జెవార్ విమానాశ్రయం, మధుర, ఆగ్రా, ఎటావా, కన్నౌజ్, లక్నో, రాయ్ బరేలి, ప్రతాప్‌గఢ్, ప్రయాగ్‌రాజ్, భదోహి మీదుగా వారణాసిలోని మండుదిహ్ స్టేషన్‌కు వెళ్తుంది.బుల్లెట్ రైలు కోసం ఢిల్లీలోని సరాయ్ కాలే ఖాన్‌లో కొత్త భూగర్భ స్టేషన్‌ను నిర్మిస్తున్నారు. దీని కోసం 15 కి.మీ సొరంగం సిద్ధం చేస్తున్నారు.

# రామయ్య మరణం తీరని లోటు

హైదరాబాద్

వనజీవి రామయ్య మృతిపట్ల సీఎం రేవంత్ సంతాపం వ్యక్తం చేసారు. వనజీవి రామయ్య మరణం సమాజానికి తీరని లోటు. పర్యావరణం లేనిదే మానవ మనుగడ సాధ్యం కాదు. పర్యావరణ పరిరక్షణలో అయన సమాజాన్ని ప్రభావితం చేశారు. దరిపల్లి రామయ్య వనజీవి రామయ్యగా మారారని అన్నారు.

# రాజ్ గోపాల్ పేట లో హరీష్ రావు పర్యటన

సిద్దిపేట

సిద్దిపేట నియోజకవర్గం నంగునూర్ మండలం రాజ్ గోపాల్ పేట్ గ్రామం లో ఇటీవల కురిసిన అకాల, వడ గండ్ల వర్షాలకు నష్ట పోయిన పంట పొలాలను మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు పరిశీలించారు.

హరీష్ రావు మాట్లాడుతూ వడగండ్ల వానతో రైతులు తీవ్రమైన ఆందోళనలో ఉన్నారు. నంగునూరు మండల్ రాజగోపాల్ పేట్ గ్రామంలో వడగండ్ల వాన వల్ల దెబ్బతిన్న పంటలను పరిశీలించడం జరిగింది.

9,000 కోట్ల రూపాయలు రైతుబంధు ఇవ్వాల్సి ఉంటే నాలుగు వేల కోట్లు మాత్రమే ఇచ్చాం అంటున్నారు. ఇంకా 5000 కోట్లు రైతుబంధు కోతపెట్టారు.

వానకాలం 9000 కోట్లు ఈ యాసంగి 5వేల కోట్లు మొత్తం 14 వేల కోట్లు ప్రభుత్వం రైతులకు ఎగబెట్టింది. 14 వేల కోట్లు రైతుబంధు ఎగ్గొట్టి వాటిని రుణమాఫీలో ఇచ్చినట్టు చూపిస్తున్నారు. కరోనా కష్టకాలంలో కూడా రైతులకు రైతుబంధు ఆపలేదు కేసీఆర్. పంట బీమాకు సంబంధించి బడ్జెట్లో డబ్బులు పెట్టి ఒక్క రైతుకు కూడా ఇవ్వలేదు. వంట నష్టపరిహారం ఎకరానికి 6,000 ఉంటే కేసీఆర్ గారు పదివేలకు పెంచారు. పోయిన ఎండాకాలం సిద్దిపేట జిల్లాలో 1,350 ఎకరాల్లో వడగళ్ల వానకు పంట నష్టం జరిగింది. ఈ 1350 ఎకరాలకు పంట నష్టం ఇప్పటివరకు ప్రభుత్వం చెల్లించలేదు. తక్షణమే పంట నష్టపోయిన రైతులకు ఇన్పుట్ సబ్సిడీ అందించాలని వారి తరపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము. ఆరుగాలం కష్టం చేసిన రైతులకు నోటికాడి బుక్క కొట్టినట్టు అయింది. నంగునూరు మండలంలో 11 గ్రామాల్లో దాదాపు 5,300 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు గుర్తించాము. ఒక సిద్దిపేట జిల్లాలోనే 10000 వేల ఎకరాలు పంట నష్టం జరిగిందని అంచనా. 2500 ఎకరాల హార్టికల్చర్ పంటలు కూడా నష్టపోయాయి. ఇన్పుట్ సబ్సిడీతోపాటు యాసంగి రైతుబంధు కూడా వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారని అన్నారు. రైతు బీమా విషయంలో కూడా ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. చాలామంది చనిపోయిన రైతులకు రైతు బీమా అందడం లేదు.

వెంటనే చనిపోయిన రైతు కుటుంబాలకు రైతు బీమా డబ్బులను విడుదల చేయాలి.

కేసీఆర్ ఉండంగా అనేక విత్తనాలు సబ్సిడీ కింద ఇచ్చేవారు. కందులు, పెసర్లు, వరి లాంటి విత్తనాలను సబ్సిడీ కింద ప్రభుత్వం అందించేది. ప్రభుత్వం సబ్సిడీ కింద విత్తనాలను అందుబాటులో పెట్టి రైతులకు సకాలంలో అందించాలని కోరుతున్నాం. పంట నష్టపోయిన రైతులకు ఇన్పుట్ సబ్సిడీతో పాటు వచ్చే వానకాలానికి విత్తనాలు ఉచితంగా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని అన్నారు.

కౌలు రైతుల గురించి ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదు. కౌలు రైతుకు రైతుబంధు ఇస్తామన్న ప్రభుత్వం ఇప్పుడు ఎందుకు మాట్లాడటం లేదు.ఇటు రైతు బంధు రాక ఇన్పుట్ సబ్సిడీ రాక కౌలు రైతులు ఇబ్బంది పడుతున్నారు. తక్షణమే వడగండ్ల వానకు పంట నష్టపోయిన కౌలు రైతులకు కూడా ఇన్పుట్ సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

# 27 కిలో మీటర్లు, లక్షలాది జనం

హైదరాబాద్కర్మాన్ ఘాట్ హనుమాన్ దేవాలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించి జెండా ఊపి శోభాయాత్రను కమలానంద భారతి స్వామి ప్రారంభించారు.కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయం నుండి ప్రారంభమై కోటి మీదుగా ప్రధాన ర్యాలీ తో కలసి తాడ్ బంద్ వీర హనుమాన్ దేవాలయం వరకు శోభయాత్ర ఉంటుందని విశ్వహిందూ పరిషత్ బజరంగ్దళ్ కేంద్రీయ అధికార ప్రతినిధి డాక్టర్ శశిధర్ తెలిపారు.హిందువులు ఐక్యత పెంపొందించడానికి దేవాలయాల వ్యవస్థను,గోమాతను రక్షించుకోవడానికి ఒక సంఘటిత శక్తిగా హిందూ ధర్మాన్ని కాపాడడానికి ఈ శోభ యాత్ర జరుగుతుందని స్వామిజీ కమలానంద భారతి తెలిపారు.ఈ శోభాయాత్ర భాగ్యనగర్ కి ఒక సంస్కృతి కి ప్రతిక అని శశిధర్ తెలిపారు. దేశద్రోహులకు,మతోన్మాద వ్యక్తులకు భారతదేశంలో స్థానం లేదని శశిధర్ తెలిపారు.

# కర్మన్ ఘాట్ ఆలయంలో ఎమ్మెల్సీ కవిత పూజలు

హైదరాబాద్హనుమాన్ జయంతి సందర్భంగా కర్మన్ ఘాట్ హనుమాన్ ఆలయంలో ఎమ్మెల్సీ కవిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఆలయ అర్చకులు, నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు.పూజ అనంతరం ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఎమ్మెల్సీ కవిత మాట్లలాడుతూ రాష్ట్ర ప్రజలకు హనుమాన్ జయంతి శుభాకాంక్షలు. తెలంగాణ ప్రజలందరికీ హనుమంతుడి అనుగ్రహం లభించాలి.హనుమంతుని దయతో ప్రతి ఒక్కరి జీవితాలు విజ్ఞానంతో నిండి ఉండాలి. ప్రతి ఒక్కరిలో భక్తి భావం ఉండాలి. హనుమంతుడి కృప ఎల్లప్పుడూ తెలంగాణ ప్రజలపై ఉండాలని అకాంక్షిస్తున్నానని అన్నారు.

# మార్పు పదాన్నే నమ్ముకున్న జగన్

కడప, ఏప్రిల్ 12,



వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఒంటరి పోరు చేస్తున్నారు. అయితే ఇది ఎంతవరకూ విజయాన్ని అందిస్తుందన్నది పక్కన పెడితే జగన్ ఆత్మవిశ్వాసానికి మాత్రం మంచి మార్కులు వేయాల్సిందే. కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చిన నాటి నుంచి జగన్ తీసుకున్న రాజకీయ నిర్ణయాలే ఆయనను ప్రజల్లో హీరోగా నిలిచేలా చేశాయన్న దానిలో నిజముంది. సోనియా గాంధీ అంతటి నేతనే ఎదిరించి బయటకు వచ్చి సొంత పార్టీ పెట్టడం అంటే ఆషామాషీ కాదు. అంతేకాదు పదహారు నెలలు జైలులో ఉండటానికి కూడా ఆయన సిద్ధపడ్డాడు. జగన్ కు సుఖాలు ఎంత తెలుసో? కష్టాలు అదేస్థాయిలో అనుభవించిన నేతగా ప్రజల్లో పేరుపొందారు. కష్టాలను కూడా చిరునవ్వుతో స్వీకరించడం జగన్ స్పెషాలిటీ.ఇప్పుడు వచ్చే ఎన్నికల్లో తిరిగి తామే మళ్లీ అధికారంలోకి వస్తామని జగన్ పదే పదే చెబుతూ క్యాడర్ లో ఆత్మవిశ్వాసాన్ని, ధైర్యాన్ని నింపే ప్రయత్నం చేస్తున్నారు. జగన్ ప్రదర్శించే ధైర్య సాహసాలే ఆయనకు ఎక్కువ మంది అభిమానులను తెచ్చిపెట్టాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇక సినిమా హీరో కు ఉన్నంత క్రేజ్ జగన్ కు ఉండటం, జగన్ బయటకు వస్తే వేల సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు తరలి రావడం అసాధారణమైన విషయమే. అధికారంలో ఉన్నప్పుడంటే జనసమీకరణ చేశారని అనుకోవచ్చు. ఓటమి తర్వాత రాష్ట్రంలో ఎక్కడ పర్యటించినా జగన్ ను ఊపిరి తీసుకోనివ్వకుండా కార్యకర్తలు చుట్టుముడుతున్నారంటే జగన్ బలం ఏంటో వేరే చెప్పాల్సిన పనిలేదుఅందుకే ప్రత్యర్థులు ఎవరూ జగన్ ను ఎప్పుడూ తక్కువ అంచనా వేయరు. వేయలేరు కూడా. ఆంధ్రప్రదేశ్ లో విచిత్రమైన రాజకీయ పరిస్థితులున్నాయి. అయితే టీడీపీ లేదంటే వైసీపీ అధికారంలోకి రావాల్సిందే. ఈ రెండు పార్టీలకు మరో ప్రత్యామ్నాయం లేదు. ఓటు బ్యాంకు విషయంలోనూ వైసీపీకి బలం మామూలుగా లేదు. క్షేత్రస్థాయిలో బలమైన పార్టీగా ఎదిగిన వైసీపీకి గత ఎన్నికల్లోనూ దారుణంగా ఓటమి చవి చూసినా నలభై శాతం ఓట్లు వచ్చాయంటే సామాన్య విషయమేమీ కాదన్నది రాజకీయ విశ్లేషకుల అంచనా. సీట్ల నెంబర్లలో తేడా ఉండవచ్చేమో కానీ, మూడు పార్టీలు కలిస్తే వచ్చిన ఓట్లలో జగన్ పార్టీకి నలభై శాతం ఓట్లు వచ్చాయంటే ఎక్కువ మంది జనం జగన్ అభిమానిస్తున్నట్లే లెక్కేసుకుని మరీ ప్రస్తుత పాలకులు వచ్చే ఎన్నికలకు సిద్ధం కావాల్సి ఉంటుంది.సహజంగా ఎన్ని మంచి పనులుచేసినా, జనం మార్పు కోరుకుంటారు. జగన్ కూడా బహుశా అదే అంచనాలో ఉన్నట్లుంది. అందుకే చాలా కాన్ఫిడెంట్ గా వచ్చే ఎన్నికల్లో విజయం తమదేనని చెబుతున్నారు. అదే సమయంలో ఇకపై తాను జనంలోనే ఉంటానని కూడా హామీ ఇస్తున్నారు. జగన్ నిజంగా జనంలోకి వస్తే పార్టీకి మరింత హైప్ రావడం ఖాయమన్న అంచనాలు వినపడుతున్నాయి. మరోవైపు వైసీపీ నేతలు వరస అరెస్ట్ లు కూడా పార్టీకి కొద్దో గొప్పో సానుభూతిని తెచ్చిపెడతాయి తప్పించి, నష్టం మాత్రం చేకూర్చవన్న నమ్మకంతో ఫ్యాన్ పార్టీ నేతలున్నారు. మొత్తం మీద ఏతా వాతా జగన్ మాత్రం తదుపరి ముఖ్యమంత్రిని తానేనని ఫిక్స్ అయినట్లే కనపడుతుంది. మరి ప్రజల తీర్పు రావడానికి మరోనాలుగేళ్ల సమయం ఉంది. ఈలోగా ఎన్ని మార్పులు జరుగుతాయన్నది వేచి చూడాలి.

# శారదా పీఠానికి దారేది...

విశాఖపట్టణం, ఏప్రిల్ 12,




విశాఖ శారదాపీఠానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ఇప్పటికే 15 ఎకరాల భూముల అనుమతులు రద్దు చేసిన సర్కార్?తాజాగా ఆక్రమించిన 5వందల కోట్ల విలువైన భూములపై ఫోకస్ చేసింది. ఆ భూములను వెంటనే ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేసింది. వారం రోజుల్లో ఖాళీ చేయకపోతే?తామే కూల్చివేస్తామంటూ నోటీసుల్లో ప్రస్తావించింది.భక్తి ముసుగులో ప్రభుత్వ భూములను ఆక్రమించింది విశాఖ శారదాపీఠం. వందల కోట్లు విలువ చేసే భూములను?ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టింది. ఒకటి కాదు రెండు కాదు?ఏకంగా వందల కోట్లు విలువైన భూములను తమ ఆధీనంలోకి తీసుకుంది. వైసీపీ హయాంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించింది విశాఖ శారదాపీఠం. గత ప్రభుత్వం అండతో విచ్చలవిడిగా భూములను ఆక్రమించింది. వందల కోట్ల భూములను కబ్జా చేసేసింది. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత?శారదాపీఠం భూములపై ఫోకస్ చేసింది. తాజాగా ఆక్రమించిన భూములను వెంటనే ఖాళీ చేయాలని పీఠం మేనేజర్కు నోటీసులు ఇచ్చింది. అంతేకాదు వారం రోజుల్లో సమాధానం ఇవ్వకపోతే?తామే ఆక్రమణలను కూల్చివేస్తామని హెచ్చరికలు జారీ చేసింది. సర్వే నంబర్ 90లో ఉన్న రహదారి భూమిని ఆక్రమించుకున్నారని?ఇది ప్రభుత్వ భూమి. ఇందులో నిర్మాణాలు చేశారని నోటీసుల్లో స్పష్టం చేసింది. భూమిని ఎందుకు స్వాధీనం చేసుకోకూడదో, అక్రమ నిర్మాణాలను ఎందుకు జప్తుచేయకూడదో వారంరోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది.విశాఖ జిల్లా పెందుర్తి మండలం చినముషిడివాడలో శారదా పీఠం ఉంది. ఈ పీఠం చుట్టూ?జీవీఎంసీ, రెవెన్యూ శాఖకు చెందిన విలువైన భూములు ఉన్నాయి. ఇటు రెవెన్యూ, అటు మున్సిపల్ భూములను పీఠం ఆక్రమించుకుని నిర్మాణాలు చేసినట్లు అధికారులు గుర్తించారు. వీటి విలువ 5వందల కోట్లపైనే. ఈ భూముల సర్వేకు రెవెన్యూ అధికారులు ప్రయత్నించడంతో శారదాపీఠం అడ్డుకుంది. భూములపై దృష్టి పెట్టిన కూటమి సర్కార్?కలెక్టర్, జేసీలను అమరావతికి పిలిపించి భూములకు సంబంధించిన పూర్తి వివరాలు తీసుకుంది. ఆ తర్వాత ఆక్రమణలపై శారదాపీఠానికి నోటీసులివ్వాలని ఆదేశించింది. ఆంధ్రప్రదేశ్ భూ ఆక్రమణ చట్టం-1905లోని సెక్షన్ 7 కింద?పెందుర్తి తహసీల్దార్ శారదాపీఠానికి నోటీసులు ఇచ్చారు. వీఎంఆర్డీఏ ఆమోదించిన మున్సిపల్ స్థలం కూడా పీఠం ఆక్రమణలో ఉంది. దాన్ని స్వాధీనం చేసుకునేందుకు వీఎంఆర్డీఏ కమిషనర్ హోదాలో కలెక్టర్ మరో నోటీసు ఇవ్వనున్నారు.శారదా పీఠం విశాఖ నగరంలోని పెందుర్తి మండల పరిధిలోని చినముషిడివాడలో ఉంది. ఇక్కడ సర్వే నెంబరు 87/1లో ఈనాం పుంజ 4.85 ఎకరాలుంది. ఇందులో 35 సెంట్లు భూమి ఆక్రమణకు గురైంది. ఇది వీఎంఆర్డీఏ ఆమోదించిన లే-అవుట్లో (ఎల్పీ నెంబరు 11/86) రోడ్డుగా ఉంది. క్షేత్రస్థాయిలో శారదా పీఠం కార్యాలయ భవనం, గెస్ట్హౌస్, స్వామిజీ పీఠం, తారు రోడ్డుతో ప్రవేశ గేటు అందులో ఉన్నాయి. సర్వే నెంబరు 90లో పోరంబోకు భూమి 72 సెంట్లు ఉంది. ఇందులో 22 సెంట్లు రెవెన్యూ రికార్డుల్లో రస్తాగా నమోదైంది. ఈ 22 సెంట్లలో ప్రస్తుతం పీఠం దేవాలయం, తారు రోడ్డు, సగం వరకు కమ్యూనిటీహాల్ భవనం ఉన్నాయి. 91/1 సర్వే నెంబరులో సర్కార్ పుంజ 2.96 ఎకరాలు, 91/3 సర్వే నెంబరులో 1.30 ఎకరాలుంది. ఈ రెండింటి పరిధిలో 16 సెంట్లు వీఎంఆర్డీఏ లేఅవుట్ లో ఖాళీ స్థలంగా ఉంది. ఇందులో ప్రస్తుతం విద్యార్థులకు, టీచర్లకు వసతి గృహంతోకూడిన వేదపాఠశాల ఉన్నాయి. సర్వే నెంబరు 91/9లో 81 సెంట్లు సర్కార్ పుంజ ఉండగా, అందులో 41 సెంట్లలో 3 దేవాలయాలు, సగం కమ్యునిటీ హాల్ నిర్మించి పీఠం ఆధీనంలో ఉన్నాయి.విశాఖలో 300 కోట్లు విలువజేసే భూమిని రూ.15 లక్షలకు శారదాపీఠానికి గత ప్రభుత్వం అప్పగించింది. మార్కెట్ విలువ వసూలు చేయాల్సి ఉన్నా?తక్కువ ధరకే కట్టబెట్టారు. ఎకరా రూ.1.5 కోట్లు విలువ ఉండగా?కేవలం రూ.1 లక్షకే శారదా పీఠానికి భూములను కేటాయించింది. భూముల కేటాయింపులకు జీవీఎంసీ ఆమోదం పొందలేదు. ఎన్వోసీ కూడా తీసుకోలేదు. వేద పాఠశాల కోసం భూములు తీసుకుని వాణిజ్య అవసరాల కోసం అనుమతి కోరింది. కూటమి ప్రభుత్వం వచ్చాక శారదా పీఠానికి అక్రమంగా ఇచ్చిన భూములు రద్దు చేసింది.

==============

# ఓటీటీలో రొమాంటిక్ సీన్స్...

హైదరాబాద్, ఏప్రిల్ 12

కొన్నాళ్లుగా మలయాళీ చిత్రాలు బాక్సాఫీస్ ను షేక్ చేస్తున్న సంగతి తెలిసిందే. స్టార్ హీరోహీరోయిన్స్ లేకుండా చిన్న చిత్రాలుగా విడుదలై భారీ విజయాన్ని అందుకుంటున్నాయి. ఏ జానర్ అయినా కంటెంట్ బలంగా ఉంటే ఆదరిస్తున్నారు ప్రేక్షకులకు. ప్రస్తుతం ఓటీటీలో ఓ మలయాళీ మూవీ గట్టిగా దూసుకుపోతుంది. ఇప్పుడు ప్రతి ఒక్కరూ ఆ సినిమా గురించే మాట్లాడుకుంటున్నారు. ఇది ఓ థ్రిల్లర్ యాక్షన్ మూవీ. కానీ రొమాంటిక్ సీన్లతో నెట్టింట ఆ మూవీ పేరు మారుమోగుంతుంది. అదే అంచక్కల్లకొక్కన్. డైరెక్టర్ ఉల్లాస్ చంబన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా గతేడాది థియేటర్లలో విడుదలై భారీ విజయాన్ని అందుకుంది. చిన్న సినిమాగా ఎలాంటి అంచనాలు లేకుండా వచ్చి ఊహించని స్థాయిలో వసూళ్లు రాబట్టింది. ప్రస్తుతం ఈ మూవీ ఓటీటీనే ఊపేస్తుంది. ఈ సినిమా తెలుగులో చాప్రా మర్డర్ కేస్ పేరుతో ఆహాలో స్ట్రీమింగ్ అవుతుందిఅయితే మలయాళీ వెర్షన్ మాత్రం అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతుండగా.. తెలుగు వెర్షన్ మాత్రం ఆహా ఓటీటీలో అందుబాటులో ఉంది. ఈ సినిమాలో లుక్ మన్ అవరన్, చెంబన్ వినోద్ జోస్, మణికందన్ ఆర్ ఆచారి, మేఘా థామస్ కీలకపాత్రలు పోషించారు. మర్డర్ కేసును పోలీసులు ఛేదించడం చుట్టూ ఈ మూవీ స్టోరీ తిరుగుతుంది. బాక్సాఫీస్ వద్ద రూ.55 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. అడవిలో ఊహించని విధంగా ఓ వ్యక్తి హత్యకు గురవుతాడు. అతను ఎవరు ? అతన్ని ఎవరు చంపారు ?అనేది సినిమా.కేరళ, కర్ణాటక సరిహద్దులో ఉండే ఓ గ్రామంలో భూస్వామి అయిన చాప్రా (శ్రీజిత్ రవి) హత్యకు గురవుతాడు. అప్పుడే అక్కడికి పోలీస్ స్టేషన్ వాసుదేవన్ (లుక్మన్ అవరన్) కానిస్టేబుల్ గా రావడం.. తన హెట్ కానిస్టేబుల్ నందవరంబన్ పీటర్ (చెంబన్ వినోద్ జోస్) తో కలిసి చాప్రా హత్య కేసును ఎలా ఛేదించారనేది కథ. ఈ సినిమాలో రొమాంటిక్ సీన్స్ కు కొదవే లేదు. ఇంట్లో పనిచేసేవాడితో భూస్వామి భార్య ఎఫైర్ గురించి సైతం బయటకు వస్తుంది. ఆద్యంతం ఈ సినిమా ఊహించని ట్విస్టులతో ఆకట్టుకుంటుంది

# వనజీవి' రామయ్య స్ఫూర్తిని కొనసాగిస్తాం

## ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

విజయవాడ

వనజీవి రామయ్య మృతి పట్ల ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సంతాపం వ్యక్తం చేసారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఆరు దశాబ్దాలుగా అలుపెరుగని కృషి చేసి, సుమారు కోటి మొక్కలు నాటిన పద్మశ్రీ 'వనజీవి' రామయ్య కన్నుమూశారని తెలిసి చింతించాను. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. వృక్షో రక్షతి రక్షితః అనే పెద్దల మాటలోని వాస్తవాన్ని ప్రజలకు తెలియచేసేందుకు రామయ్య పడ్డ తపన సమాజానికి ఎంతో మేలు చేస్తోంది. తొలకరి చినుకులుపడగానే మొక్కలు నాటుతూ, విత్తనాలు జల్లుతూ పచ్చదనం పెంచడానికి రామయ్య, ఆయన సతీమణి చేసిన వన యజ్ఞం ఎన్నో తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందిస్తుంది. రామయ్య కి ఓ సందర్భంలో ప్రమాదం చోటు చేసుకొంటే ఆసుపత్రిలో ఉండగా పరామర్శించాను. అప్పుడు కూడా పర్యావరణ పరిరక్షణ గురించి మాట్లాడారు. రామయ్య స్ఫూర్తిని కొనసాగిస్తూ, పచ్చదనం పెంపునకు కృషి చేయడంతోపాటు... పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేస్తాము. 'వనజీవి' రామయ్య కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నానని అన్నారు.

# ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ జూనియర్ కాలేజీలు

అమరావతి :

ప్రభుత్వ జూనియర్ కాలేజీలను ప్రైవేటు కాలేజీలకు ధీటుగా తీర్చిదిద్దుతామనే విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సంకల్పం కార్యరూపం దాలుస్తోంది. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రభుత్వ జూనియర్ కాలేజీల పనితీరులో గణనీయమైన మార్పు వచ్చింది. ఇంటర్మీడియట్ పరీక్షల్లో విద్యార్థులు సాధించిన ఫలితాలే ఇందుకు నిదర్శనం. గత పదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది ఇంటర్మీడియట్ ఫలితాల్లో విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం గణనీయంగా పెరిగింది. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ప్రమాణాల పెంపునకు మంత్రి నారా లోకేష్ తీసుకున్న చర్యలే ఇందుకు కారణం.

పదేళ్లలో ఎన్నడూలేని విధంగా ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత శాతం పెరుగుదల

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో గత పదేళ్లలో ఎన్నడూలేని విధంగా విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరిగింది. ఇంటర్మీడియట్ రెండో ఏడాదిలో గత పదేళ్ల కంటే రికార్డు స్థాయిలో ఈ ఏడాది అత్యధికంగా 69 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్మీడియట్ మొదటి ఏడాది పరీక్షల్లో గత పదేళ్లతో పోలిస్తే రెండో అత్యధిక ఉత్తీర్ణత శాతం నమోదైంది. ఈ ఏడాది ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థుల్లో అత్యధికంగా 47 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ, ప్రైవేటు మొత్తంగా ఇంటర్మీడియట్ ఫలితాలు చూసుకుంటే గత పదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో ఇంటర్మీడియట్ మొదటి ఏడాదిలో అత్యధికంగా 70శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా.. రెండో ఏడాదిలో రికార్డు స్థాయిలో అత్యధికగా 83 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. జిల్లాల పరంగా చూసుకుంటే ఇంటర్మీడియట్ మొదటి ఏడాదిలో పార్వతీపురం మన్యం జిల్లాలో అత్యధికంగా 70శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అత్యల్పంగా విశాఖపట్నం జిల్లాలో 34శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇంటర్మీడియట్ రెండో ఏడాదిలో అత్యధికంగా పార్వతీపురం మన్యం జిల్లాలో 81 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా.. అత్యల్పంగా విశాఖపట్నం జిల్లాలో 55శాతం ఉత్తీర్ణత నమోదైంది.

ఇంటర్మీడియట్ ఒకేషనల్ లోనూ రికార్డు స్థాయిలో ఉత్తీర్ణత

ఇంటర్మీడియట్ ఒకేషనల్ లోనూ గత పదేళ్లతో పోలిస్తే రికార్డు స్థాయిలో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల విషయానికి వస్తే ఇంటర్మీడియట్ ఒకేషనల్ మొదటి ఏడాదిలో గత పదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో అత్యధికంగా 64శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్మీడియట్ ఒకేషనల్ రెండో ఏడాదిలో గత పదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో అత్యధికంగా 82శాతం ఉత్తీర్ణత నమోదైంది.

మంత్రి లోకేష్ చర్యలతో ప్రభుత్వ జూనియర్ కాలేజీల పనితీరులో గణనీయమైన మార్పు

విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రభుత్వ జూనియర్ కాలేజీల పనితీరులో గణనీయమైన మార్పు చోటుచేసుకుంది. ఫలితంగా రికార్డు స్థాయిలో ఇంటర్ ఫలితాల్లో ఉత్తీర్ణతా శాతం పెరిగింది. వైసీపీ హయాంలో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ రద్దు చేసింది. నారా లోకేష్ గారు బాధ్యతలు చేపట్టిన తర్వాత సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పేరుతో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందించడం జరిగింది. అదేవిధంగా ఇంటర్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలుచేయడం జరిగింది. ఐదేళ్ల తర్వాత 2024 ఏడాదిలో 217 మంది ప్రిన్సిపల్స్ కు ప్రమోషన్లు ఇవ్వడం జరిగింది. 2024 ఏడాది అక్టోబర్ నుంచి సెంట్రలైజ్డ్ అసెస్ మెంట్ చేయడం జరిగింది. అంతర్గత పరీక్షల్లో విద్యార్థుల ఫలితాల ఆధారంగా ఉపాధ్యాయుల పనితీరును సమీక్షించడంతో పాటు విశ్లేషించడం జరిగింది. ప్రభుత్వ జూనియర్ కాలేజీల పనివేళలను ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పెంచడం జరిగింది. వంద రోజుల కార్యక్రమాన్ని రూపొందించి వెనుకబడిన విద్యార్థులను కేటగిరీలుగా విభజించడంతో పాటు స్టడీ మెటీరియల్ అందించి వారికి వెన్నుదన్నుగా నిలవడం జరిగింది. మూడు పేరెంట్ టీచర్ మీటింగ్ ల నిర్వహణతో పాటు విద్యార్థులందరికీ ప్రోగ్రెస్ కార్డులు ఇవ్వడం జరిగింది. జరుగుతున్న సిలబస్ పై వాట్సప్ గ్రూప్ ను ఏర్పాటుచేసి విద్యార్థుల తల్లిదండ్రులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించడం జరిగింది.

## చౌటుప్పల్ లో ప్రమాదకరంగా రహదారులు

యాదాద్రి

చౌటుప్పల్లో నిర్మిస్తున్న సర్వీస్ రోడ్లపై డ్రైనేజీ స్లాబ్ల నిర్మాణం ప్రారంభమైనప్పటి నుండి నాణ్యతా లోపం స్పష్టంగా కనిపిస్తోంది. సిమెంట్, కంకర మరియు ఇతర నిర్మాణ సామగ్రిని సరైన నిష్పత్తిలో ఉపయోగించకపోవడం వల్ల ఈ స్లాబ్లు తక్కువ బరువును కూడా తట్టుకోలేకపోతున్నాయి.దీని కారణంగా ఇటీవల సిమెంట్ లోడ్తో వెళ్తున్న లారీతో పాటు, పలు నీటి ట్యాంకర్లు కూడా ఈ స్లాబ్లపై కుంగిపోయాయి. ఈ ఘటనలు రహదారి భద్రతపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. నాణ్యత లేని పనులు చేసిన కాంట్రాక్టర్ తో అధికారులు అంటకాగారని స్థానికంగా తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

చౌటుప్పల్ పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు మరియు ఆసుపత్రికి చేరుకోవడానికి ఈ సర్వీస్ రోడ్డు ప్రధానమైన మార్గం. అంతేకాకుండా, తీవ్రమైన నీటి కొరతను ఎదుర్కొంటున్న పట్టణ ప్రజల కోసం ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే, బలహీనంగా నిర్మించిన డ్రైనేజీ స్లాబ్లు తరచూ కుంగిపోవడంతో నీటి సరఫరాకు కూడా అంతరాయం కలుగుతోంది.

## సురేష్ హత్యఫోటోగ్రాఫర్ల నిరసన ర్యాలీ

నల్గొండ

నల్గొండ జిల్లా కేంద్రంలో గురువారం రాత్రి మణికంఠ కలర్ ల్యాబ్ ఓనర్ గద్దపాటి సురేష్ ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని నకిరేకల్ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు.సురేష్ హత్యకు నిరసనగా జిల్లా వ్యాప్తంగా ఫోటోషాపులు బంద్ చేసి నిరసన ర్యాలీ చేపట్టామని వారు తెలిపారు. సురేష్ ను హత్య చేసిన నిందితులను వెంటనే పట్టుకొని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీస్ వ్యవస్థ నిందితుల పట్ల కఠినంగా వ్యవహరించి శిక్ష పడే విధంగా చూడాలని వారు కోరారు..

## తిరుమలలో మరో అపచారం.. శ్రీవారి దర్శనానికి పాదరక్షలతో మహా ద్వారం వరకు వచ్చిన భక్తులు.

తిరుమల

తిరుమలలో మరో అపచారం జరిగింది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నుండి పాదరక్షలు ధరించిన భక్తులు వచ్చారు. మూడు ప్రాంతాల్లో తనిఖీ చేసినా టీటీడీ విజిలెన్స్ గుర్తించలేదు. భద్రతా అధికారులు దారుణంగా విఫలమయ్యారు. తిరుమలలో వరుస అపచారాలు జరుగుతున్నా, టీటీడీ నిర్లక్ష్యం వహించడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

=============================

## ఎంపీ ఈటలను కలిసిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

హైదరాబాద్

ఎంపీ నిధులనుండి కూకట్పల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని ఎంపీ ఈటల రాజేందర్ ను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, తొమ్మిదిమంది కార్పొరేటర్లు కలిసారు. బాలాజీనగర్, అల్లాపూర్, ఓల్డ్ బోయినపల్లి తో పాటు పలు డివిజన్లలో రోడ్లు, డ్రైనేజీ పనులు, రైల్వే బ్రిడ్జిల నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని కోరారు.

====================================

## ముఖ్యమంత్రితో భేటీ అయిన చమర్తి జగన్మోహన్ రాజు. ముఖ్య నాయకులతో ఆత్మీయంగా మాట్లాడిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,,,

రాజంపేటఒంటిమిట్ట మండలం.

రాజంపేట నియోజకవర్గంలోని అన్ని సమస్యలు పరిష్కరించడమే కాకుండా, అభివృద్ధికి పెద్దపీట వేస్తానని, కలిసికట్టుగా పనిచేసి 2029 ఎన్నికలలో రాజంపేటలో టిడిపి జెండా ఎగరవేసేలా కృషి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాజంపేట నియోజకవర్గ నాయకులకు సూచించారు. శనివారం ఒంటిమిట్టలో ముఖ్యమంత్రిని రాజంపేట టిడిపి పార్లమెంట్ ఇన్చార్జి చమర్తి జగన్ మోహన్ రాజు ఆధ్వర్యంలో ముఖ్య నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్వయంగా చమర్తి జగన్మోహన్ రాజు చెబుతున్న అన్ని విషయాలను శ్రద్ధగా విని ప్రతి సమస్యను పరిష్కరిస్తానని, కష్టపడే ప్రతి నాయకునికి తగిన గుర్తింపు ఉంటుందని, రాజంపేటలో తెలుగు తమ్ముళ్లు ఐక్యంగా పని చేసి రాబోయే ఎన్నికల్లో ఘనవిజయం సాధించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు వెన్నుదన్నుగా నిలుస్తూ , రాజంపేట తెలుగు తమ్ముళ్లకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉన్న చమర్తి జగన్మోహన్ రాజును ప్రత్యేకంగా అభినందించి, భవిష్యత్తులో టిడిపి జెండా రెపరెపలాడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

==============================

# సచివాలయ ఉద్యోగల రేషనలైజేషన్

గుంటూరు, ఏప్రిల్ 12,

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల రేషనలైజేషన్ ప్రక్రియ తుదిదశకు చేరుకుంది. కొంత మందిని ఇతర శాఖల్లోకి సర్దుబాటు చేయనున్నారు. దీనిపై సచివాలయ ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. రేషనలైజేషన్ వ్యతిరేకించకపోయినా కొన్ని ప్రతిపాదనలు ప్రభుత్వం ముందుకు తీసుకొచ్చారు.గత ప్రభుత్వం తీసుకొచ్చిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ప్రక్షాళన దిశగా కూటమి ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి భాస్కర్ కాటంనేని జీవో నెంబర్ 3ను విడుదల చేశారు. అందులో ఉద్యోగుల విభజనపై స్పష్టత ఇచ్చారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 సాధన కోసం.. ఉద్యోగుల విభజన చేస్తున్నట్లు తెలిపారు. ఈ మార్గదర్శకాలను జిల్లా కలెక్టర్లు పాటించాలని సూచించారు.ఫంక్షనరీల రేషనలైజేషన్, జిల్లాల వారీ గ్రామ/వార్డు సచివాలయాల జాబితాలు, జనరల్ పర్పస్ ఫంక్షనరీలను నియమించాల్సిన హోదాల మార్గదర్శకాలకు జత చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల డైరెక్టర్ తదనుగుణంగా అవసరమైన చర్య తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 15,004 గ్రామ, వార్డు సచివాలయా (11,162 గ్రామ, 3,842 వార్డు సచివాలయాలు)ల్లో 1,30,694 మంది ఉద్యోగులు ఉన్నారు.

3 రకాలుగా వర్గీకరణ..

గ్రామ/వార్డు సచివాలయాలలో పనిచేసే ఫంక్షనరీస్‌ను ప్రభుత్వం మూడు కేటగిరీలు వర్గీకరించింది. సేవలు, పథకాలను సమర్థవంతంగా, రియల్ టైమ్‌లో అందించడం, కార్యక్రమాల అమలు కోసం వర్గీకరణ చేపట్టింది. 1. మల్టీపర్పస్ ఫంక్షనరీస్ (జనరల్ పర్పస్), 2. టెక్నికల్ ఫంక్షనరీస్ (స్పెసిఫిక్ పర్పస్), 3.యాస్పిరేషనల్ సెక్రటరీలుగా విభజించింది.

1.జనరల్ పర్పస్ ఫంక్షనరీస్..

ఎ.గ్రామ సచివాలయం- పంచాయతీ కార్యదర్శి (గ్రేడ్ ఎ-ఎ), డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, గ్రామ మహిళా పోలీస్.

బి.వార్డు సచివాలయం- వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ, వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ, వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీ, వార్డు మహిళా పోలీస్.

2.స్పెసిఫిక్ పర్పస్ ఫంక్షనరీస్..

ఎ. గ్రామ సచివాలయం- వీఆర్‌వో, ఏఎన్ఎం, సర్వే అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, అగ్రికల్చర్/ హార్టికల్చర్/ సెరికల్చర్ అసిస్టెంట్, వెటర్నరీ/ ఫిషరీష్ అసిస్టెంట్, ఎనర్జీ అసిస్టెంట్.

బి.వార్డు సచివాలయం- వార్డు రెవెన్యూ సెక్రటరీ, వార్డు హెల్త్ సెక్రటరీ, వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీ, వార్డు ఎమినిటీస్ సెక్రటరీ, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీ, వార్డు ఎనర్జీ సెక్రటరీ.

3.యాస్పిరేషనల్ ఫంక్షనరీస్..

నియమించబడే ఫంక్షనరీల్లో ఒకరిని గ్రామ / వార్డు సచివాలయాలలో యాస్పిరేషనల్ ఫంక్షనరీస్‌గా నియమిస్తారు.

జనాభా ప్రాతిపదికన..

2,500 మంది జనాభా ఉన్న సచివాలయాలను ఏ కేటగిరీగా, 2,501 నుంచి 3,500 వరకు జనాభా ఉంటే బీ కేటగిరీగా, 3,501 కంటే ఎక్కువగా జనాభా ఉంటే సీ కేటగిరీగా విభజించారు. ఆ మేరకు సచివాలయ సిబ్బందిని కుదించారు.

2,500 మంది జనాభా ఉన్న సచివాలయానికి (ఏ కేటగిరీ) ఆరుగురు (మల్టీపర్పస్ ఫంక్షనరీస్-2, టెక్నికల్ ఫంక్షనరీస్-4), 2,501 నుంచి 3,500 వరకు జనాభా ఉన్న సచివాలయానికి (బీ కేటగిరీ) ఏడుగురు (మల్టీపర్పస్ ఫంక్షనరీస్-3, టెక్నికల్ ఫంక్షనరీస్-4), 3,501 కంటే ఎక్కువగా జనాభా ఉన్న సచివాలయానికి (సీ కేటగిరీ) ఎనిమిది మంది (మల్టీపర్పస్ ఫంక్షనరీస్-4, టెక్నికల్ ఫంక్షనరీస్-4) కేటాయించారు.

1. ఏ కేటగిరీ (2,500 జనాభా వరకు)

ఏ. గ్రామ సచివాలయం- 1. పంచాయతీ కార్యదర్శి లేదా డిజిటల్ అసిస్టెంట్ 2, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ లేదా మహిళా పోలీస్.

బి.వార్డు సచివాలయం- 1. వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ లేదా వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ. 2. వార్డు వెల్ఫేర్ అండ్ డవలప్‌మెంట్ సెక్రటరీ లేదా మహిళా పోలీస్.

2. బీ కేటగిరీ (2,501 నుంచి 3,500 జనాభా వరకు)

ఏ. గ్రామ సచివాలయం- 1. పంచాయతీ కార్యదర్శి, 2. డిజిటల్ అసిస్టెంట్ 3, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ లేదా మహిళా పోలీస్.

బి.వార్డు సచివాలయం- 1. వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ, 2. వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ. 3. వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీ లేదా మహిళా పోలీస్.

3. సీ కేటగిరీ (3,501 కంటే ఎక్కువగా జనాభా)

ఏ. గ్రామ సచివాలయం- 1. పంచాయతీ కార్యదర్శి, 2. డిజిటల్ అసిస్టెంట్ 3, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, 4. మహిళా పోలీస్.

బి.వార్డు సచివాలయం- 1. వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ, 2. వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ. 3. వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీ, 4. మహిళా పోలీస్.

## బీసీల రిజర్వేషన్ పితామహుడు బిపి మండల్

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

వెనుకబడిన వర్గాల నుండి ఒక చదుకున్న వ్యక్తి తను వచ్చిన సమాజం అభివృద్ధి గురించి నిస్వార్థంగా , నిబద్ధతతో పని చేస్తే ఎలాంటి మార్పు ఉంటుందో ఉదాహరణే బీపీ. మండల్ జీవితం.

బిందేశ్వరి ప్రసాద్ మండల్ భారతదేశ పార్లమెంటు సభ్యుడు, మాజీ బీహార్ ముఖ్యమంత్రి ,సంఘ సంస్కర్త. అతను రెండవ వెనుకబడిన తరగతుల కమిషన్ (మండల్ కమిషన్ గా సుపరిచితం) కు చైర్మన్ గా వ్యవహరించాడు. అతను ఉత్తర బీహార్ లోణి సహర్సా లో అత్యంత ధనుకులైన యాదవ్ జమీందారీ (భూస్వాములు) కుటుంబం లో జన్మించాడు. కమిషన్ భారతదేశంలోని ప్రజలలో ఒక భాగాన్ని "అదర్ బేక్ వర్డ్ క్లాసెస్"(ఓబీసీ) (ఇతర వెనుకబడిన కులాలు) గా నివేదిక ప్రకారం నివేదించింది. భారతీయ రాజకీయాల్లో తక్కువగా ఉన్న, బలహీన వర్గాల కోసం పాలసీపై తీవ్రమైన చర్చ ప్రారంభమైంది. బి.పి. మండల్ ( బిందేశ్వరి ప్రసాద్ మండల్ ) బీహార్ లోని బనారస్ లోని ఒక యాదవ్ కుటుంబంలో 1918 ఆగస్టు 25న జన్మించాడు.. మాధేపురా జిల్లాలోని మోరో గ్రామంలో పెరిగాడు. మండేపురంలో మండల్ తన ప్రాథమిక విద్యని , దర్భాంగాలో ఉన్నత పాఠశాల విద్యని పూర్తి చేసాడు. 1930 లలో పాట్నా కాలేజీలో ఇంటర్మీడియేట్ పూర్తి చేసిండు. ఆ తరువాత పై చదువులకై అతను ప్రెసిడెన్సీ కళాశాల కలకత్తాలో చేరిండు. దురదృష్టవశాత్తు, ఇంట్లో కొన్ని అనివార్యమైన పరిస్థితుల కారణంగా, అతను తన చదువుని విడిచిపెట్టవలసి వచ్చింది.మండల్ తన 23 వయేటా జిల్లా కౌన్సిల్ కి ఎన్నికయ్యాడు. 1945-51 మధ్య కాలములో మాధేపుర డివిజన్ లో జీతం తీసుకోకుండానే జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ గా పని చేసాడు. అతని రాజకీయ జీవితం భారత జాతీయ కాంగ్రెస్ తో మొదలైంది. 1952 లో మొదటిసారి బీహార్ అసెంబ్లీకి శాసనసభ్యునిగా ఎన్నికయ్యాడు. అధికార పక్షములో ఉండి బీహార్ లోని బలహీనవర్గ కుర్మీలపై అగ్రవర్ణ రాజుపుత్రులు దాడి చేయడాన్ని నిరసించాడు. 1965 లో తన నియోజకవర్గంలో భాగంగా ఉన్న గ్రామమైన పామాలో మైనారిటీలు, దళితులపై పోలీసులు చేస్తున్న అత్యాచారాలపై మాట్లాడాలని కోరుకున్నప్పుడు అధికార పక్షములో ఉండి ఈ అంశంపై మాట్లాడకూడదని ముఖ్యమంత్రి ఆదేశిస్తే తన మనస్సాక్షిని చంపుకోలేక తను నమ్మిన విలువల కోసం ప్రతిపక్ష పాత్ర నిర్వహించడానికి సిద్ధమై సంయుక్త సోషలిస్ట్ పార్టీ (ఎస్.ఎస్.పి) లో చేరాడు. ఎస్.ఎస్.పి రాష్ట్ర పార్లమెంటరీ బోర్డు ఛైర్మన్ గా నియమించబడ్డాడు.1967 లో జరిగిన ఎన్నికలలో ఎస్.ఎస్.పి అభ్యర్థుల ఎంపికపై ఆయన చేసిన కృషి, ఆయన ప్రచారం వల్ల 1962 లో కేవలం 7 సీట్లు కల ఆ పార్టీకి 1967 లో 69 సీట్లు వచ్చాయి. బీహార్లో మొట్టమొదటి కాంగ్రెస్ యేతర ప్రభుత్వం ఏర్పడింది. అతను పార్లమెంటు సభ్యుడు అయినప్పటికీ మంత్రివర్గంలో చేర్చారు. ఆరోగ్య శాఖ మంత్రిగా పని చేసాడు. కానీ పార్టీలో, ప్రభుత్వములో కొన్ని విబేధాలు రావడముతో కాంగ్రెస్ పార్టీ బయటి నుండి మద్దతు ఇవ్వడంతో 1968 ఫిబ్రవరి 1 న అతను బీహార్ రాష్ట్ర రెండవ బీసీ ముఖ్యమంత్రిగా పదవీ భాద్యతలు స్వీకరించాడు. కాంగ్రెస్ పార్టీ మద్దతు తీసుకుంటూనే రాజీ పడకుండా రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతల అవినీతిపై అయ్యర్ కమిషన్ వేసి విచారణ చేయించాడు. ఆ కమిషన్ నివేదికను బయలుపరచకుండా అప్పటి ప్రధాని ఇందిరాగాంధి స్వయంగా ఒత్తిడి తీసుకవచ్చింది. ప్రధానితో అతను మాట్లాడడానికి నిరాకరించడముతో ప్రభుత్వముపై అవిశ్వాస తీర్మానం పెట్టి నెగ్గడంతో 30 రోజులకే మండల్ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. అతను తరచూ తన మంత్రులకు, ‘‘ఓట్లను సంపాదించడానికి కులపరమైన విజ్ఞప్తి సహించవచ్చు కానీ ప్రభుత్వాల నిర్ణయాలల్లో ఏ కులతత్వాన్ని సహించవద్దు” అని చెప్పే మండల్ తన ప్రభుత్వములో పరిపాలనలో ఎక్కడ కులతత్వాన్ని ప్రదర్శించకుండా పాలించాడు.1967 మార్చి 5న అతను సోషిత్ దళ్ (అణగారిన ప్రజల పార్టీ ) ని స్థాపించాడు. 1967 నుండి 1970 వరకు లోక్‌సభ సభ్యునిగా ఉన్నాడు. 1972 లో శాసనసభకు తిరిగి ఎన్నికయ్యాడు. 1972 లో అప్పటి బీహార్ ముఖ్య మంత్రి పాండే మిథిలా యూనివర్సిటీ పేరుతో అందులో కింది ఉద్యోగి నుండి వైస్ ఛాన్సలర్ వరకు ఒకే కులం వారితో నింపాలనే ప్రయత్నాలని వ్యతిరేకించాడు. ఆ తర్వాత 1974 లో శాసన సభ సభ్యత్వానికి రాజీనామా చేసి జయప్రకాష్ నారాయణ నేతృత్వములో నడుస్తున్న అవినీతి వ్యతిరేక ఉద్యమములో పాల్గొన్నాడు. 1977 లో జనతా పార్టీ తరపున లోక్ సభకి ఎన్నికై 1979 వరకు కొనసాగాడు. ఎమర్జెన్సీ తర్వాత ఏర్పాటైన జనతా ప్రభుత్వం ఇందిరాగాంధీని డిబార్ చేయాలని అధికార పార్టీ సభ్యులు తెచ్చిన తీర్మానాన్ని మండల్ వ్యతిరేకించా?

# కాకాణి కోసం ప్రత్యేక బృందాలు

నెల్లూరు, ఏప్రిల్ 12,

వైసీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆ పార్టీ నేతలపై కూటమి సర్కార్ స్పెషల్ ఫోకస్ పెట్టిందట. అందులో భాగంగానే క్వార్ట్జ్ అక్రమ తవ్వకం, దోపిడీ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటూ విచారణకు రాకుండా తప్పించుకుని తిరుగుతున్న మాజీ మంత్రి, వైసీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి చుట్టూ పోలీసులు ఉచ్చు బిగిస్తున్నారు. విచారణకు హాజరుకాకపోవడంతో ఇక లాభంలేదని ఆయనపై లుకౌట్ నోటీసులు జారీచేశారట. దీంతో ఆయన విదేశాలకు పారిపోకుండా విమానాశ్రయాల్లోనే అడ్డుకోవచ్చన్నది పోలీసుల ప్లాన్ గా తెలుస్తోంది.క్వార్ట్జ్ అక్రమ తవ్వకాల కేసులో కాకాణిపై కేసు నమోదు కావడం, విచారణకు రావాలని ఎన్నిసార్లు నోటీసులిచ్చినా ఆయన లెక్కచేయడంలేదట. నోటీసులను తీసుకునేందుకు కాకాణి ఇంట్లో ఉండడంలేదంట. అయితే ముందస్తు బెయిల్ ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించడం.. తదితర పరిణామాల నేపథ్యంలో కొద్ది రోజులుగా కాకాణి ఎవ్వరికీ కన్పించకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారట.ముఖ్యంగా హైకోర్టు ఆయన బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేయడంతో..కాకాణిని అరెస్ట్ చేసేందుకు పోలీసులు అన్ని ప్రాంతాల్లో విస్తృతంగా గాలిస్తున్నారంట. కాకాణి కోసం దాదాపు 7 ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయని సమాచారం. ఏపీతో పాటు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాల్లో సైతం వేటాడుతున్నట్లు సమాచారం. కాకాణి కన్పిస్తే చాలు వెంటనే అరెస్టు చేసేందుకు పోలీసులు రెడీగా ఉన్నారంట.ఇక వైసీపీ హయాంలో మద్యం స్కాం వ్యవహారం మొత్తం కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి చుట్టే తిరుగుతోందట. దీంతో సిట్ విచారణకు రావాలంటూ కసిరెడ్డికి ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చినా..ఆయన కంటిన్యూస్‌గా డుమ్మా కొడుతున్నారంట. బుధవారం విచారణకు రాకపోవడంతో మళ్లీ నోటీసులు ఇచ్చారంట అధికారులు.మరి ఈసారైనా కసిరెడ్డి విచారణకు వెళ్తారా..ఒకవేళ వెళ్లకుంటే సిట్ అధికారులు ఏం చేయబోతున్నారనే ఉత్కంఠ మొదలైంది. 3రోజుల క్రితం కసిరెడ్డికి నోటీసులు ఇచ్చేందుకు వెళ్ళిన సమయంలో కూడా హైదరాబాద్‌లో ఆయన లేరని అధికారులు గుర్తించారట. దీంతో ఆయన ఇంటికి నోటీసులు అంటించి, ఆయన బంధువులకు కూడా నోటీసులు ఇచ్చారట పోలీసులు. ఇంతకుముందు రెండు సార్లు నోటీసులు ఇచ్చినా కూడా కసిరెడ్డి మాత్రం విచారణకు హాజరుకాకుండా డుమ్మాలు కొడుతున్నారంట.వైసీపీ హయాంలో వేల కోట్ల లిక్కర్ అవినీతి జరిగిందని ప్రతిపక్షంలో ఉన్న సమయంలో టీడీపీ ఆరోపించిన సంగతి తెలిసిందే. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత లిక్కర్ స్కాంపై స్కాన్ చేయాల్సిందే అంటూ విచారణకు ఆదేశించింది ప్రభుత్వం. ఐతే వైసీపీ హయాంలో కీలకంగా వ్యవహరించిన విజయ సాయిరెడ్డి..పార్టీకి రాజీనామా చేసిన తర్వాత లిక్కర్ స్కాంలో కర్మ, కర్త, క్రియ అంతా కసిరెడ్డి అంటూ ఆరోపించి పెద్ద బాంబే పేల్చారు. దీంతో అధికారులు కసిరెడ్డిపాత్రపై ఫోకస్ పెట్టి ఆధారాలు సేకరించే పనిలో నిమగ్నమైఉన్నారంట.2019 ఎన్నికలకు ముందు జగన్‌తో కలసి పనిచేసిన కసిరెడ్డి?వైసీపీ అధికారంలోకి రాగానే ప్రభుత్వ ఐటీ సలహాదారుగా వ్యవహరించారు. ఆ పదవిలో ఉంటూనే తెరవెనుక మద్యం కుంభకోణంలో ప్రధాన పాత్ర పోషించారనే



ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. కసిరెడ్డి విదేశాల్లో ఉన్న సమయంలోనే అక్కడ లిక్కర్ బిజినెస్ చేసినట్లు అప్పట్లో సోషల్ మీడియాలో వార్తలు గుప్పుమన్నాయి.ఏ లిక్కర్ కంపెనీ నుంచి ఎంత సరుకు కొనాలో..ఏరోజు, ఏ బ్రాండ్లు ఎంత మేరకు విక్రయించాలో ఇదంతా కసిరెడ్డే నిర్ణయించేవారని రాజకీయవర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఐతే నోటీసులకు కూడా కసిరెడ్డి స్పందించకపోవడంతో ఇక ఆయనకు కూడా లుకౌట్ నోటీసులు జారీచేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారట. మరి కసిరెడ్డి పోలీసుల నోటీసులకు స్పందించి వాచారణకు హాజరవుతారా లేక కాకాణిలాగే అజ్ఞాతంలోనే ఉంటారా అన్నది రాబోయే రోజుల్లో తేలిపోనుంది.

# బిజెపి రాష్ట్ర కార్యాలయం లో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహణ కార్యశాల

విజయవాడ

బిజెపి రాష్ట్ర కార్యాలయం లో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహణ కార్యశాల జరిగింది. కార్యక్రమానికి

ముఖ్య అతిథి గా బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు, లోక్ సభ ఎంపీ డికె. అరుణ పాల్గొన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు, ఎం పి దగ్గుబాటి పురంధేశ్వరి సభకు అధ్యక్షత వహించారు. , బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్సీ సోమువీర్రాజు, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్ రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్, మాజీ ఎమ్మెల్యే అయ్యాజీ వేమ,ఆర్ డివిల్సన్ , నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దగ్గుబాటి పురంధేశ్వరి మాట్లాడుతూ ఈనెల 14 అంబేద్కర్ జయంతి సందర్భంగా నివాళి అర్పించాం. ఆయన స్ఫూర్తి తో బూత్ లెవల్ లో కార్యక్రమాలు చేపట్టాం. సమసమాజ స్థాపన కోసం అంబేద్కర్ కృషి చేశారు. అన్ని వర్గాల వారికి సమాన న్యాయం అందించడం ఆయన లక్ష్యం. అదే ఆదర్శంగా బిజెపి పార్టీ ప్రజల కోసం పని చేస్తుంది. 2014 లో బిజెపి పై విష ప్రచారం చేశారు. అంబేద్కర్ రాజ్యాంగం మారుస్తారని దుష్ప్రచారం చేశారు. నిజానికి అంబేద్కర్ కు గౌరవించి సమున్నత స్థానం కల్పించింది బిజెపి నే

ఆయన్ను గతంలో అవమానించి, రాజీనామా చేసేలా చేసిన చరిత్ర ఎవరిదో అందరికీ తెలుసు. భారతరత్న ఇచ్చినా, పార్లమెంటు లోచిత్ర పటం పెట్టినా, ఐదు ప్రాంతాలను పంచ్ తీర్థ్ గా , ఆయన నివాసాన్ని బిజెపి అభివృద్ధి చేసింది. కాంగ్రెస్ హయాంలోనే ఎక్కువసార్లు సవరణలు జరిగాయి. వారి ఓటు బ్యాంకు దృష్టి లో ఉంచుకుని స్వార్థం తో చేశారు. బిజెపి 22 సవరణలు చేసినా అది వివిధ వర్గాల అభ్యున్నతికి చేసినవేనని అన్నారు.

సామాజిక న్యాయం కోసం ఈ నిర్ణయాలను మోడీ తీసుకున్నారు. ముస్లిం లకు నాలుగు శాతం రిజర్వేషన్ కోసం రాజ్యాంగం మారుస్తామని డికె శివకుమార్ చెప్పడం సరికాదు. భారత రాజ్యాంగం వల్లే బీసీగా ఉన్న నేను ప్రధాని గా అయ్యా నని మోడీ చెప్పారు. ఈ అంశాల ను ప్రజలకు వివరించేందుకు మా సమావేశం ఏర్పాటు చేశామని అన్నారు.

ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి వేడుకలు 13 వ తేదీ నుంచి 25 వ తేదీ వరకు నిర్వహించాలని బీజేపీ పార్టీ నిర్ణయం తీసుకుంది. పార్లమెంట్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ బీజేపీ పై అనేక ఆరోపణలు చేసింది. బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారని అబద్దపు ప్రచారాలు చేసిన వాటిని ప్రజలు తిప్పి కొట్టారు. కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్ ని ఎన్నో సార్లు అవమానపరిచారు. అ

# : ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహనీయుడు స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు

–ప్రజాభిమానాన్ని చూరగోన్న మహానేత

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

ప్రజాభిమానాన్ని చూరగోన్న మహానేత,ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహనీయుడు స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిల్ల శ్రీపాదరావు కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రముఖ రాజకీయ నాయకుడు. ఈయన మార్చి 2, 1935న అప్పటి కరీంనగర్ జిల్లా మంథని నియోజకవర్గంలోని కాటారం మండలం ధన్వాడ గ్రామంలో (ప్రస్తుతం భూపాలపల్లి జిల్లా) జన్మించారు. న్యాయవిద్య అభ్యసించిన శ్రీపాదరావు ప్రారంభంలో పంచాయతి కార్యాలయంలో క్రిందిస్థాయి ఉద్యోగిగా జీవనం ఆరంభించి, రాజకీయాలలో ప్రవేశించి సర్పంచిగా, సమితి అధ్యక్షుడిగా, భూ తనఖా బ్యాంకు చైర్మెన్‌గా, మూడుసార్లు మంథని శాసనసభ్యుడిగా, శానసనభ స్పీకరుగా అంచెలంచెలుగా ఎదిగారు.1935 సంవత్సరమలో మార్చి 2 న కాటారం మండల ధన్వాడ గ్రామానికి చెందినా మౌళి పటేల్ రాధాకిష్టయ్య, కమలా బాయి దంపతులకు జన్మించాడు. అమ్మమ్మ వారు నివాసముండే నాగపూర్ లో పుట్టిన అయన ప్రాధమికవిద్య ధన్వాడ గ్రామంలో చేసి, ఎస్ ఎస్ సి వరకు మంథనిలోని బావ సువర్ణ చంటయ్య ఇంట్లో ఉండి పూర్తిచేశాడు. ఇంటర్, డిగ్రీ హైదరాబాద్ లో చేసిన తరువాత ఆదిలాబాద్ జిల్లాలో పంచాయతి ఇన్స్పెక్టర్ గా ఉద్యోగం కొన్ని రోజులు చేశారు. ఆ తరువాత నాగపూర్ లో న్యాయవాదిగా ప్రజలకు సేవ చేయాలనే తలంపుతో ఎల్. ఎల్. బి. పూర్తి చేసి ప్రాక్టీసు పెట్టారు. తండ్రి మరణాంతరం స్వంత ఊరికి వచ్చిన శ్రీపాద వ్యవసాయమే వృత్తిగా చేసుకొని, గ్రామంలోనే ఉన్నాడు. కొన్ని రోజుల తరువాత స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామం నుండి సర్పంచ్ గా పోటీ చేయాలని ప్రజలు ఒత్తిడిచేశారు. నాయకత్వ లక్షణాలు పుణికి పుచ్చుకున్న శ్రీపాద రాజకీయాల్లోకి అడుగిడాలని స్నేహితులు, హితులు ప్రోత్సాహించారు. ఆ దిశగా అడుగులు వేస్తూ పోటి చేసి మొదటిసారి సర్పంచ్ గా ఎన్నుకోబడ్డారు. వరుసగా మరో మారు ఆయనకే ప్రజలు మద్దతు పలకడంతో రెండవ సారి ఎన్నికయ్యారు. మహాదేవపూర్ సమితి అధ్యక్షునిగా ఎన్నికైన తరువాత ఎల్ ఎం బి ఛైర్మన్ పదవికి మంథని నుండి గెలిచాడు. ఆయన రాజకీయ ఎదుగుదలకు ఎల్ ఎం బి బ్యాంకు ఛైర్మన్ ఎన్నిక ఎంతో సహకరించింది. దీంతో పూర్తిగా నియోజకవర్గానికే ఆయన సుపరిచితమైనాడు. పదవివస్తే ముఖంచాటు చేసుకునే నాయకులకు భిన్నంగా అయన ప్రజల మధ్యనే ఉంటూ, వారి కష్ట, నష్టాలలో పాలు పంచుకొని ప్రజానాయకునిగా ఎదిగాడు.1984 ఎన్నికల్లో ఆయనకు కాంగ్రెస్ పార్టీ నుండి ఏమ్మేల్లెగా పోటి చేసే అవకాశం లభించింది. అప్పుడే పురుడు పోసుకున్న తెలుగు దేశం పార్టీ ప్రభావం, ఎన్టిఆర్ ప్రభంజనం ముందు శ్రీపాదరావు విజయం సాదించగలుగుతాడా అనే అంశం పై స్వపార్టీ, విపక్షాలలో చర్చ జరిగింది. తెలుగుదేశం, సంజయ్ విచార మంచ్ మధ్య ఎన్నికల ఒప్పందం కారణంగా మంథని శాసనసభ నియోజకవర్గం నుండి పోటిగా విచార మంచ్ నుండి చంద్రుపట్ల రాజి రెడ్డి దిగారు. వీరిద్దరి మధ్య గట్టి పోటి నెలకొనగా చివరకు శ్రీపాదరావు విజయం సాధించారు. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో మూడు సార్లు శాసన సభ్యులుగాఎన్నికైన ఆయనకు శాసనసభ స్పీకర్ గా అన్ని పార్టీల మద్ధతుతో పదవి నదిష్టించారు. ఆ పదివికి వన్నె తెచ్చారని ఎంతోమంది ప్రముఖులు, రాజకీయా విశ్లేసకులతో ప్రశంశలు పొందారు. ఒకవైపు స్పీకర్ పదవి బాధ్యతతో నిర్వహిస్తునే మరోవైపు తన స్వంత నియోజకవర్గ ప్రజలను మాత్రం మరిచిపోకుండా, మరింత దగ్గరయ్యారు. విమర్శలకు వెరవకుండా, పొగడ్తలను లెక్క చేయకుండా, అభివ్రుదిపై దృష్టి సారిస్తూ ముందుకు కదిలారు. 1994 ఎన్నికల ముందు నక్సల్స్, పోలీసుల మధ్య జరిగిన ప్రత్యేక్ష పోరు తీవ్రంగా ప్రభావం చూపింది. తీవ్రఉద్రిక్త పరిస్థితుల్లో ఎన్నికలు ముగిశాయి. ఈ ఎన్నికల్లో శ్రీపాదరావు పరాజయం పాలయ్యాడు. అయిన ఓటమి పాలయిన ప్రజలకు మాత్రం దూరం కాలేదు. వారి మధ్య లోనే ఉంటూ వారికి తన శక్తి మేరకు సేవ చేస్తూనే ఉంటూ వచ్చాడు. పాలకపక్షం, ప్రాతినిధ్యం వహిస్తున్న అప్పటి శాసన సభ్యులు రామ్ రెడ్డి పై కనీసం పల్లెత్తు మాట, విమర్శ కూడా చేయకుండా హుందాగా వ్యవహరించి, తన ప్రజాభిమాన్ని మరింత చూరగొన్నారు.ప్రజల మధ్య ఉంటూ వారి బాగోగులను పట్టించుకునే పరిస్థితుల్లోనే ఆయనను మృత్యువు నక్సల్స్ రూపంలో కబళించింది. 1999 ఏప్రిల్ 13 న మహాదేవపూర్ మండలం అన్నారంకు తన అనుచర వర్గంతో వెళ్లివస్తున్న క్రమంలో మార్గ మధ్యంలోని అడవుల్లో ఆయన వాహనాన్ని నక్సల్స్ ఆపివేసి, ఆయనతో మాట్లాడాలని చెప్పి లోపలి తీసుకెళ్ళి కరుకు తుపాకి తూటాలతో విగత జీవున్ని చేశారు. ఈ సంఘటన రాష్ట్రాన్ని కుదిపివేసింది. ఎన్నడు అపకారాన్ని తలపెట్టని నాయకు?

## జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ ల వర్గపోరు

జగిత్యాలమాజీ మంత్రి జీవన్ రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గ పోరు పై ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ స్పందించారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ 120 ఏళ్ల చరిత్ర కాంగ్రెస్ పార్టీది. కుటుంబ సభ్యులకే బేధాభిప్రాయాలు ఉంటాయి. మీడియా ఎదుట మాట్లాడుకునే అవకాశం ఇద్దరు నేతలు ఇవ్వద్దు. రేపు హైదరాబాద్ వెళ్లి పీసీసీ దృష్టికి తాజాగా జరిగిన పరిణామాలను తీసుకెళ్లి సమస్యను పరిష్కారం అయ్యేలా చేస్తానని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో ప్రజాస్వామ్యం ఎక్కువ. పదేళ్ల రాచరిక పాలనను అంతముందించి ప్రజలు కాంగ్రెస్ కు పట్టం కట్టారు. అనేక మంది కాంగ్రెస్ కార్యకర్తల పోరాట ఫలితమే. ఇద్దరి మధ్య సమన్వయం కల్పించేందుకు పీసీసీ చీఫ్, సీఎం రేవంత్ కు నివేదిస్తా. మీడియా కసంయమనం పాటించాలి. గోరంతను కొండత చేయవద్దని కోరుతున్నానని అన్నారు. పదవుల కోసం ఫాం హౌజ్ లో కేటీఆర్, హరీష్ రావు తన్నుకున్నారు . వంద ఏళ్ల కాంగ్రెస్ పార్టీ లో స్వేచ్ఛ, స్వాతంత్రం ఎక్కువగా ఉంది. తాజా పరిణామాలను హై కమాండ్ కు నివేదిస్తానని అన్నారు.

# వంగవీటి రాధాకు చంద్రబాబు కీలక పదవి

విజయవాడ, ఏప్రిల్ 12,

ఏపీ సీఎం చంద్రబాబు కాపులకు పెద్ద పీట వేస్తున్నారా? అంటే అవుననే సమాధానం వస్తోంది. ఇటీవలే సోమువీర్రాజు, కొణిదెల నాగబాబుకు ఎమ్మెల్సీ పదవులు ఇచ్చింది కూటమి ప్రభుత్వం. తాజాగా కాపు సామాజికవర్గానికి చెందిన మరో కీలక నేత వంగవీటి రాధాకు చంద్రబాబు అపాయింట్ మెంట్ ఇచ్చారు. దాదాపు 20 నిమిషాల పాటు రాధాతో చంద్రబాబు మాట్లాడారు. అంతేకాదు త్వరలో వంగవీటి రాధాకు చంద్రబాబు కీలక పదవి ఇవ్వనున్నారని సమాచారం. ఆ మేరకు రాధాతో చంద్రబాబు చెప్పినట్లు తెలుస్తోంది.వంగవీటి రాధా 2019 ఎన్నికలకు ముందు వైఎస్సార్‌సీపీకి గుడ్ బై చెప్పి టీడీపీలో చేరిన సంగతి తెలిసిందే. అయితే ఆయన ఆ ఎన్నికల్లో పోటీచేయలేదు.. కేవలం టీడీపీ అభ్యర్థుల తరఫున ప్రచారం మాత్రమే చేశారు. కానీ 2019 ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయింద.. అయితే రాధా పార్టీ కార్యక్రమాలకు కొంతకాలం దూరంగా ఉన్నారు. అయితే ఆ తర్వాత మళ్లీ యాక్టివ్ అయ్యారు.. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌ను ప్రత్యేకంగా కలవడంతో ఆయన జనసేన పార్టీలోకి వెళతారనే టాక్ వినిపించింది. కానీ ఆయన మాత్రం టీడీపీలోనే కొనసాగారు.. అయితే 2024 ఎన్నికలకు ముందు ఆయన వైఎస్సార్‌సీపీలోకి తిరిగి వెళతారంటూ కొందరు ప్రచారం చేశారు. ఆయున మాత్రం పార్టీ మారలేదు.వంగవీటి రాధా 2024 ఎన్నికల్లో పోటీ చేస్తారనే ప్రచారం జరిగినా.. ఆయన మాత్రం కేవలం కూటమి పార్టీల తరఫున ప్రచారానికి పరిమితం అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా కూటమి పార్టీల అభ్యర్థుల్ని గెలిపించాలని ప్రచారం చేసి విజయం కోసం కృషి చేశారు. అలాగే కూటమి అధికారంలోకి వస్తే.. పదవి ఇస్తామనే భరోసా కూడా ఇచ్చినట్లు టాక్ వినిపించింది. ఈ క్రమంలో ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఐదు స్థానాల్లో ఒకటి రాధాకు కేటాయిస్తారని ప్రచారం జరిగింది. కానీ ఆయనకు పదవి దక్కలేదు. ఈ క్రమంలో చంద్రబాబును కలవడంతో రాధాకు పదవిపై చంద్రబాబు ఏదైనా హామీ ఇచ్చారా అనే ప్రచారం జరుగుతోంది. త్వరలోనే ఆయనకు పదవి వస్తుందని అనుచరులు భావిస్తున్నారు. ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చే అవకాశం ఉందనే టాక్ వినిపిస్తోంది.రాధాకృష్ణ కాంగ్రెస్



పార్టీలో చేరి రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. 2004 అసెంబ్లీ ఎన్నికల్లో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి పోటీచేసి గెలిచారు. 2008లో ఆయన ప్రజారాజ్యం పార్టీలో చేరి.. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి పోటీచేసి ఓడిపోయూరు. రాధా 2014 ఎన్నికల ముందు వైఎస్సార్‌సీపీలో చేరి.. అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థిగా పోటీ చేసి ఓడారు. ఆయన 2015లో వైసీపీ విజయవాడ నగర అధ్యక్షుడిగా, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్తగా పని చేశారు. 2019 ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు.వంగవీటి రాధాకు కూడా ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తామని గతంలోనే చెప్పారు చంద్రబాబు. ఎమ్మెల్సీలుగా కాపు సామాజికవర్గ నేతలకు అవకాశం కల్పించడం ద్వారా కాపుల్లో పట్టు సాధించనున్నారు చంద్రబాబు. ఇప్పుడు రాధాతో చంద్రబాబు భేటీ ఆసక్తికరంగా మారింది. తాజా రాజకీయ పరిణామాలు, ఇటీవల ఇచ్చిన ఎమ్మెల్సీ పదవుల్లో సామాజిక సమీకరణాలపై ఇరువురూ చర్చించినట్లు సమాచారం. అతి త్వరలో కీలక పదవి ఇవ్వనున్నట్లు రాధాకు సీఎం చంద్రబాబు చెప్పినట్టు సమాచారం. చంద్రబాబుతో జరిగిన చర్చ గుడ్ మూడ్ తో ఉందని తన సన్నిహితులతో రాధా చెప్పినట్లు తెలుస్తోంది.

# ఎయిర్ పోర్ట్ టూ ఫోర్త్ సిటీ

## మెట్రో కనెక్టవిటీ అడుగులు

హైదరాబాద్, ఏప్రిల్ 12,

హైదరాబాద్ నగర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని రేవంత్ రెడ్డి సర్కార్ మెట్రో రైలు సేవలను మరింత విస్తరించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎయిర్‌పోర్ట్ నుంచి ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ వరకు మెట్రో సేవలను 40 కిలోమీటర్ల మేర విస్తరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కొత్త మెట్రో మార్గానికి సంబంధించిన డీపీఆర్‌ను తక్షణమే సిద్ధం చేసి, కేంద్రానికి పంపాలని సూచించారు.ఫ్యూచర్ సిటీ దాదాపు 30 వేల ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చెందుతుండగా.. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని మెట్రోను మీర్ ఖాన్ పేట వరకు పొడిగించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఈ విస్తరణ బాధ్యతను హెచ్ఎండీఏ, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ సంయుక్తంగా చేపట్టాలని తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ. 24,269 కోట్ల అంచనాతో 76.4 కిలోమీటర్ల మేర మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించిన డీపీఆర్‌ను కేంద్రానికి సమర్పించింది. ఈ ప్రాజెక్టును రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కలిసి భాగస్వామ్య పద్ధతిలో చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించారుకేవలం మెట్రోనే కాదు, రీజినల్ రింగ్ రోడ్, జాతీయ రహదారుల అభివృద్ధి పైనా సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్– విజయవాడ మధ్య గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణాన్ని వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. అలాగే.. హైదరాబాద్ నుంచి రాయ్‌పూర్ వరకు, మంచిర్యాల వరకు కొత్త జాతీయ రహదారుల ప్రతిపాదనలు సిద్ధం చేసి ఎన్‌హైచ్ఏఐకి పంపించాలని సూచించారు. భూ సేకరణలో ఏర్పడుతున్న సమస్యలపై సీఎం ఆరా తీశారు. పంటలు ఉన్న భూముల విషయంలో నష్టపరిహారం చెల్లించేందుకు ఎన్‌హెచ్ఏఐ అంగీకరించకపోవడం వల్ల సమస్యలు ఎదురవుతున్నాయని అధికారులు తెలియజేశారు.ఔటర్ రింగ్ రోడ్ నుంచి రీజినల్ రింగ్ రోడ్ వరకు రేడియల్ రోడ్ల నిర్మాణానికి ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు తదితర అధికారులు పాల్గొన్నారు.

# కరీంనగర్ కాంగ్రెస్ లో గందరగోళం

కరీంనగర్, ఏప్రిల్ 12, (

కరీంనగర్ కాంగ్రెన్ రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. మంత్రి పొన్నం ప్రభాకర్ వర్సెస్ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మధ్య కోల్డ్ వార్‌తో క్యాడర్లో గందరగోళం నెలకొందట. అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు నుంచే ఇద్దరి మధ్య గ్యాప్ ఓపెన్ సీక్రెటే అని జిల్లా రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది. కరీంనగర్ జిల్లా కేంద్రంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌దే పెత్తనం అన్న టాక్ ఎప్పటినుంచో ఉంది. ఐతే గత అసెంబ్లీ ఎన్నికల్లో పొలిటికల్ ఈక్వేషన్స్‌లో భాగంగా హుస్నాబాద్ నుంచి పోటీ చేసి గెలుపొందారు.కరీంనగర్లో బీఆర్ఎస్ జెండా ఎగిరింది.. ఐనా కరీంనగర్ కేంద్రంగా మంత్రి పొన్నం పాలిటిక్స్ నడిపిస్తున్నారు.. మరోవైపు సుడా చైర్మన్‌గా ఉన్న కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి కరీంనగర్‌లో పట్టు కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు.. ఇదే లోకల్‌గా ఆధిపత్యపోరుకు దారితీసిందనే టాక్ వినిపిస్తోంది.. అంతేకాదు నరేందర్‌రెడ్డికి సుడా ఛైర్మన్ పదవి దక్కకుండా పొన్నం ప్రయత్నించాడని, మంత్రి శ్రీధర్‌బాబు ఆశీస్సులతో సుడా చైర్మన్ సీట్లో కూర్చున్నారనేది లోకల్ సర్కిల్స్‌లో వినిపించే చర్చ..కరీంనగర్‌లో మంచి పట్టున్న మంత్రి పొన్నంకు పార్టీ అధిష్టానం నుంచి కూడా సపోర్ట్ ఉంది.. ఐతే 2023లో అధికారంలోకి వచ్చిన తరువాత సుడా చైర్మన్ విషయంలో తన మాట నెగ్గించుకున్నారు మంత్రి శ్రీధర్‌బాబు.. అలా ఆ సీటులోకి వచ్చి కూర్చున్న నరేందర్ రెడ్డి తన పట్టు పెంచుకునే ప్రయత్నాలు మొదలుపెట్టారు.ఇక్కడే మంత్రి పొన్నంతో ఆయనకు ఆధిపత్య పోరు మొదలైందని తెలుస్తోంది.. ఇటీవల కరీంనగర్ జిల్లా కేంద్రంలో మంత్రి పొన్నం ప్రభాకర్ సన్న బియ్యం పంపిణి కార్యక్రమం చేపడితే..అదే సమయంలో ముఖ్యమైన ప్రెస్ మీట్ అంటూ కబురు పంపారట సుడా చైర్మన్.. ఇలా ఇద్దరూ ఒకే సమయంలో మీడియా సమావేశాలు నిర్వహించడం, ఒకరి కార్యక్రమాలకు మరొకరు హాజరుకాకపోవడంతో క్యాడర్‌లో అయోమయం మొదలైందనేది లోకల్ న్యూస్..ప్రస్తుతం ఎమ్మెల్యేగా పొన్నం హుస్నాబాద్‌కు ప్రాతినిధ్యం వహిస్తుండడం, మంత్రిగా పర్యటనలు సాగిస్తున్న క్రమంలో.. ఏదైనా సమస్య వస్తే తప్పనిసరి పరిస్థితుల్లో క్యాడర్‌కు నరేందర్ రెడ్డే దిక్కవుతున్నారట. ప్రస్తుత పరిస్థితుల్లో సుడా చైర్మన్ ను కాదనే పరిస్థితి అక్కడ లేదట..అలా అని పొన్నం ప్రభాకర్ ను దూరం పెట్టుకోలేమని వారు అంటున్నారట. అయితే క్యాడర్ నే కాదు.అధికార యంత్రంగాన్ని సైతం తన గ్రిప్ లో పెట్టుకోవాలని సుడా చైర్మన్ చూస్తుంటే.. మంత్రి హోదాలో పొన్నం తన మాట చెల్లు బాటయ్యేలా ఆదేశాలిస్తున్నారట. ఇలా ఇద్దరి మధ్య జరుగుతున్న ఆధిపత్య పోరుతో కరవమంటే కప్పకు కోపం..విడవమంటే పాముకు కోపం అన్నట్లుగా ఉందట అధికారులు, క్యాడర్ పరిస్థితి. కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య నెలకొన్న అంతర్గత విభేదాలు బీఆర్ఎస్, బీజేపీలకు అనుకూలంగా మారుతున్నాయట. మరి రాబోయే రోజుల్లో వీరిద్ధరి మధ్య ఆధిపత్య పోరు ఎటు దారితీస్తుందో వేచి చూడాల్సిందే.

## విజయశాంతికి బెదిరింపు కాల్స్

హైదరాబాద్, ఏప్రిల్ 12

తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి దంపతులకు బెదిరింపులు వచ్చాయి. సుదీర్ఘకాలం తరువాత ప్రజాప్రతినిధి అయ్యానని ఆమె హ్యాపీగా ఉన్న సమయంలో వారికి బెదిరింపులు రావడం కలకలం రేపుతోంది. అది కూడా ఇటీవల ఆమె అధికార పార్టీ నుంచి ఎమ్మెల్సీ అయ్యారు. ఈ క్రమంలో విజయశాంతి భర్త శ్రీనివాస ప్రసాద్ బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. చంద్ర కిరణ్ రెడ్డి అనే వ్యక్తి నాలుగేళ్ల కిందట తమను సంప్రదించాడని, సోషల్ మీడియాలో కంటెంట్ క్రియేట్ అని పరిచయం చేసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. విజయశాంతికి సంబంధించిన సోషల్ మీడియా అకౌంట్లు హ్యాండిల్ చేయడానికి అవకాశం ఇవ్వాలని కోరాడు. ఈ క్రమంలో కంటెంట్ క్రియేటర్ చంద్ర కిరణ్ రెడ్డి తమతో కలిసి పనిచేస్తూ సొంతంగా వ్యాపారాలు చేసుకున్నాడు. తమ పేరును వాడుకొని బిజినెస్ చేస్తున్నాడు అని గుర్తించి అతడి సేవలు ముగించాను. బిజెపిలో ఉన్న సమయంలో అతడు మమ్మల్ని కలిశాడు. అతడికి అవకాశం ఇచ్చినందుకు సొంతంగా ఎదిగేందుకు ప్రయత్నాలు చేశాడు. నా పేరు చెప్పుకొని ఎంతో లబ్ధి పొందాడు. ఆ తర్వాత మేము బిజెపి నుంచి బయటకు వచ్చాము. తాము ఇంకా బకాయి ఉన్నామని, పెండింగ్లో ఉన్నవి చెల్లించాలని ఆ సమయంలో చంద్ర కిరణ్ రెడ్డి నుంచి మెసేజ్ వచ్చింది.మావద్ద ఏ బకాయిలు లేవని క్లియర్ గా చెప్పాం.

# పోలవరం ముంపుపై అధ్యయనం

కరీంనగర్, ఏప్రిల్ 12,

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గోదావరి నదీ జలాలపై అక్రమంగా నిర్మించతలపెట్టిన గోదావరి బనకచర్ల లింక్ ప్రాజెక్టును వెంటనే అడ్డుకోవాలని తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఈమేరకు శుక్రవారం గోదావరి నదీ యాజమాన్యం బోర్డు (జిఆర్ఎంబి), పోలవరం ప్రాజెక్టు అథారిటీలకు తెలంగాణ నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్(ఈఎన్‌సి) జి.అనిల్ కుమార్ లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఏకపక్షంగా ఏపి ప్రభుత్వం గో దావరి బనకచర్ల లింక్ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రతిపాదించడం, ఇందుకు ప్రత్యేకంగా స్పెషల్ పర్పస్ వెహికిల్(ఎస్‌పివి)గా జలహారతి కార్పొరేషన్‌ను ఏర్పాటుచేస్తూ

ఈనెల 3వ తేదీన జరిగిన ఏపి మంత్రివర్గ సమావేశం లో నిర్ణయం తీసుకోవడం, ఈనెల 8వ తేదీన ఉత్తర్వులు(జి.వో.నెం.16) జారీచేయడాన్ని తెలంగాణ తీవ్రంగా ఆక్షేపించింది. గోదావరి బనకచర్ల లింక్ ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014కు విరుద్ధమని, దీనిపై తెలంగాణ ప్రభుత్వం వ్యక్తపరుస్తున్న అభ్యంతరాలను ఏమాత్రం పట్టించుకోకుండా ఏపి ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆలేఖలో పేర్కొన్నారు. గోదావరి బనకచర్ల లింక్ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.80,112 కోట్లు అంచనాలతో 200 టిఎంసి గోదావరి నీటిని మళ్లించుకోవాలని ఏపి ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని వివరించారు.పోలవరం ప్రా జెక్టు ముంపు ప్రభావంపై సంయుక్త సర్వే చేయాలని, ముంపు, బ్యాక్ వాటర్స్ ప్రభావంపై అధ్యయనం చేయాలని తెలంగాణ ప్రభుత్వం పోలవ రం ప్రాజెక్టు అథారిటీని కోరింది. గత ఏడాది వ రదల ప్రభావంతో ముంపునకు గురైన నేపథ్యం లో అధ్యయనం సమగ్రంగా జరగాలని తెలంగా ణ ఈఎన్సీ అనిల్ కుమార్ కోరారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ హైదరాబాద్‌లోని సెంట్రల్ వాటర్ కమిటీ కార్యాలయంలో భేటీ అయింది. పోలవరం ప్రాజెక్టు అథారిటీ చైర్మన్ అతుల్ జైన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రాజెక్టు అథారిటీ ఛైర్మన్ అతుల్ జైన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో తెలంగాణ ఈఎన్సీ అనిల్, ఏపీకి చెందిన ఇద్దరు చీఫ్ ఇంజినీర్లు భేటీలో పాల్గొన్నారు. పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతి, అంచనా వ్యయం, నిధులు వం టి తదితర అంశాలపై సమావేశంలో చర్చించిన ట్లు సమాచారం. కొత్తగా సర్వే అవసరం లేదని, గతంలో ఉన్న వివరాలు సరిపోతాయని ఏపీ చీఫ్ ఇంజినీర్లు వాదించగా సంయుక్త సర్వే చే యాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీ నిర్ణయించింది. తెలంగాణ ప్రాంతంలో ముంపును గుర్తిం చే అంశం, పోలవరం బ్యాక్ వాటర్స్ ప్రభావం ఉండే ప్రాంతాల్లతీసుకోవాల్సిన చర్యలపై ప్రధానంగా చర్చకు వచ్చినట్లు తెలిసింది. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ఉన్న అభ్యంతరాలను తెలంగాణ అధికారులు మరోమారు ఈ భేటీలో లేవనెత్తారు. పోలవరం పూర్తి నిల్వ సామర్థ్యం గురించి సమావేశంలో తెలంగాణ అధికారులు ప్రస్తావించారు. కిన్నెరసాని, ముర్రేడువాగు, ఇతర ప్రవాహాల చర్యల గురించి ప్రస్తావించారు. ఖమ్మం పట్టణం, భద్రాచలం పట్టణాలపై పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావం, రామాలయం వద్ద నీటిమట్టం, మణుగూరు భారజల ప్లాంట్ వద్ద వాటర్ లెవెల్స్ అంశంపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలని రాష్ట్ర అధికారులు మరోసారి అథారిటీని కోరారు. పోలవరం ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేస్తే ఆ ప్రభావం తెలంగాణపై ఏ మేరకు ఉంటుందనే విషయాలపై స్పష్టత రావాలని అథారిటీని తెలంగాణ అధికారులు కోరారు

===============================చీచీ

## ఎమ్మెల్యే చిత్రపటానికి పాలభిషేకం

మేడ్చల్

అల్వాల్ సర్కిల్ జనప్రియ ప్రాంతంలో రైల్వే అండర్ బ్రిడ్జ్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతిస్తూ నిధులు కూడా కేటాయించడంపట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. మాజీ కౌన్సిలర్ డోలి రమేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అర్.వో.బి అనుమతులు తీసుకురావడానికి స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి అహర్నిశలు కృషి చేశారని కార్పొరేటర్లు విజయశాంతి శ్రీనివాస్ రెడ్డి, సబితా అనిల్ కిషోర్ పలువురు టిఆర్ఎస్ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ తో రైతు మృతి

సంగారెడ్డిసంగారెడ్డి జిల్లాలో విద్యుత్ షాక్ తో గిరిజన యువరైతు రామావత్ రమేష్ (35) మృతి చెందాడు.పుల్కల్ మండలం మిన్పూర్ తండాలో రెండు రోజుల క్రితం గాలి దుమారానికి విద్యుత్ వేర్లు తెగిపడ్డాయి.స్థానిక రైతులు విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో లైన్ ఆఫ్ చేశామని త్వరలోనే పునరుద్ధరిస్తామని చెప్పి అధికారులు చేతులు దులుపుకున్నారు.అధికారులు లైన్ కట్ చేశామని చెప్పడంతో పొలం వద్దకు వెళ్ళిన రైతు రమావత్ రమేష్ తెగిపడ్డ తీగ కరెంట్ షాక్ తగిలి తన పొలంలోనే అక్కడికక్కడే మృతి చెందడం జరిగింది.సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కుటుంబ సభ్యుల పిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే యువరైతు రామావత్ రమేష్ మృతి చెందాడని కుటుంబ సభ్యులు బందువులు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

## జాతీయస్థాయిలో రోచిష్మతికి సిల్వర్ మెడల్

మంగళగిరి: గుంటూరు జిల్లా పెదకాకానికి చెందిన బిట్రా రోచిష్మతి మణిపూర్‌లో జరుగుతున్న బాలికల వెయిట్ లిఫ్టింగ్ పోటీలో నేషనల్ లెవెల్ లో సిల్వర్ మెడల్ సాధించింది. పదవ తరగతి చదువుతున్న రోచిష్మతి నేషనల్ స్కూల్ గేమ్స్ ఛాపింయన్ షిప్ 2024-25 పోటీలలో ఈ మెడల్ గెలుచుకుంది.

# ఓఆర్ఆర్ పరిధిలో చెరువుల లెక్కలు తీస్తున్న హైడ్రా

హైదరాబాద్, ఏప్రిల్ 12,

ఓఆర్ఆర్ పరిధిలో భూముల వివరాలు అందరికీ అందుబాటులోకి తీసుకురాడానికి హైడ్రా కసరత్తు ప్రారంభించింది. ఎక్కడ చెరువు ఉంది.. ఆ చెరువు విస్తీర్ణం ఎంత, కాలువలు, నాలాల పరిస్థితి ఏంటి..? అనే సమాచారంతో పాటు ప్రభుత్వ భూములు, పార్కులకు సంబంధించి సరైన హద్దులతో సమాచారాన్ని సేకరిస్తోంది.ఈ క్రమంలో ఎన్ ఆర్ ఎస్ సీ (నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్)తో హైడ్రా ఒప్పందం కుదుర్చుకుంది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ , ఎన్ ఆర్ ఎస్ సీ డైరెక్టర్ డా. ప్రకాష్ చౌహాన్ ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. చెరువుల ఎఫ్ టీ ఎల్, బఫర్ జోన్లకు సంబంధించి హద్దుల విషయంలో ఎలాంటి అపోహలకు ఆస్కారం లేకుండా సరైన సమాచారం అందించడమే హైడ్రా ముందున్న లక్ష్యమని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చెప్పారు.ప్రభుత్వ స్థలాలు, పార్కులు, రహదారులు ఇలా ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల సమాచారం ప్రజలకు అందుబాటులోకి తీసుకురాడానికి ఎన్ ఆర్ ఎస్ సీతో నేడు కుదుర్చుకున్న ఒప్పందం మైలురాయి లాంటిదన్నారు. 1970వ సంవత్సరంలో సర్వే ఆఫ్ ఇండియా సర్వే చేసిన టోపో షీట్లు, కెడెస్ట్రియల్ మ్యాప్స్, రెవెన్యూ రికార్డులు, చెరువులకు సంబంధించిన సమాచారంతో పాటు ఎన్ ఆర్ ఎస్ సీ శాటిలైట్ ఇమేజీలతో సమగ్ర సమాచారం అందుబాటులోకి తీసుకురావడమే హైడ్రా లక్ష్యమన్నారు.చెరువుల పునరుద్ధరణ, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ, పర్యావరణ హితమైన నగరాన్ని రూపొందించడానికి ఇంత పెద్ద ఎత్తున చర్యలు తీసుకున్న మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలబడుతుందని ఎన్ ఆర్ ఎస్ సీ డైరెక్టర్ డా. ప్రకాష్ చౌహాన్ అన్నారు. పర్యావరణాన్ని కాపాడుకుంటే.. దేశంలోనే గొప్ప నగరంగా హైదరాబాద్ పేరుగాంచుతుందని అన్నారు. హైడ్రా చర్యలతో ఇది సాధ్యమౌతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విషయంలో హైడ్రాకు పూర్తి సహకారం అందిస్తామన్నారు.విపత్తుల నిర్వహణ, నీటి వనరుల రక్షణ కోసం జియో ఆధారిత జియోస్పేషియల్ డేటా మద్దతు, సాంకేతిక సహకారం హైడ్రాకు అందుతుంది. రిమోట్ సెన్సింగ్, జీఐఎస్ సాంకేతికతను వినియోగించి తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్(టీసీయూఆర్) కోసం భౌగోళిక డేటాబేస్‌లను సమగ్రపరిచే భౌగోళిక పోర్టల్ అభివృద్ధితో పాటు జియోస్పేషియల్ డేటాబేస్ సృష్టికి ఎన్ఆర్ఎస్సీ సాంకేతిక మద్దతును హైడ్రా బృందానికి అందిస్తుంది.భువాన్ పోర్టల్‌లో ఉన్న టీసీయూఆర్ పరిధిలో విపత్తు నిర్వహణ, నీటి వనరుల రక్షణకు సంబంధితంగా ఉండే అన్ని వారసత్వ సమాచారాన్ని ఈ ఒప్పందం ప్రకారం అందించడానికి సిద్ధంగా ఉంటుంది. కొత్త 'జియోస్పేషియల్ డేటా పాలసీ ? 2023' కు అనుగుణంగా 'భూనిధి' పోర్టల్‌లో ఉన్న అన్ని చారిత్రక భారతీయ రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహ డేటా టీసీయూఆర్ ప్రాంతాన్ని కవర్ చేసే మార్గదర్శకాలు అందుబాటులోకి వస్తాయి.

హై-రిజల్యూషన్ ఉపగ్రహ డేటా, వైమానిక ఫోటోగ్రఫీ, డిజిటల్ ఎలివేషన్ మోడల్స్ మొదలైనవి ఎన్ఆర్ఎస్సీ ద్వారా హైడ్రాకు అందుతాయి. ఉపగ్రహం / వైమానిక వనరుల నుంచి సంబంధిత డేటాను తయారు చేయడం, వాటి ఏకీకరణ, ఆస్తి నిర్వహణ / పర్యవేక్షణ కు సంబంధించిన సమాచార సేకరణలో హైడ్రాకు ఎన్ఆర్ఎస్సీ నుంచి అందుతుంది.ఎన్ఆర్ఎస్సీకి చెందిన నేషనల్ డేటాబేస్ ఫర్ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ (ఎన్డీఈఎం) వెబ్ పోర్టల్‌కు ఉచిత యాక్సెస్‌ను అందిస్తుంది. ఇది ఇంటిగ్రేటెడ్ ఏరో-స్పేస్ ఆధారిత విపత్తు డేటాను ఉన్న స్థితిలోనే విజువలైజేషన్ చేయడానికి వీలు కల్పిస్తుంది. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) వరకు ఉన్న ప్రాంతంతో పాటు జీహెచ్ఎంసీ చుట్టూ ఉన్న 27 మునిసిపాలిటీలు/కార్పొరేషన్ల పరిధిలో చెరువులు, ప్రభుత్వ భూములు, పార్కులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించి, విశ్లేషించి సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావడానికి ఎన్ఆర్ఎస్సీ - హైడ్రా సంయుక్తంగా కృషి చేయనున్నాయి.

# యూపీఐ చెల్లింపులకు తికమక.. నిలచిపోయిన సేవలు..అల్లాడిపోయిన జనం

హైదరాబాద్, ఏప్రిల్ 12

యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ లో శనివారం టెక్నికల్ ప్రాబ్లం రావడంతో డిజిటల్ పేమెంట్స్ నిలిచిపోయాయి. భారతదేశంలో చాలా మంది వినియోగదారులు డిజిటల్ చెల్లింపులకు వీలుకావడం లేదని రిపోర్ట్ చేస్తున్నారు. పేటీఎం, ఫోన్ పే , గూగుల్ పే డిజిటల్ పేమెంట్ యాప్‌లు పనిచేయడం లేదని వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో యూపీఐ చెల్లింపులలో సాంకేతిక సమస్య తలెత్తినట్లు తెలుస్తోందిమధ్యాహ్నం 12 గంటల సమయానికి సమస్య మరింత పెరిగింది. ఆ సమయంలో ఏకంగా 1200 మంది యూపీఐ చెల్లింపులపై రిపోర్ట్ చేశారు. 66 శాతం యూజర్లకు పేమెంట్ చేసే సమయంలో సమస్య తలెత్తినట్లు పేర్కొన్నారు. మరో 34 శాతం మంది యూజర్లకు ఫండ్ ట్రాన్స్‌ఫర్ కావడం లేదని రిపోర్ట్ చేశారు. ఇటీవల మార్చి నెలాఖరులలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అకౌంట్ ఉన్న యూపీఐ వినియోగదారుల టెక్నికల్ ప్రాబ్లమ్ తో పేమెంట్స్ చేయలేకపోయారని తెలిసిందే.షాపింగ్ మాల్స్, బిల్ పేమెంట్స్, మనీ ట్రాన్స్‌ఫర్ ఇలా ఏదైనా సరే.. టెక్నికల్ ప్రాబ్లమ్ కారణంగా యూపీఐ పేమెంట్స్ నిలిచిపోయాయి. దాంతో సోషల్ మీడియాలో నెటిజన్లు విపరీతంగా పోస్టులు పెడుతున్నారు. వీకెండ్ కదా అని షాపింగ్ కు వెళ్లి పేమెంట్స్ అవ్వక, ఇటు జేబులో నగదు లేక ఇబ్బందులు పడుతున్నట్లు యూపీఐ యూజర్లు రిపోర్ట్ చేస్తున్నారు.రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పర్యవేక్షణలో పనిచేసే నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రూపొందించిన తక్షణ చెల్లింపు వ్యవస్థను యూపీఐగా చెప్పవచ్చు. దీని ద్వారా ఫోన్ పే, పేటీఎం, గూగుల్ పే లాంటి డిజిటల్ పేమెంట్ యాప్‌ల ద్వారా ఎలాంటి ఛార్జీలు లేకుండా మొబైల్ నెంబర్‌కు, బ్యాంకు ఖాతాలకు క్షణాల్లో నగదు బదిలీ చేయవచ్చు.

# 10 లక్షలు... గులాబీ ప్లాన్

వరంగల్, ఏప్రిల్ 12,

ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా 10లక్షలు. అంతకు మించి అయినా పర్వాలేదు గాని లెక్క మాత్రం తక్కువ కాకూడదు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్టీ నేతలకు ఫిక్స్ చేసిన టార్గెట్ ఇది. ఈ నెల 27న వరంగల్ లో నిర్వహిస్తున్న పార్టీ సిల్వర్ జూబ్లీ సభకు 10 లక్షల జన సమీకరణ చేయాలని గులాబీ బాస్ ఆదేశించారంట. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో వరంగల్ కు 10 లక్షల మంది జనాన్ని తరలించగలమా అన్న అనుమానాలను వ్యక్తం చేస్తున్నారట గులాబీ పార్టీ నేతలు.గులాబీ పార్టీ రజతోత్సవ సంబురాలకు సిద్దమవుతోంది. పార్టీ 24 ఏళ్లు పూర్తి చేసుకుని 25వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ నెల 27న వరంగల్‌లో భారీ బహిరంగ సభకు ప్లాన్ చేసింది.. ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో జిల్లాల వారిగా నిర్వహించిన సన్నాహక సమావేశాల్లో లీడర్లకు దిశానిర్దేశం చేసిన కేసీఆర్ 10 లక్షల మందితో రజతోత్సవ సభను గ్రాండ్ సక్సెస్ చేయాలని ఆర్డర్ పాస్ చేశారంట.అధికారంలో లేకపోయినా భారీ జన సమీకరణతో కనీవినీ ఎరుగని రీతిలో బహిరంగ సభను నిర్వహించి పార్టీ సత్తా ఏంటో నిరూపించాలని చెప్పారంట కేసీఆర్. దీంతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా జిల్లా పర్యటనలు చేసి మరీ ఓరుగల్లు సభకు సన్నాహాలు చేస్తున్నారు.. మరోవైపు హరీష్ రావు, కవిత సైతం సైతం రంగంలోకి దిగారు.ఇంతవరకు బాగానే ఉన్నా.. వరంగల్ సభకు జన సమీకరణపైనే పార్టీ వర్గాల నుంచి అనుమానాలు వ్యక్తమవుతున్నాయట. ఒక్కో నియోజకవర్గం నుంచి 10వేల మంది జనాన్ని తరలించేలా ప్లాన్ చేస్తున్నారట. అయితే కనీసం 3వేల నుంచి 5వేల మందిని తరలించడం కూడా కష్టమేననే టాక్ వినిపిస్తోందట. అలా ఒక్కో నియోజకవర్గం నుంచి 5వేల మందిని తరలించినా 100 నియోజకవర్గాలకు 5 లక్షల మందే అవుతారు. కానీ కేసీఆర్ టార్గెట్ ఫిక్స్ చేసింది 10 లక్షల జనసమీకరణ కోసం.మరి అంత మందిని వరంగల్ సభకు ఎలా తరలించాలనేది అర్థంకాక తలలు పట్టుకుంటున్నారంట గులాబీ పార్టీ నేతలు. అందులోనూ మెజార్టీ ఎమ్మెల్యేలు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే ఉన్నారని.. హైదరాబాద్ నుంచి జనాన్ని తరలించడం సాధ్యం కాదని సిటీ ఎమ్మెల్యేలు ఇంటర్నల్ గా చెబుతున్నారట. అసలే సమ్మర్ సీజన్ కావడంతో గ్రామీణ ప్రాంతాల నుంచి సైతం జనాన్ని తరలించడం అంత ఈజీ కాదని అంటున్నారంట. ఐతే ఏ గ్రామం నుంచి ఎంత మంది వస్తారో ఇప్పటి నుంచే లెక్కలు వేసుకుని,..వచ్చే వాళ్లు చేజారిపోకుండా సభకు తీసుకొచ్చేందుకు కసరత్తు చేస్తున్నారట గులాబీ లీడర్లు.10 లక్షల మందితో వరంగల్ సభను గ్రాండ్ సక్సెస్ చేయాలని టార్గెట్ ఫిక్స్ చేసిన కేసీఆర్.. జనసమీకరణ బట్టే నియోజకవర్గాల్లో నాయకుల సత్తా ఏంటో తెలుస్తుందని చెప్తున్నారంట. రాబోయే రోజుల్లో పార్టీ పదవులు, ఎన్నికల్లో టిక్కెట్లు, మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత నామినేటెడ్ పోస్టుల వంటి వాటిని పరిగణలోకి తీసుకుంటామని పరోక్షంగా స్పష్టం చేస్తున్నారని పార్టీవర్గాల్లో చర్చ జరుగుతోంది. అందుకే వరంగల్ సిల్వర్ జూబ్లీ సభకు భారీ ఎత్తున జనాన్ని తరలించి తమ సత్తా చాటుకోవాలని నేతలు ప్రయత్నిస్తున్నారంట. మరి గులాబీ బాస్ కేసీఆర్ ఇచ్చిన టార్గెట్ ను పార్టీ నేతలు రీచ్ అవుతారా లేదా అన్నది తెలియాలంటే ఈనెల 27 వరకు ఆగాల్సిందే.

నిర్ణయం చెప్పండి

వరంగల్ జిల్లా హనుమకొండలో బీఆర్ఎస్ నిర్వహించతలపెట్టిన రజతోత్సవ సభపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. హనుమకొండలో సభకు పోలీసులు అనుమతి ఇవ్వడం లేదంటూ బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించగా.. విచారణ జరిపి కోర్టు.. ప్రతివాదులకు కీలక ఆదేశాలు ఇచ్చింది.ఈనెల 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హనుమకొండలోని ఎల్కతుర్తిలో రజతోత్సవ సభ నిర్వహించాలని బీఆర్ఎస్ అధిష్టానం నిర్ణయించింది. భారీ ఎత్తున సభను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ క్రమంలో ఉదయం 10గంటల నుంచి రాత్రి 10గంటల వరకు సభ నిర్వహిస్తామని, అందుకు అనుమతి ఇవ్వాలని వరంగల్ పోలీసులను బీఆర్ఎస్ ఆశ్రయించింది. అయితే, అందుకు పోలీసుల నుంచి అనుమతి రాకపోవటంతో బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై ఈ ఇవాళ కోర్టులో విచారణ జరిగింది. సభకోసం బీఆర్ఎస్ పెట్టుకున్న పర్మిషన్ ను అనుమతించక పోవటం, దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవటం వల్లనే హైకోర్టులో పిటిషన్ వేసినట్లు బీఆర్ఎస్ తరపు న్యాయవాది కోర్టులో వాదనలు వినిపించారు.హోంశాఖ ముఖ్య కార్యదర్శి, వరంగల్ సీపీ, కాజీపేట ఏసీపీని బీఆర్ఎస్ ప్రతివాదులుగా చేర్చింది. దీంతో ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయడానికి హోంశాఖ తరపు న్యాయవాది సమయం కోరారు. ఈనెల 21 వరకు గడువు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన కోర్టు ఈనెల 17 నాటికి కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

# పోలీసుల పేరుతో టిక్కెట్ల స్కామ్

హైదరాబాద్, ఏప్రిల్ 12, (న్యూస్ పల్స్)

ఉప్పల్ స్టేడియం లో విజిలెన్స్ డిజి కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి తనిఖీలు నిర్వహించారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ దేవ్ రాజ్ ,ట్రెజరర్ శ్రీనివాస్ తో సమావేశం అయి టిక్కెట్ల దుర్వినియోగం పై ఆరా తీశారు. శనివారం ఉప్పల్లో మ్యాచ్ ఉ ండడంతో టికెట్ల పంపకం ప్రక్రియను ఎలా చేస్తున్నారన్న దానిపై వివరాలు తెలుసుకున్నారు. కాంప్లిమెంటరీ టికెట్ల విషయంలో సెక్రటరీ, ట్రెజరర్ లపై ఆరోపణలు వచ్చాయి. సన్ రైజర్స్ హైదరాబాద్ నుండి వచ్చే ప్రతి కాంప్లిమెంటరీ టికెట్ మొదటగా చేరుకునేది వీళ్లిద్దరు వద్దకే కాబట్టి వీరిద్దరి నుండే టికెట్లు పక్కదారు పట్టినట్టు భావిస్తున్నారు విజిలెన్స్ అధికారులుస్టేడియంలో కార్ పాసులు, బైక్ పాసులు తన సొంత మనుషులకే జారీ చేస్తున్నట్టు అభియోగాలు ఉన్నాయి. కాంప్లిమెంటరీ టికెట్లు చాలావరకు పక్కదారి పట్టినట్లు భావిస్తున్న విజిలెన్స్ అధికారులు ఈ దిశగా ఆధారాల కోసం ఆరా తీస్తున్నారు. కాంప్లిమెంటరీ టికెట్ల పంపిణీ విషయంలో కీలకపాత్ర వహిస్తున్న సెక్రటరీ దేవరాజ్ ట్రెజరర్ శ్రీనివాస్ గురించి పలు ఫిర్యాదులు పోలీసులకు అందాయి. ఒప్పందం ప్రకారం 10% కాంప్లిమెంటరీ టికెట్లు హెచ్సీఏ కి వస్తున్నా... సన్ రైజర్స్ వాళ్ళు తక్కువగా ఇస్తున్నారు అంటూ బయట ప్రచారం చేసి.. తమ వర్గానికి టికెట్లను పంపిణీ చేస్తున్నట్టు గుర్తించారు. రాచకొండ పోలీసులు ఎక్కువ మొత్తంలో టికెట్లు తీసుకుంటున్నారంటూ బయట ప్రచారం చేసిన సెక్రటరీ వ్యవహారాన్ని కూడా పోలీసులు సీరియస్ గా తీసుకున్నారు. మ్యాచ్ లు జరుగుతున్న విధి నిర్వహణలో పోలీసులు ఉంటారు. వారికి పాసులు ఇవ్వరు. అవి కాకుండా ఎవరికైనా పాసులు ఇచ్చినా వ్యక్తిగతంగా ఇస్తారు కానీ పోలీసు శాఖ కోసం ఇవ్వరు. ఈ విషయంలోనూ తప్పుడు ప్రచారం చేయడంపై ఆరా తీసి.. అక్రమాలను బయట పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలన్న ఆలోచన చేస్తున్నట్లుగా తెలుస్తోంది. ఉచిత టిక్కెట్ల కోసం వేధింపులు పెరిగిపోయాయని సన్ రైజర్స్ హైదరాబాద్ టీం యాజమాన్యం ఆరోపణలు చేసింది. ఈ వివాదం విషయంలో సీఎం రేవంత్ విజిలెన్స్ దర్యాప్తునకు ఆదేశించారు. ఆ తర్వాత హెచ్‌సీఏ, ఎస్ఆర్‌హెచ్ ఓ ఒప్పందానికి వచ్చాయి. ఒప్పందానికి వ్యతిరేకంగా ఎలాంటి చిన్న పనిచేయాలని అడగబోమని రాసిచ్చారు. బీసీసీఐ, ఎస్ఆర్‌హెచ్, హెచ్‌సీఏ ట్రైపార్టీ ఒప్పందం మేరకు పని చేసేందుకు ఇరు వర్గాలు అంగీకారం తెలుపుతూ ఓ నిర్ణయం తీసుకున్నారు. పాత ఒప్పందం ప్రకారమే స్టేడియం సామర్థ్యంలోని 10 శాతం కాంప్లిమెంటరీ పాసుల కేటాయిస్తారు. అంతే తప్ప.. ఇక హెచ్‌సీఏ అధ్యక్షుడు బ్లాక్ మెయిల్ చేశారని వేరే బాక్సులు.. ఇతర టిక్కెట్లు ఇచ్చే చాన్స్ లేదని ఎస్ఆర్‌హెచ్ స్పష్టం చేసింది. ఉప్పల్ స్టేడియంలో ఐపీఎల్ మ్యాచ్‌లను విజయవంతంగా నిర్వహించేందుకు ఎస్ఆర్‌హెచ్‌కు పూర్తిగా సహకరిస్తామని హెచ్‌సీఏ హామీ ఇచ్చింది. చర్చలు పూర్తయిన తరవాత వివాదాలన్ని ముగిశాయని హెచ్‌సీఏ-ఎస్ఆర్‌హెచ్ సంయు?క్తంగా ప్రకటించాయి.

# ఫామ్ హౌస్ నుంచే రాజకీయాలు

హైదరాబాద్, ఏప్రిల్ 12,

ప్రజలు మార్పు కోరుకుంటేనే అధికారంలోకి వస్తామని మాత్రమే బీఆర్ఎస్ నేత కేసీఆర్ బలంగా నమ్ముతున్నట్లుంది. అందుకే దాదాపు పదిహేడు నెలల నుంచి ఆయన ఫాం హౌస్ కే పరిమితమయ్యారు. జనంలోకి పెద్దగా వచ్చేందుకు ఆయన ఇష్టపడటం లేదు. ఇందుకు కారణాలు కూడా లేకపోలేదు. 2024లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఎంతగా తిరిగినా, ఎన్ని ఆరోపణలు చేసినా ప్రజలు తనను విశ్వసించలేదన్న భావనతో కేసీఆర్ ఉన్నారనిపిస్తుంది. అందుకే పార్లమెంటు ఎన్నికల్లో ఒక్కసీటును కూడా గెలుచుకోలేకపోయామని భావించిన కేసీఆర్ జనంలోకి రావడం తొందరపడినట్లే అవుతుందని ఫిక్స్ అయిపోతున్నట్లు కనిపిస్తుంది. అందుకే ఆయన ఫాం హౌస్ ను వదిలి బయటకు రావడం లేదు.ఏదైనా పని ఉంటే నేతలను మాత్రమే తన వద్దకు రప్పించుకుంటున్నారు కానీ ఆయన కనీసం హైదరాబాద్ కు కూడా రావడం లేదు. ఏదైనా మెడికల్ చెకప్ లకు మాత్రమే అప్పుడప్పుడు హైదరాబాద్ కు వచ్చి వెళుతున్నారు తప్పించి ఫాం హౌస్ లో ఉ ంటూ వ్యవసాయ పనుల్లోనే నిమగ్నమయ్యారు. అందులోనే ఆనందాన్ని వెతుక్కుంటున్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనూ వీలు చిక్కినప్పుడల్లా ఫాం హౌస్ కి వెళ్లి గడిపి వచ్చే వారు. అలాంటిది పార్టీ 2023 ఎన్నికలలో ఓటమి తర్వాత ఇక తెలంగాణలో సమస్యల గురించి పెద్దగా పట్టించుకోవడం లేదు. గతంలో నల్లగొండ జిల్లాకు వచ్చి రైతుల సమస్యలపై గళం విప్పి వెళ్లడం మినహాయించి పెద్దగా ఆయన బయటకు వచ్చింది లేదుఇక అసెంబ్లీ సమావేశాలకు కూడా ఆయన రావడం మానుకున్నారు. హాజరు వేయించుకోవాలని గవర్నర్ ప్రసంగం రోజు తప్పించి మిగిలిన రోజులు మళ్లీ షరా మామూలే. అసెంబ్లీలోనూ కేటీఆర్, హరీశ్ రావులు మాత్రమే బీఆర్ఎస్ తరుపున మాట్లాడుతున్నారు. ప్రజాసమస్యలను లేవనెత్తుతున్నారు. కేసీఆర్ మాత్రం ప్రజలు తన విలువ తెలుసుకోవాలని భావిస్తున్నట్లుంది. తాను ఉన్నప్పుడు ఎన్ని సంక్షేమ పథకాలు అమలు చేసిందీ ప్రజలు గుర్తుకు తెచ్చుకుని మరీ వారి మనసుల్లో మార్పు రావాలని, మనం ఎంతగా విమర్శలు చేసినా అవి గాలికి పోతాయి తప్పించి ప్రజలు పట్టించుకోరని కేసీఆర్ గట్టిగా విశ్వసిస్తున్నారు. అందుకే సుదీర్ఘకాలం పార్టీ ఇన్నర్ మీటింగ్ లు తప్ప బయటకు మాత్రం కేసీఆర్ రావడం లేదంటున్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న తప్పులే తనకు మళ్లీ అధికారాన్ని తెచ్చిపెడతాయని కేసీఆర్ భావిస్తున్నారు.



అంతే తప్ప మనం గొంతు చించుకుని, ఎండనకా, వాననకా జనంలో తిరిగినా ఫలితం ఉండదని ఆయన తన అనుభవ పూర్వకంగా తెలుసుకున్నారు. తాము ఎన్ని సంక్షేమ పథకాలు అమలు చేసినా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నమ్మి గత ఎన్నికల్లో ప్రజలు ఓటేశారని, తిరిగి అదే ప్రజలు తనను గెలిపించి తీరతారన్న నమ్మకంతో గులాబీ బాస్ ఉన్నారు. ఇప్పటి నుంచేవ్యయ ప్రయాసలకోర్చి జనంలోకి వెళ్లినా పెద్దగా ప్రయోజనం ఉండదని, కాంగ్రెస్ ను చేయాల్సిన తప్పులన్నీ చేయించేంత వరకూ వేచి ఉ ండటమే మంచిదని కేసీఆర్ నేతలతో అన్నట్లు తెలిసింది. మొత్తం మీద కేసీఆర్ ఇప్పట్లో జనంలోకి వచ్చే అవకాశం కనిపించడం లేదు. ఈ నెలలో జరిగే పార్టీ ఆవిర్భావ సభకు హాజరై తిరిగి ఫామ్ హౌస్ కే పరిమితం కానున్నారు.

# అసలు ఎన్ని ఎకరాలు.. మిగిలిన సంగతేంటీ...

హైదరాబాద్, ఏప్రిల్ 12,

కంచె గచ్చిబౌలి భూములు. కాదు కాదు హెచ్ సీయూ భూములు. ఆ 400 ఎకరాలపై ఎవరి వాదన వారిదే. ఇన్నాళ్లూ తమ ఆధీనంలోనే ఉన్నాయి కాబట్టి ఆ భూమి తమదే అనేది సెంట్రల్ యూనివర్సిటీ మాట. లీగల్‌గా ఆ ల్యాండ్ గవర్నమెంట్‌దేనని సర్కారు వాదన. ఇంతకీ ఆ భూమి ఎవరిది? హెచ్ సీయూకి అసలు ఎంత స్థలం ఉంది? మొదట్లో ఎంత ఉండేది? ఇప్పుడు ఎంత మిగిలింది? ఇన్నేళ్లలో ఎన్ని వేల ఎకరాలు చేతులు మారాయి? ఈ 400 ఎకరాల కోసమే ఎందుకింత గొడవ జరుగుతోంది? ఈ ప్రశ్నలన్నిటికీ లెక్కలు బయటకు వచ్చాయి. ఆ నిజాలు చాలా చేదుగా ఉన్నాయి. సుమారు 2వేల 700 ఎకరాలతో మొదలైన సెంట్రల్ యూనివర్సిటీ.. 50 ఏళ్లు గడిచే సరికి కేవలం 484 ఎకరాలకే పరిమితమైంది. అంటే సుమారు 2వేల ఎకరాల భూమి ఊఅజ నుంచి వేరు వేరు సంస్థలకు బదలాయించారంటే నమ్మాల్సిందే.1975లో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ఏర్పాటైన నాడు.. 2324.05 ఎకరాల భూమిని కేటాయించారు. చాలాకాలం తర్వాత 2004లో మరో 397.16 ఎకరాలు అదనంగా ఇచ్చారు. ఈ మధ్యలో అనేక మలుపులు, ట్విస్టులు కూడా ఉన్నాయి. మొత్తం ల్యాండ్‌లో 105 ఎకరాల్లో చెరువులు, కుంటలు ఉన్నాయి. మరో 400 ఎకరాల భూమి రాళ్లమయం. 255 ఎకరాలు పచ్చని చెట్లతో గ్రీన్ బఫర్ ఏరియాగా ఉంది. 200 ఎకరాల గుండా హైటెన్షన్ కరెంట్ వైర్లు వెళ్తున్నాయి. ఇక, రోడ్లు, నడకదారులకు ఇంకో 65 ఎకరాలు పోయింది. ఈ లెక్కన.. ఎలాంటి నిర్మాణాలు లేకుండా మిగిలిన భూమి విస్తీర్ణం.. 1025 ఎకరాలు.ఈ హెచ్ సీయూ భూముల నుంచి వివిధ సందర్భాల్లో.. వివిధ ప్రభుత్వాల హయాంలో.. వివిధ సంస్థలకు స్థలాలు ధారాదత్తం చేశారు. స్థానిక ఓఖీూ ఆఫీస్ కోసం 5 ఎకరాలు ఇచ్చారు. ట్రిబుల్ ఐటీ కోసం 62 ఎకరాలు కేటాయించారు. ూంంఖ నేషనల్ గేమ్స్ కోసం 108 ఎకరాలు కట్టబెట్టారు. ూంంఖ మిలటరీ గేమ్స్ కోసం మరో 13 ఎకరాలు, ూంంఖ హాకీ స్టేడియం కోసం ఇంకో 14 ఎకరాలు ఇచ్చేశారు. జవహార్ నవోదయ విద్యాలయం కోసం 30 ఎకరాల భూమిని, సీఆర్ రావ్ ఇన్‌స్టిట్యూషన్‌కు 5 ఎకరాలు, ఏపీట్రాన్స్‌కోకు 5 ఎకరాలు, ఏపీఎస్ఆర్టీసీకి సుమారు 10 ఎకరాలు, ఏపీఎన్జీవోస్ ఇళ్ల స్థలాల కోసం మరో 134 ఎకరాలు.. ఔఎంః సంస్థకు 100 ఎకరాలు.. ఇలా పలు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు హెచ్ సీయూ భూములను భారీగానే కట్టబెట్టారు. అదే కోవలో.. బిల్లీ రావుకు చెందిన ఐఎంజీ భారత్ అనే ప్రైవేట్ సంస్థకు సైతం 400 ఎకరాల స్థలం అప్పగించారు. ఈ భూమి పైనే ప్రస్తుతం గొడవ జరుగుతోంది. ఇలా 1975 నుంచి 2025 వరకు మొత్తంగా 1212.13 ఎకరాల యూనివర్సిటీ భూమిని వేరు వేరు యాజమాన్యాలకు బదిలీ చేశారు.ఇలా అచ్చంగా హెచ్ సీయూ కు కేటాయించిన మొత్తం భూమి 2721.21 ఎకరాలు. ఇందులో చెరువులు, రాళ్లు, వైర్లు, రోడ్లు కోసం మినహాయించిన భూమి 1025 ఎకరాలు. వివిధ సంస్థలకు కేటాయించిన ల్యాండ్ మరో 1212.13 ఎకరాలు. ఇదంతా తీసేస్తే.. ఈ రోజుకు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ దగ్గర ప్రస్తుతం మిగిలి ఉన్న భూమి.. కేవలం 484.04 ఎకరాలు మాత్రమే. ఇదీ లెక్క.

# పద్మశ్రీ వనజీవి రామయ్య కన్నుమూత

ఖమ్మం:

పద్మశ్రీ అవార్డు గ్రహీత వృక్ష ప్రేమికుడు దరిపెల్లి. రామయ్య (వనజీవి రామయ్య) కన్నుమూశారు.అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఖమ్మం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. కోటి మొక్కలు నాటి ప్రకృతి ప్రేమికుడిగా పేరు గాంచిన ఆయనను ×2017లో కేంద్రం పద్మశ్రీతో సత్కరించింది. రామయ్య స్వస్థలం ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లి.

# నల్లగొండ జిల్లా కేంద్రంలో దారుణ హత్య

నల్గొండ

జిల్లా కేంద్రం రామగిరి లోని గీతాంజలి కాంప్లెక్స్ లో ఓ వ్యక్తి ని గుర్తుతెలియని దుండగులు అతి కిరాతకంగా నరికి చంపారు. ఎస్పీ ఆఫీస్,టూ టౌన్ పోలీస్ స్టేషన్ కు కూతవేటు దూరం లోనే ఘటన జరిగింది. మృతుడు పట్టణం లోని మణికంఠ లేజర్ కలర్ ల్యాబ్ ఓనర్ సురేష్(37). దాడిని తప్పించుకునే ప్రయత్నం చేసిన సురేష్..వేట కత్తులతో దుండగులు వెంటాడి నరికి చంపారు. కుటుంబ కలహాలు,పాత కక్షలు ఏమైనా ఉ న్నాయా అనే కోణంలో టూ టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ...

# సర్వంగ సుందరంగా తాడ్ బన్ హనుమాన్ ఆలయం

సికింద్రాబాద్.. హనుమాన్ జయంతి పురస్కరించుకొని తాడ్ బండ్ హనుమాన్ దేవాలయాన్ని సర్వంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఉదయం నుండే పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.. ప్రత్యేక పూజలు అభిషేకాలు హనుమాన్ చాలీసా పారాయణాలతో తాడ్ బండ్ హనుమాన్ దేవాలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.ఆంజనేయ స్వామి దర్శనం నిమిత్తం భక్తులకు ఎలాంటి ఆసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాటు చేశారు.. ఆలయ ప్రాంగణమంతా జైశ్రీరామ్ నినాదాలతో మార్మోగుతుంది. ఆలయ పరిసర ప్రాంతాలలో రామలక్ష్మణుల సమేత హనుమంతుడి విశేష అలంకరణ తో పాటు విద్యుత్ దీపాల వెలుగులు అందరినీ ప్రత్యేకంగా ఆకర్షిస్తున్నాయి. రకరకాల సెట్టింగులతో కూడిన విద్యుత్ దీపాల కాంతులతో తాడ్బండ్ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణం మెరిసిపోతోంది.. ఆలయానికి వచ్చే భక్తులకు ఆలయ నిర్వహణ అధికారి అంబుజ ఆధ్వర్యంలో అన్ని విధాలా వసతులు సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు.. బ

# సేంద్రియ ఉత్పత్తులే ఆరోగ్యానికి శ్రేష్టకరం: ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి

ఖమ్మం బ్యూరో, భారత శక్తి, ఏప్రిల్ 12: నగరంలోని కవి రాజ్ నగర్ లో గల ఇంటిగ్రేటెడ్ మార్కెట్ లో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల స్థాయి మెగా ఆర్గానిక్ మేళాను ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి శనివారం ప్రారంభించారు. మార్కెట్ లో ఏర్పాటు చేసిన సేంద్రీయ ఉత్పత్తులతో కూడిన స్టాళ్లను పరిశీలించారు. నిర్వాహకులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ రఘురాంరెడ్డి మాట్లాడుతూ సేంద్రియ ఆహారమే ఆరోగ్యానికి ఎంతో శ్రేష్టకరమని అన్నారు. చిట్టి ముత్యాల బియ్యం, అరకు చాయ్ ను తాము చాలా ఏళ్లుగా వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఈ స్టాళ్ల నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చ జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లమల వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్, మిక్కిలినేని నరేందర్, మంజుల, దీపక్ చౌదరి, టీ ఏ సీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, ఇమామ్



భాయ్, నాయకులు శ్రీ కళా రెడ్డి, దుంపల రవి, ఎయిర్ టెల్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# సుల్తాన్పూర్ జేఎన్టీయూ కళాశాలలో ఇంజనీరింగ్ వర్క్ షాప్ అవగాహన



సంగారెడ్డి, భారతశక్తి ప్రతినిధి, ఏప్రిల్ 12 : సంగారెడ్డి జిల్లా సుల్తాన్పూర్ జేఎన్టీయూ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో వర్క్ షాప్ నిర్వహించారు. ఎస్టేట్ 2%ఎ%25 పేరు మీద నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఎండి ఎస్పీ ఇంజనీరింగ్ అసోసియేషన్ టి ప్రశాంత్ మాట్లాడుతూ భవనాలకు మున్సిపల్ పర్మిషన్లు, ప్లానింగ్ ఎలా చేస్తారు వివరించారు. అదేవిధంగా అర్బన్ ఏరియాలో, రూరల్ ఏరియాలలో విధి విధానాలను మరియు హైడ్రా గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

మరో ముఖ్య అతిథి మరో ముఖ్య వక్త మనోజ్ మాట్లాడుతూ స్టార్ట్ అప్ కంపెనీ విధి విధానాలు తెలియజేశారు. వాటి వల్ల వచ్చే సమస్యలను ఎలా ఎదుర్కోవాలి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రధానోపాధ్యాయులు జి నర్సింహా, వైస్ ప్రిన్సిపాల్ వై రాఘవేందర్, సివిల్ ఇంజనీరింగ్ ఇన్చార్జ్ హెచ్ ఓ డి సునీత, డిపార్ట్మెంటల్ టీచింగ్ స్టాఫ్, నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్నాం : మంత్రి సీతక్క

## - 33 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ములుగు జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 12 (భారతశక్తి) : ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు తాను ములుగు నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను విడతల వారీగా అమలు చేస్తున్నామని, రాష్ట్రంలోని పేద ప్రజల అభిప్రాయం మేరకే ప్రజా ప్రభుత్వం పలు పథకాలను ప్రవేశపెడుతున్నదని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళ- శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ (సీతక్క) శనివారం జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, జిల్లా గ్రంధాలయ చైర్మన్ బానోత్ రవిచందర్ లతో కలిసి మండలంలోని జంగాలపల్లి గ్రామం నుండి జగ్గన్న గూడెం గ్రామం వరకు 33 కోట్ల రూపాయలతో చేపట్టిన అంతర్గత సిసి రోడ్డు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం రాయిని గూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. అనేక సంవత్సరాలుగా లోతట్టు ఏజెన్సీ గ్రామాల ప్రజలు రోడ్డు సౌకర్యం కల్పించాలని పాలకులకు మొరపెట్టుకున్నప్పటికీ గత పది సంవత్సరాల బిఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని, గ్రామాలలో రోడ్లు పనులే కాకుండా జంగాలపల్లి గ్రామం నుండి జగ్గనగూడెం గ్రామం వరకు చేపట్టిన ప్రధాన రోడ్డు పనులు చివరి దశలో ఉన్నాయని అన్నారు. జగ్గన్నగూడెం గ్రామం వద్ద గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం లో లోవల్ బ్రిడ్జి నిర్మించింది అని అయినప్పటికీ ఏజెన్సీ గ్రామాల ప్రజల ఇబ్బందులను గుర్తించి ఐదు కోట్ల రూపాయలతో హై లెవెల్ బ్రిడ్జి నిర్మించడం జరుగుతుందని తెలిపారు. ఏజెన్సీ గ్రామాల ప్రజలు రెండు పంటలు పండించుకోవడానికి కాల్వల ద్వారా గోదావరి జలాలను తరలించడం జరుగుతుందని, లక్నవరం సరస్సులో నిత్యం నీరు నిల్వ ఉండే విధంగా స్టోరీ చేయడం జరుగుతుందని వివరించారు. ఏజెన్సీ గ్రామాలలోని ప్రజలకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వారం లోగా చేపట్టడం జరుగుతుందని, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వెనుకబడిన ప్రజల కలలు నెరవేర్చడమే లక్ష్యంగా ముందుకు పోతున్నానని, రానున్న రోజులలో ములుగు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని మంత్రి సీతక్క అన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు ఎమ్మార్వో విజయ భాస్కర్, పంచాయతీరాజ్ ఇ, ఇ, అజయ్ కుమార్, ఆయా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులు ఐసిడిఎస్ సిబ్బంది అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# మద్యం సేవించి వాహనం నడపడం నేరం, చట్టపరమైన చర్యలు తప్పవు: వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)ఏప్రిల్12:మద్యం సేవించి వాహనం నడపడం నేరమని, వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని వరంగల్ పోలీస్ కమిషనర్ హెచ్చరించారు. వానదారులు మద్యం సేవించి వాహనం నడపడం ద్వారా పత్యక్షంగాని, పరోక్షంగాని రోడ్డు ప్రమాదాలకు ప్రధానకారకులు కావడంతో కొన్ని సందర్భల్లో సదరు మద్యం సేవించి వాహనదారుడు సైతం రోడ్డు ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నారు. తద్వారా ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఇది దృష్టిలో వుంచుకోని వరంగల్ పోలీస్ కమిషనరేట్ మద్యం సేవించి వాహనదారుల వలన కలిగే రోడ్డు ప్రమాదాల నివారణకై వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతోంది. ఇందులో భాగం వరంగల్ ట్రైసిటి పరిధిలో ట్రాఫిక్ , లా అండ్ ఆర్డర్ పోలీసులు నిరంతరం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టడం జరుగుతుందని. అలాగే గ్రామీణా ప్రాంతాల్లోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించబడుతున్నాయి. ప్రధానం వరంగల్ ట్రై పరిధిలో ట్రాఫిక్ పోలీసులు చేపట్టే తనిఖీల్లో పట్టుబడిన వాహనదారులకు ముందుగా కమిషనరేట్ కార్యాలయములోని ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్ వాహనదారుల కుటుంబ సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించిన అనంతరం కోర్టులో న్యాయమూర్తి ఎదుట పర్చడం ద్వారా వాహనదారులకు కోర్టులో జైలు శిక్ష లేదా జరిమానా విధించడం జరుగుతుందని. వరంగల్ పోలీస్ కమిషనరేట్లో గత నెల రోజుల్లో ముమ్మరంగా జరిపిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మొత్తం 3029 కేసులు నమోదు




కాగా, ఇందులో 53 మందికి వాహనదారులకు జైలు శిక్ష విధించగా, మరో 15మంది వాహనదారులకు సామాజిక సేవ చేయాలంటూ కోర్టు తీర్పు నివ్వగా, 15లక్షల 72వేల ఆరువందల రూపాయలు వాహనదారులు ఫైన్ రూపంలో కోర్టులో జరిమానాలు చెల్లించారని పోలీస్ కమిషనర్ వెల్లడిరచారు. మీ కుటుంబాన్ని దృష్టిలో వుంచుకోని వాహనదారులు మద్యం సేవించి వాహనం నడపవద్దని, మీరు చేసే తప్పిదాలతో ఇతరులు కూడా ప్రాణాలు కోల్పోయినవారు కొందరైతే మరి కొందరు అంగవైకల్యంగా జీవితాలను కొనసాగిస్తూన్నారని. ఇకన్కెన వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని. వాహనదారులు మీ గమ్యానికి సురక్షితంగా చేరుకోవడమే వరంగల్ కమిషనరేట్ పోలీసుల ప్రధాన లక్ష్యమని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు.

# రాష్ట్రీయ మిలటరీ స్కూల్స్ కు ఎంపికైన విద్యార్థులను

## అభినందించిన కలెక్టర్ కుమార్ దీపక్

మందమర్రి టౌన్, ఏప్రిల్ 12,(భారత శక్తి):రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మకమైన రాష్ట్రీయ మిలిటరీ స్కూల్స్ భారతదేశంలో కేవలం ఐదు ప్రదేశాలలో (హిమాచల్ ప్రదేశ్ లో చైల్, కర్ణాటకలో బెంగుళూరు, బెల్గాం, రాజస్థాన్ లోని దోల్పూర్ అజ్మీర్) మాత్రమే ఉన్నాయి. 1925లో కింగ్ జార్జ్ రాయల్ ఇండియన్ మిలిటరీ స్కూల్ పేరుతో స్థాపించబడి 1966లో మిలిటరీ స్కూల్స్ ఆ తర్వాత 2007లో రాష్ట్రీయ మిలటరీ స్కూల్ గా పేరు మార్చుకుని రూపాంతరం చెందిన ప్రఖ్యాత పాఠశాలలో మందమర్రి పట్టణంలోని లత ఇనిస్టిట్యూట్ ఆఫ్ నవోదయ సైనిక్ పాఠశాల ద్వారా సాధారణ పౌరుల పిల్లలకు కేటాయించిన 30 శాతం సివిలియన్ విభాగంలో గుర్రం ఆకాశ్ పటేల్, బానోతు రితిక రాజ్ లు ఎంపిక కావడం విశేషం. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ లతాశ్రీ లకు జ్ఞాపికలు అందించి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశంలోనే



ప్రతిష్టాత్మకమైన రాష్ట్రీయ మిలిటరీ స్కూల్ లో అర్హత సాధించడానికి చదువులో నిరంతరం కష్టపడి మంచిర్యాల జిల్లా ఖ్యాతిని దేశవ్యాప్తంగా మారుమోగేలా చేశారని స్కూల్ యాజమాన్యానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# మద్దినేని స్వర్ణకుమారి కుటుంబానికి ఎంపీ రఘురాం రెడ్డి పరామర్శ



(ఖమ్మం బ్యూరో), భారత శక్తి, ఏప్రిల్ 12: కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు మద్దినేని స్వర్ణకుమారి తోటి కోడలు కొల్లు కళావతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి, మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి శనివారం వారి నివాసానికి వెల్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కళావతి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటుకు దీటుగా.... ప్రభుత్వ కాలేజీలు

విజయవాడ, ఏప్రిల్ 12

ప్రభుత్వ జూనియర్ కాలేజీలను ప్రైవేటు కాలేజీలకు ధీటుగా తీర్చిదిద్దుతామనే విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సంకల్పం కార్యరూపం దాలుస్తోంది. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రభుత్వ జూనియర్ కాలేజీల పనితీరులో గణనీయమైన మార్పు వచ్చింది. ఇంటర్మీడియట్ పరీక్షల్లో విద్యార్థులు సాధించిన ఫలితాలే ఇందుకు నిదర్శనం. గత పదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది ఇంటర్మీడియట్ ఫలితాల్లో విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం గణనీయంగా పెరిగింది. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ప్రమాణాల పెంపునకు మంత్రి నారా లోకేష్ తీసుకున్న చర్యలే ఇందుకు కారణం.ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో గత పదేళ్లలో ఎన్నడూలేని విధంగా విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరిగింది. ఇంటర్మీడియట్ రెండో ఏడాదిలో గత పదేళ్ల కంటే రికార్డు స్థాయిలో ఈ ఏడాది అత్యధికంగా 69 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్మీడియట్ మొదటి ఏడాది పరీక్షల్లో గత పదేళ్లతో పోలిస్తే రెండో అత్యధిక ఉత్తీర్ణత శాతం నమోదైంది. ఈ ఏడాది ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థుల్లో అత్యధికంగా 47 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ, ప్రైవేటు మొత్తంగా ఇంటర్మీడియట్ ఫలితాలు చూసుకుంటే గత పదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో ఇంటర్మీడియట్ మొదటి ఏడాదిలో అత్యధికంగా 70శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా.. రెండో ఏడాదిలో రికార్డు స్థాయిలో అత్యధికగా 83 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. జిల్లాల పరంగా చూసుకుంటే ఇంటర్మీడియట్ మొదటి ఏడాదిలో పార్వతీపురం మన్యం జిల్లాలో అత్యధికంగా 70శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అత్యల్పంగా విశాఖపట్నం జిల్లాలో 34శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇంటర్మీడియట్ రెండో ఏడాదిలో అత్యధికంగా పార్వతీపురం మన్యం జిల్లాలో 81 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా.. అత్యల్పంగా విశాఖపట్నం జిల్లాలో 55శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇంటర్మీడియట్ ఒకేషనల్ లోనూ గత పదేళ్లతో పోలిస్తే రికార్డు స్థాయిలో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల విషయానికి వస్తే ఇంటర్మీడియట్ ఒకేషనల్ మొదటి ఏడాదిలో గత పదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో అత్యధికంగా 64శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్మీడియట్ ఒకేషనల్ రెండో ఏడాదిలో గత పదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో అత్యధికంగా 82శాతం ఉత్తీర్ణత నమోదైంది.

విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రభుత్వ జూనియర్ కాలేజీల పనితీరులో గణనీయమైన మార్పు చోటుచేసుకుంది. ఫలితంగా రికార్డు స్థాయిలో ఇంటర్ ఫలితాల్లో ఉత్తీర్ణతా శాతం పెరిగింది. వైసీపీ హయాంలో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ రద్దు చేసింది. నారా లోకేష్ గారు బాధ్యతలు చేపట్టిన తర్వాత సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పేరుతో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందించడం జరిగింది. అదేవిధంగా ఇంటర్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలుచేయడం జరిగింది.

# వికలాంగుల అభివృద్ధికి ప్రతి క్షణం తోడ్పాటుగా ఉంటాం: రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్

భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో షేక్ అహ్మద్, ఏప్రిల్ 12: నిర్మల్ జిల్లా వికలాంగులు సమాజంలో సమాన హక్కులు పొందేందుకు, వారి అభివృద్ధికి అన్ని విధాలా మద్దతు అందిస్తామని రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ. నిర్మల్ జిల్లావ్యాప్తంగా కొందరు నకిలీ వికలాంగులు కాకుండానే డబ్బులు చెల్లించి సర్టిఫికెట్లకు సంపాదించి పెన్షన్ పొందుతున్న వారిపై ప్రత్యేక దృష్టి పెట్టామని అలాగే తన వద్ద ఆధారత సహా ఉన్నాయని సవాల్ విసిరారు. ముందు ముందు అధికార దృష్టికి తీసుకువెళ్లి పెన్షన్ ఆపే విధంగా చేస్తామని అలాగే ఇప్పటివరకు తీసుకున్న పెన్షన్ రికవరీ చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకొని విధంగా ఉపాధికారులకు ఫిర్యాదు చేస్తామని అన్నారు. ప్రత్యేక అవసరాలతో ఉన్నవారి ప్రతిభను గుర్తించి, వారికి తగిన వనరులు, శిక్షణ మరియు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రాధాన్యమని ఆయన పేర్కొన్నారు.ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, “వికలాంగులు సామాజిక, ఆర్థిక రంగాల్లో ముందుకు రావాలంటే సమర్థవంతమైన ప్రణాళికలు, మద్దతు వ్యవస్థలు అవసరం. వారికి స్వయం ఉపాధి, విద్యా, ఆరోగ్య పరిరక్షణలో ప్రత్యేక సహాయం అందించాల్సిన అవసరం ఉంది,” అని అన్నారు.ప్రభుత్వం ఇప్పటికే పలు పథకాలు ప్రారంభించినప్పటికీ, వాటి అమలులో సమర్థత మరింత పెరగాలని ఆయన సూచించారు. వికలాంగుల సంఘాల పట్ల ప్రభుత్వం సహకారంగా ఉండాలని, వారి అభిప్రాయాలను వినిపించుకోవాలని అభిప్రాయపడ్డారు. మరియురాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువశక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వికలాంగుల అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ పథకం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు, స్వయం ఉపాధికి ప్రోత్సాహం లభించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రత్యేకంగా వికలాంగులకు కూడా ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. యువత ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ భవిష్యత్తును మెరుగుపరుచుకోవాలని కోరారు.

:: పుట్టగొడుగుల సంఘాలు::






సంఘాలు ఎన్ని వచ్చినా సేవల్లో ముందుండే స్నేహ రాష్ట్ర వికలాంగుల సంఘం: తగ్గేదిలే! రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ సంఘాలు ఎన్నో వచ్చినా, సేవల పరంగా ఎప్పుడూ ముందుండే స్నేహ రాష్ట్ర వికలాంగుల సంఘం తన అంకితభావాన్ని నిరూపించుకుంటుందని రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ తెలిపారు. వికలాంగుల హక్కుల కోసం నిరంతరంగా పోరాడుతున్న తమ సంఘం, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దివ్యాంగులకు అనేక సేవా కార్యక్రమాలు అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వంతో కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూనే, సామాజిక సేవలో కూడా ముందుంటామని ఆయన తెలిపారు.

# కాంగ్రెస్ పాలనలో పేదలకు కన్నీళ్లు రానివ్వం: మంత్రి పొంగులేటి



మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలోని పేద ప్రజలకు ఎట్టి పరిస్థితుల్లోనూ కన్నీళు రానివ్వమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మణుగూరు, బూర్గంపాడు, అశ్వాపురం, పినపాక, కరకగూడెం మండలాల్లో పర్యటించారు. మణుగూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో రూ.4.30 కోట్లతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మహాత్మా జ్యోతిబాఫులే చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం స్థానిక ప్రజాభవన్‌లో నిర్వహించిన సమావేశంలో పొంగులేటి మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యం వచ్చిన మొదటిరోజే గత పాలకుల కోట ప్రగతిభవన్‌ను ఫులే భవన్‌గా మార్చిన ఘనత కాంగ్రెస్‌కు దక్కుతుందని తెలిపారు. గిరిజన ప్రాంతమైన భద్రాద్రి జిల్లాలో సీతారామ కాలువ ద్వారా సాగునీటి తరలింపు, పోడుభూముల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. పులుసుబొంత ప్రాజెక్టుకు అతిత్వరలో సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేస్తారని తెలిపారు.

మణుగూరు మండలం కూనవరంలో సన్నబియ్యం లబ్ధిదారు వంక శివలక్ష్మి ఇంట్లో మంత్రి పొంగులేటి భోజనం చేశారు. శివలక్ష్మి కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలను అందజేశారు. ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్, డీసీసీబీ డైరెక్టర్ బ్రహ్మయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పీర్నాకి నవీన్ పాల్గొన్నారు.



## సాగర్ ఆయకట్టుకు సాగునీరు బంద్

%ఖమ్మం నగరం, కూసుమంచి, : జిల్లాలో సాగర్ కాలువకు సాగునీటి సరఫరా గురువారం అర్ధరాత్రి నుంచి బంద్ చేశారు. రబీ సీజన్‌లో పంటల సాగుకు ఏప్రిల్ 24 వరకు అందిస్తుంటారు. ఈ ఏడాది అలాగే ఇస్తామని మొదట నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. సాగర్ జలాశయంలో నీటిమట్టం తగ్గుతున్నందున వేసవిలో హైదరాబాద్ నగరం సహా వివిధ జిల్లాలకు తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలనే ఉద్దేశంతో 14 రోజుల ముందుగానే సాగునీటి సరఫరా ఆపేశారు. శుక్రవారం మధ్యాహ్నం సాగర్ జలాశయం వద్ద ఎడమ కాలువకు నీటి విడుదల ఆపేయగా, అర్ధరాత్రి పాలేరు రిజర్వాయర్ అవుట్ ఫాల్ నుంచి దిగువకు నీటి విడుదల నిలిపేశారు. పాలేరు రిజర్వాయర్ నీటిమట్టం 23 అడుగులకు చేరగా.. వైరా రిజర్వాయర్ పూర్తిగా నిండింది. సాగర్ కాలువల పరిధిలో సుమారు 300కు పైగా చెరువులకు వారం రోజులుగా నీటిని అందించగా.. నీటిమట్టం పెరిగింది. పాలేరు పాత కాలువ కింద ఆయకట్టుకు కొన్ని రోజులు నీటిని విడుదల చేయనున్నారు. 21 ఎంబీసీ, 16, 17 (నందిగామ), బోనకల్లు, మధిర బ్రాంచి కాలువలు సహా అన్ని మేజర్, మైనర్ కాలువలకు నీటి సరఫరా నిలిచిపోయింది. వైరా మండలం రెబ్బవరం గ్రామంలో సుమారు 100 ఎకరాల్లో వరి పంట పొట్ట దశలో ఉందని, స్థానిక వనరులతో పంట కాపాడుకోవాలని అక్కడి రైతులకు అధికారులు సూచించారు. జిల్లావ్యాప్తంగా సాగర్ ఆయకట్టులో మొక్కజొన్న, వరి పంటలు కోతకొచ్చాయి. ఖరీఫ్, రబీ సీజన్లలో సాగర్ ఆయకట్టుకు విజయవంతంగా సాగునీరు సరఫరా చేశామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీటి విడుదల బంద్ చేసినట్లు జలవనరులశాఖ ఎస్ఈ మంగళపుడి వెంకటేశ్వర్లు తెలిపారు.

## లక్ష్యానికి మించి.. తాగునీటి పరీక్షలు

ఖమ్మం ప్రజలు వినియోగించే తాగునీటిని ప్రయోగశాలల్లో పరీక్షిస్తుంటారు. బోర్లు, బావులు, పీడబ్ల్యూ పథకాలు సహా వివిధ నీటివనరుల నుంచి తాగునీటిని ప్రభుత్వం సరఫరా చేస్తుంది. మిషన్ భగీరథ పథకంలో ఇంటింటికీ నల్లా ద్వారా నీరు అందిస్తోంది. ఈ జలాలను వివిధ దశల్లో శుద్ధిచేస్తున్నా పైపులు, ట్యాంకులు దాటి ఇళ్లకు చేరేసరికి నాణ్యత ఎలా ఉంటుందనే సందేహాలను చాలామంది వ్యక్తపరుస్తుంటారు. తాగునీటిని నిరంతరం పరీక్షించేందుకు ప్రభుత్వం ప్రయోగశాలలు ఏర్పాటుచేసింది. ఖమ్మంలోని మిషన్ భగీరథ కార్యాలయంలో జిల్లాస్థాయి ప్రయోగశాల ఉంది. మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం, మణుగూరు, భద్రాచలం, అశ్వారావుపేటలో సబ్ డివిజన్ స్థాయి ప్రయోగశాలలు కొలువుదీరాయి. ప్రతి ప్రయోగశాలలో నెలకు 300 చొప్పున ఏడాదికి 3,600 నీటి నమూనాలు పరీక్షించాలి. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు కేటాయించిన లక్ష్యాన్ని మించి పరీక్షలు పూర్తిచేశారు. ఖమ్మంలో 4,428, మధిర- 3,767, సత్తుపల్లి- 3,896, కొత్తగూడెం-4863, మణుగూరు-3697, భద్రాచలం-



3,743, అశ్వారావుపేటలో 3,686 నీటి నమూనాలు పరీక్షించారు. తాగునీటిలో ఫ్లోరైడ్ శాతం, బ్యాక్టీరియా, నైట్రేట్స్ సహా వివిధ రకాల ఖనిజాలు, రసాయనాల స్థాయిని ప్రయోగశాలలో పరీక్షించి నీటి నాణ్యత ధ్రువీకరిస్తారు.

49 నీటి వనరుల్లో ఫ్లోరైడ్

ఖమ్మం జిల్లాలో 49 గ్రామ పంచాయతీల్లోని 49 నీటివనరుల్లో ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉన్నట్లు తేల్చారు. వెంటనే ఈ నీటి వనరులను వినియోగించకుండా మూసేశారు. బోర్లలో నీటిని పరీక్షించినప్పుడు ఫ్లోరైడ్ గుర్తించారు. ఫ్లోరైడ్ 1 నుంచి 1.5 మి.గ్రా.వరకు లీటర్ నీటిలో ఉండొచ్చు. అంతకు మించిన నీటిని తాగిన వారికి ఫ్లోరోసిస్ వ్యాధి సోకే ప్రమాదముంది. వేసవిలో నీటి వనరుల్లో నీటిమట్టం అడుగంటుతుంది. నీటిమట్టం కిందిగి దిగజారేకొద్దీ నీటిలో ఫ్లోరైడ్ శాతం పెరుగుతుంటుంది.

పాఠశాలల్లో పిల్లలకు సరఫరా చేసే తాగునీటి నాణ్యత ధ్రువపత్రాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటీవల అడుగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు, గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు సహా ప్రభుత్వ రంగ సంస్థలు నీటి నాణ్యత పరీక్షలను ఈ ప్రయోగశాలల్లో చేయిస్తుంటాయి. ప్రైవేటు వ్యక్తులు సైతం తాము ఉపయోగించే నీటి నాణ్యతను ప్రయోగశాలల్లో పరీక్షించుకోవచ్చు.

## జోరందుకున్న అనుసంధానం



భద్రాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రం(బీటీపీఎస్) మొదటి యూనిట్ రెండు రోజుల్లో అందుబాటులోకి రానుంది. తొలి యూనిట్‌ను ఆదివారం అనుసంధానించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మొదటి యూనిట్ జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్(జీటీ) గతేడాది జూన్‌లో అగ్నిప్రమాదంలో కాలిపోయిన విషయం విదితమే. ఈనేపథ్యంలో ఇటీవల మరమ్మతులు చేపట్టి జీటీని అందుబాటులోకి తీసుకొచ్చారు. ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు పనుల్లో ఇంజినీర్లు నిమగ్నమయ్యారు.

పది నెలల అనంతరం.. బీటీపీఎస్ మొదటి యూనిట్ పది నెలల అనంతరం ఆందుబాటులోకి రానుంది. దీని ద్వారా బీటీపీఎస్ నుంచి పూర్తిస్థాయిలో 1,080 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరగనుంది. గతంలో బీటీపీఎస్‌లోని యూనిట్లు మరమ్మతులకు గురైతే 100 రోజుల్లోనే అందుబాటులోకి తీసుకొచ్చారు. అయితే జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవటంతో మరమ్మతులు నిర్వహించేందుకు జెన్‌కోకు సుదీర్ఘ సమయం పట్టింది.

క్షీణించిన విద్యుదుత్పత్తి.. మొదటి యూనిట్‌లో ఆటంకం వల్ల 2024-25 ఆర్థిక సంవత్సరంలో బీటీపీఎస్ నుంచి ఆశించిన స్థాయిలో విద్యుదుత్పత్తి జరగలేదు. 9,460 మిలియన్ యూనిట్లకు కేవలం 5,332 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అయ్యింది. ప్లాంట్ లోగ్ ఫ్యాక్టర్ 56.37 శాతమే నమోదైంది. మిగిలిన యూనిట్లూ 48సార్లు ట్రిప్ అయ్యాయి. 'తొలి యూనిట్ అనుసంధాన ప్రక్రియకు సర్వం సిద్ధమైంది. బీటీపీఎస్ నాలుగు యూనిట్లు నడిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో లక్ష్యాన్ని సాధిస్తాం.'అని సీఈ బిచ్చన్న 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

## మామిడి రైతులకు మహర్దశ

ఖమ్మం నగరంలో మామిడి మార్కెట్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. రోటరీనగర్ సమీపంలోని వీధివ్యాపారుల ప్రాంగణంలో వారం రోజుల్లో ఏర్పాటు చేసేందుకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ప్రత్యేక కృషితో ముస్తాబవుతోంది. మధ్యవర్తులు లేకుండా రైతులు నేరుగా వినియోగదారులకు విక్రయించుకునే విధంగా సిద్ధం చేస్తున్నారు. మొత్తం 35 స్టాల్స్‌లో రైతులు పండ్లను విక్రయించేందుకు అవకాశం



ఉంది. నగరంలో ఉమ్మడి జిల్లా స్థాయి మామిడి రైతులు, ఎగుమతిదారులకు గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పలువురు రైతులు మామిడి మార్కెట్ ఏర్పాటు గురించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మార్కెట్ లేకపోవటం వల్ల జరిగే నష్టం గురించి వివరించారు. స్పందించిన ఆయన మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఉద్యాన, వ్యవసాయ, నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. ప్రతిపాదిత ప్రాంగణాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. సీజనల్ మార్కెట్‌గా దీన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఖమ్మం జిల్లాలో 32వేల ఎకరాల్లో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 12వేల ఎకరాల్లో రైతులు మామిడి సాగు చేస్తున్నారు. దీని ద్వారా 1.80లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. ఇక్కడి నుంచి ప్రధానంగా హైదరాబాద్, విజయవాడ, నాగ్‌పుర్, కోల్‌కతా, ముంబయి, లఖ్‌నవూకు రవాణా చేస్తారు. అక్కడి నుంచి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, అమెరికా, యూకే, కువైట్, ఖతర్, కెనడా, నేపాల్, సింగపూర్, న్యూజిల్యాండ్, సౌదీ అరేబియా, బహ్రెయిన్ తదితర దేశాలకు ఎగుమతి చేస్తారు.

ఫ్రూట్ కవర్ల కోసం వినతి..

పండ్ల నాణ్యత దెబ్బతినకుండా ఉండేందుకు తమకు ఫ్రూట్ కవర్లను రాయితీపై అందజేయాలని మామిడి రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మార్కెటింగ్‌శాఖ అధికారులు వ్యవసాయ మార్కెట్ల ద్వారా, సహకారశాఖ అధికారులు సహకార సంఘాల ద్వారా రైతులకు ఎక్కడ అవసరమో గుర్తించి అందుకు అనుగుణంగా వారిని సరఫరా చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు.

మండీలే దిక్కు..

ప్రస్తుతం మామిడి పంటకు పలు రకాల తెగుళ్లు ఆశిస్తున్నాయి. వీటికి అనేక రకాల పురుగు మందులు వాడినప్పటికీ అదుపులోకి రావటం లేవు. ఫలితంగా రైతులకు పెట్టుబడి పెరగటంతో దిగుబడి తగ్గిపోతోంది. నాణ్యమైన పంట సైతం అంతంత మాత్రంగానే ఉంటుంది. నాణ్యతలేని పంటకు మార్కెట్‌లో సరైన ధర లభించదు. విదేశాలకు ఎగుమతి చేయాలంటే నిబంధనలు మరింత కఠినతరంగా ఉంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు, నాణ్యతగల దిగుబడులు పెంచేందుకుగాను అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సైతం మామిడికాయలు కొనేందుకు అనేక మంది వ్యాపారులు ప్రతి సంవత్సరం ఇక్కడకు రావటం ఆనవాయితీగా వస్తోంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక మండలాల్లో మామిడి మండీలను ఏర్పాటు చేశారు. ఇక్కడే గ్రేడింగ్ చేసిన అనంతరం పొరుగు రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారు.

## అనుమతిలేని ఇళ్లపై జరిమానాస్త్రం..

చెన్నూరు, పురపాలికల్లో అనుమతి లేని ఇళ్లు, దుకాణాలను గుర్తించే ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. వీటిని గుర్తించి జీవితకాలం జరిమానా విధిస్తూ పన్ను వసూలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వ్యాపార సముదాయాలు, నివాస గృహాలు కలిపి 80 వేల వరకు ఉండగా అందులో 3 వేల వరకు అనుమతిలేనివి ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

పట్టణాల్లో రికార్డు పరంగా ఉన్న ఇళ్లకు, వాస్తవంగా ఉన్న నిర్మాణాలకు వ్యత్యాసం గుర్తిస్తున్నారు. ఈ మేరకు అధికారులు ఇంటి కొలతలు తీసుకుంటున్నారు. వార్డుల వారీగా ఇళ్ల జాబితాను తీసుకొని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. రికార్డుల్లో లేని నిర్మాణాలను ప్రత్యేక జాబితాలో నమోదు చేస్తున్నారు. ఏళ్లుగా ఉన్నప్పటికీ పురపాలిక రికార్డుల్లో నమోదు కాని ఇళ్లు ప్రస్తుతం అధికారుల దృష్టికి చేరుతున్నాయి. రెండు, మూడు అంతస్తులు ఉన్నవారు,

## వ్యవసాయానికి వాడే విద్యుత్తు 1 శాతమే

, కొత్తగూడెం, ఇతర వర్గాల వినియోగదారులతో పోల్చితే భద్రాద్రి జిల్లాలో వ్యవసాయానికి వాడుతున్న విద్యుత్తు ఒక్క శాతమేనని విద్యుత్తుశాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గత ఐదేళ్లలో వ్యవసాయానికి వినియోగించిన విద్యుత్తు వార్షిక సగటు వృద్ధి 20.36 లక్షల యూనిట్లుగా నమోదైంది. గృహాలకు 1,131.10, గృహేతర(వాణిజ్య) 779.85, పరిశ్రమలు 53.54, వీధిదీపాలు, నీటి సరఫరా 107.74, ప్రార్థన మందిరాలు, పాఠశాలలల్లో 100.97 లక్షల యూనిట్ల వార్షిక సగటు వృద్ధి కనిపించింది. జిల్లాలో 2020-21లో 20,671.16లక్షల యూనిట్ల విద్యుత్తు డిమాండ్ ఉండగా 2024-25 నాటికి 31,787.93లక్షల యూనిట్లకు చేరింది.

మీటర్ రీడింగ్‌లు లేకపోవటంతో..

జిల్లాలో 2020-21లో 20,671.16లక్షల యూనిట్లలో 226.28లక్షల యూనిట్ల (1.09%) విద్యుత్తును వ్యవసాయానికి వినియోగించారు. 2024-25లో 31,787.93లక్షల యూనిట్లలో 330.79లక్షల యూనిట్ల(1.04%) విద్యుత్తును వ్యవసాయానికి వాడారు. గత ఐదేళ్లలో వ్యవసాయానికి వాడిన విద్యుత్తులో 104.51లక్షల యూనిట్ల వృద్ధి నమోదైంది. అయినప్పటికీ మొత్తం వినియోగంలో వ్యవసాయం వాటా ఒక్క శాతంగానే ఉంది. అయితే



వ్యవసాయానికి వాడే విద్యుత్తు విషయంలో స్పష్టమైన మీటర్ రీడింగ్‌లు లేకపోవటం, ఒక్క కనెక్షన్‌పై ఎక్కువ మోటార్లు వినియోగించటం తదితరాల వల్ల తక్కువగా నమోదవుతోందని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

పరిశ్రమలకు తగ్గింది..

ఐదేళ్లుగా జిల్లాలో పరిశ్రమలకు వినియోగించే విద్యుత్తు వాటా శాతం తగ్గుతూ వస్తోంది. 2020-21లో 1,324.21లక్షల యూనిట్ల కరెంట్(మొత్తం వినియోగంలో 6.40%) పరిశ్రమలకు వాడితే.. 2024-25నాటికి అది 1,591.93లక్షల యూనిట్లకు పెరిగినప్పటికీ మొత్తం వినియోగంతో(31,787.93) పోల్చితే 5శాతానికి తగ్గింది. జిల్లాలో ప్రధాన పరిశ్రమలు ఒక్కొక్కటిగా మూతపడటం, ఆశించిన స్థాయిలో నూతన పరిశ్రమలు ఏర్పాటుకాకపోవటమే దీనికి కారణమని తెలుస్తోంది.

పెరిగిన వాణిజ్య సముదాయాల వాటా

జిల్లాలో అత్యధిక విద్యుత్తు వినియోగం వాటా గృహాలదే. 2020-21లో 20,671.16లక్షల యూనిట్లలో 12,394.36లక్షల యూనిట్లు (60%) గృహ అవసరాలకే వాడారు. 2024-25నాటికి గృహ వినియోగం 18,049.90లక్షల యూనిట్లకు పెరిగినప్పటికీ మొత్తం విద్యుత్తు వాడకం (31,787.93లక్షల యూనిట్ల)లో గృహాల వాటా 56.80శాతానికే పరిమితమైంది. ఇదే సమయంలో గృహేతర(వాణిజ్య) విద్యుత్తు వినియోగం గణనీయంగా పెరిగింది. 2020-21లో 4,888.08లక్షల యూనిట్లు(మొత్తం వినియోగంలో 23.65%) ఉండగా.. 2024-25 నాటికి 8,787.36లక్షల యూనిట్లకు (మొత్తం వినియోగంలో 27.64%) చేరుకుంది.

## హైసెక్యూరిటీ ప్లేట్ ఉండాల్సిందే

ఎదులాపురం: కొత్తవాహనాలతోపాటు 2019 మార్చి 31 కంటే ముందు కొనుగోలు చేసిన వాటికిసైతం ఇకపై హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నెంబర్ ప్లేట్లను అమర్చుకోవాల్సిందే. ప్రస్తుతం ఆ పాత వాహనాలన్నింటికి సాధారణ నెంబరు ప్లేట్లు మాత్రమే ఉన్నాయి. వాటిని తొలగించి ప్రస్తుతం హెచ్ఎస్ఆర్ ప్లేట్లను బిగించుకోకపోతే బీమా, రిజిస్ట్రేషన్, పొల్యూషన్ ధ్రువపత్రం, తదితర సేవలన్నీ నిలిపివేస్తారు. వాటిని అమ్మాలన్నా, కొనాలన్నా ఇబ్బందులు తప్పవు. నకిలీ నెంబర్ ప్లేట్ల తొలగింపు, రహదారి భద్రత కోసం అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు రవాణా శాఖ ఈ నిర్ణయం తీసుకుంది.

పాత వాహనానికి కొత్తగా హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నెంబరు ప్లేటు బిగించుకోవటానికి వాహన యజమానులు %షిషి.ంఖుఎ.ఱఅ% వెబ్సైట్లో వాహన వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. అనంతరం కొత్త నెంబరు ప్లేటు వచ్చాక దాన్ని వాహనానికి బిగించాక ఫొటో తీసి అదే వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేయాలని నిబంధనలు విధించారు. హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నెంబర్ ప్లేట్లు రవాణా శాఖా కార్యాలయంలో బిగిస్తారా? లేదా డీలర్ల వద్ద బిగించుకోవటానికి ఏర్పాట్లు చేస్తారా? అనే స్పష్టత లేదు. ఈ విషయమై ఆ శాఖ ప్రత్యేకంగా నిబంధనలతో కూడిన సర్క్యులర్‌ను జారీ చేయాల్సి ఉంటుంది.

ఇలాంటి నెంబర్ ప్లేట్లకు ఇక చెల్లు

వాహనాలపై ఇక ఇలాంటి నెంబరు ప్లేట్లు ఉంటే జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. వీటి స్థానంలో హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లను వాహనదారులు అమర్చుకోవాల్సి ఉంటుంది. లేకుంటే వాటిని విక్రయించేటప్పుడు ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

జిల్లాలో 1.50 లక్షల పాత వాహనాలు

2019 మార్చి 31లోపు జిల్లాలో దాదాపు 1.50 లక్షల వరకు అన్ని రకాల పాత వాహనాలున్నాయి. సెప్టెంబరు 30 వరకు హైసెక్యూరిటీ ప్లేట్లను బిగించుకోవాల్సి ఉంటుంది.ఇలాంటి నెంబర్ ప్లేట్లకు ఇక చెల్లు వాహనాలపై ఇక ఇలాంటి నెంబరు ప్లేట్లు ఉంటే జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. వీటి స్థానంలో హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లను వాహనదారులు అమర్చుకోవాల్సి ఉంటుంది. లేకుంటే వాటిని విక్రయించేటప్పుడు ఇబ్బందులు పడాల్సి వస్తుంది.



# ధోనీ ఔట్ కాదా? థర్డ్ అంపైర్ నిర్ణయం వివాదాస్పదం

: ఐపీఎల్ 2025 ( సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌కు వరుసగా ఐదో ఓటమి. ధోనీ నాయకత్వం చేపట్టినా ఆ జట్టు పరిస్థితిలో మాత్రం మార్పు రాలేదు. చెపాక్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ అలవోకగా విజయం సాధించింది. అయితే, ధోనీ ఔట్ నిర్ణయం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. స్పష్టంగా చూడకుండానే ఔట్ ఎలా ఇస్తారంటూ సీఎస్కే అభిమానులు కామెంట్లు చేస్తున్నారు.

ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన ధోనీ 4 బంతులు ఎదుర్కొని ఒక్క పరుగు మాత్రమే చేశాడు. సునీల్ నరైన్ బౌలింగ్‌లో ఎల్బీగా ఔటయ్యాడు. కోల్‌కతా అప్పీలు చేయగానే ఫీల్డ్ అంపైర్ ఔట్ ఇచ్చాడు. వెంటనే ధోనీ రివ్యూకి వెళ్లిపోయాడు. సాధారణంగా ధోనీ సమీక్షకు వెళ్లాడంటే కచ్చితంగా సానుకూల నిర్ణయం వస్తుందనేది ఫ్యాన్స్ అభిప్రాయం. ఈసారి మాత్రం మరోలా రావడం.. అదీనూ తప్పిదం కావడంతో నెట్టింట విమర్శలకు తెరలేసింది. సమీక్షలో బంతి బ్యాట్ అంచును తాకినట్లు కొంచెం 'స్పైక్స్' కనిపించాయి. కానీ, థర్డ్ అంపైర్ మాత్రం 'ఔట్' ఇచ్చేశాడు. ఈ నిర్ణయంపై మాజీ క్రికెటర్ మార్క్ బౌచర్ కూడా ఆశ్చర్యపోయాడు.

''నేను వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నప్పుడే ఈ నిర్ణయం రావడంతో కాస్త ఆశ్చర్యానికి గురయ్యా. అల్ట్రాఎడ్జ్‌లో వచ్చిన స్పైక్స్‌ను థర్డ్ అంపైర్ పరిగణనలోకి తీసుకున్నట్లు లేదు. బ్యాట్‌కు బంతి చాలా దగ్గరగా వెళ్లినట్లుంది. అయితే, థర్డ్ అంపైర్స్‌కు కొన్ని కొలమానాలు ఉంటాయని చెప్పడం జరిగింది. మనకు అక్కడ కాస్త స్పైక్స్ కనిపించాయి. కానీ, థర్డ్ అంపైర్ ఎన్నో ఫ్యాక్టర్స్‌ను పరిశీలించినట్లు ఉంది. స్పైక్స్ ఎలా వచ్చింది? చిన్నదా? పెద్దదా? అనేది కూడా గమనించి ఉండొచ్చు. పాదం కదలిక జరిగినప్పుడూ స్పైక్స్ వస్తుంటాయని నిపుణుల మాట'' అని బౌచర్ వ్యాఖ్యానించాడు.

# దిల్లీలో దుమ్ము దుమారం.. రోహిత్ వీడియో వైరల్

ఆదివారం దిల్లీ క్యాపిటల్స్‌తో ముంబయి ఇండియన్స్ తలపడనుంది. ఇప్పటికే దిల్లీకి చేరుకున్న హార్దిక్ సేన ప్రాక్టీస్‌ను ముమ్మరం చేసింది. అయితే, దిల్లీ వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఇప్పటికే దిల్లీ విమానాశ్రయంలో పలు విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ దుమ్ము ఎఫెక్ట్ ముంబయి ఇండియన్స్ జట్టుపైనా పడింది. ఆ జట్టు ఆటగాళ్లు ప్రాక్టీస్ చేస్తుండగా విపరీతంగా దుమ్ము వచ్చేసింది. అదే సమయంలో రోహిత్ తన సహచరులను వెనక్కి వచ్చేయండంటూ పిలుస్తూ అరిచిన వీడియోలు వైరల్‌గా మారాయి. కోచ్ మహేల జయవర్ధనె, లసిత్ మలింగతోపాటు దీపక్ చాహర్, బౌల్ట్ ఆటగాళ్లు పరుగులు పెట్టారు. రోహిత్ మాట్లాడుతూ.. "నువ్వు ఎందుకు నా వీడియో తీస్తున్నావు? అటువైపు రికార్డ్ చేయి" అని వ్యాఖ్యానించాడు.



ముంబయికి ఒకే ఒక్క విజయం..

ఐపీఎల్ 2025 సీజన్‌లో ముంబయి ఇండియన్స్ ( కేవలం ఒక్క విజయాన్ని మాత్రమే సాధించింది. ఐదింట్లో నాలుగు ఓటములు ఎదురయ్యాయి. ఇప్పుడు దిల్లీతో మ్యాచ్‌లోనూ పరాజయం పాలైతే మాత్రం ప్లేఆఫ్స్ అవకాశాలు మరింత సంక్లిష్టంగా మారతాయి. మరోవైపు దిల్లీ వరుస విజయాలతో జోష్ మీదుంది. నాలుగుకు నాలుగు విజయాలు సాధించి ప్లేఆఫ్స్ దిశగా సాగుతోంది.




# చెన్నై.. ఇంత ఘోరమా

14 మ్యాచ్‌లు.. 4 విజయాలు.. 10 ఓటములు.. 2022 ఐపీఎల్‌లో చెన్నై సూపర్‌కింగ్స్ ( ప్రదర్శన ఇది. ఆ జట్టు చరిత్రలో అంత ఘోరంగా ఎప్పుడూ ఆడింది లేదు. ఈ సీజన్లో అంతే దారుణంగా ఆడుతోంది ఈ మాజీ ఛాంపియన్. అయిదుసార్లు టైటిల్ గెలవడమే కాక ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన జట్టుగా కొనసాగుతున్న సీఎస్కే.. ఈ సీజన్‌ను విజయంతో ఆరంభించగానే టైటిల్ ఫేవరెట్లలో ఒకటిగా పరిగణించారు విశ్లేషకులు. కానీ ఆ తర్వాత ఆ జట్టు గెలుపు రుచే చూడలేదు. ఈసారైనా గెలుస్తుందని అభిమానులు ఎదురు చూస్తున్నారు కానీ.. నిరీక్షణ కొనసాగుతూనే ఉంది. గాయపడ్డ రుతురాజ్ గైక్వాడ్ ( స్థానంలో ధోని పగ్గాలందుకోవడంతో జట్టు మారుతుందని ఆశిస్తే.. ప్రదర్శన ఇంకా తీసికట్టుగా తయారైంది. సీఎస్కేకు కంచుకోట లాంటి చెపాక్‌లో వరుసగా మూడు ఓటములంటే అసామాన్యమైన విషయం. ఐపీఎల్ చరిత్రలోనే బంతుల పరంగా అతి పెద్ద ఓటమిని ఎదుర్కొందా జట్టు. జట్టంతా కలిసి వంద పరుగులు చేయడానికి కూడా ఆపసోపాలు పడడం అంటే ఆ జట్టెంత దయనీయ స్థితిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక చెన్నై పుంజుకుని ప్లేఆఫ్స్ చేరుతుందనే ఆశలు లేనట్లే. మిగతా మ్యాచ్‌ల్లో మెరుగ్గా ఆడి టోర్నీని గౌరవప్రదంగా ముగిస్తే చాలని అభిమానులు కోరుకుంటున్నారు. మరి కెప్టెన్ మహి ) మళ్లీ ఒకప్పటిలా మ్యాజిక్ చేయగలడా? అతడికి జట్టు సహకరిస్తుందా?

# లఖ్‌నవూతో మ్యాచ్.. గుజరాత్ ఆల్‌రౌండర్ టోర్నీకి దూరం




ఐపీఎల్ 2025 (%ఖ్రూా% 2025) టోర్నీ మొదటి సగం ముగింపు దశకు చేరుకుంటుంది. ఇప్పటికే పలు జట్లు ఐదేసి మ్యాచ్‌లు ఆడేశాయి. ఇప్పుడు గుజరాత్ టైటాన్స్ ఆరో మ్యాచ్ కోసం సన్నద్ధమవుతోంది. ఈక్రమంలో మరో కీలక ప్లేయర్‌ను గుజరాత్ కోల్పోయింది. మైదానంలో చురుగ్గా ఉండే గ్లెన్ ఫిలిప్స్ సన్‌రైజర్స్‌తో మ్యాచ్ సందర్భంగా ఫీల్డింగ్ చేస్తూ గాయపడ్డాడు. ఆ తర్వాత స్కానింగ్ తీయగా గజ్జల్లో గాయమైనట్లు తేలింది. దీంతో మిగతా మ్యాచుల్లో ఆడటం కష్టమనే ఉద్దేశంతో టోర్నీకే దూరమయ్యాడు. "గ్లెన్ ఫిలిప్స్ త్వరగా కోలుకోవాలని మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది" అని గుజరాత్ టైటాన్స్ పోస్టు చేసింది. గత సీజన్‌లో న్యూజిలాండ్ ప్లేయర్ కేన్ విలియమ్సన్ ఆటకు దూరమైన సంగతి తెలిసిందే. ఫీల్డింగ్ చేస్తూనే తీవ్రంగా గాయపడటంతో చాలాకాలం పాటు మైదానంలోకి దిగలేదు.

ఇప్పటికే రబాడ దూరం..

ఐదు మ్యాచుల్లో నాలుగు విజయాలు సాధించిన గుజరాత్ ప్రస్తుతం పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. అన్ని విభాగాల్లో రాణిస్తూ ప్రత్యర్థిపై ఆధిపత్యం ప్రదర్శించింది. ఇవాళ లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో తలపడేందుకు సిద్ధమైంది. ఈ సమయంలో కీలక పేసర్ కగిసో రబాడ కూడా జట్టుకు దూరమయ్యాడు. ఇప్పటికే సిరాజ్, అర్షద్ ఖాన్, ప్రసిద్ధ్ కృష్ణతో కూడిన పేస్ దళం నాణ్యమైన ప్రదర్శన చేస్తోంది.

లఖ్‌నవూ గెలిస్తే అగ్రస్థానంలోకి..

గుజరాత్ టైటాన్స్‌పై లఖ్‌నవూ గెలిస్తే పాయింట్ల పట్టికలో తొలి స్థానానికి దూసుకొచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ఐదు మ్యాచుల్లో మూడు విజయాలు సాధించింది. ఆరు పాయింట్లతో ఆరో స్థానంలో ఉంది. ఇప్పుడు విజయం సాధిస్తే లఖ్‌నవూ ఖాతాలోకి 8 పాయింట్లు అవుతాయి. మెరుగైన రన్‌రేట్‌ను సాధిస్తే లఖ్‌నవూనే అగ్రస్థానంలోకి దూసుకెళ్తుంది.

# సెంచరీ కొట్టినా.. ధోనీతో మాట్లాడలేకపోయా: ప్రియాంశ్ ఆర్య

ఐపీఎల్ )లో ఆడిన నాలుగో మ్యాచ్‌లోనే సెంచరీ బాదేసి అందరి దృష్టిని ఆకర్షించాడు యువ బ్యాటర్ ప్రియాంశ్ ఆర్య (. ఇటీవల చెన్నైతో జరిగిన మ్యాచ్‌లో ఈ పంజాబ్ ఆటగాడు శతకంతో పరుగుల మోత మోగించిన సంగతి తెలిసిందే. అయితే, ఆ మ్యాచ్ తర్వాత ధోనీ తో మాట్లాడాలని అనుకున్నప్పటికీ.. తనకు ఆ అవకాశం దొరకలేదని చెప్పాడు. అదొక్కటే తనను బాధిస్తోందని అన్నాడు.

"ధోనీ లాంటి గొప్ప ఆటగాళ్లపై ఆడే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. ఇలాంటి అవకాశం చాలా కొద్ది మందికి మాత్రమే వస్తుంది. వికెట్ల వెనుక ధోనీ సర్ ఉన్నప్పుడు ఒత్తిడి సహజమే. ఇక, అశ్విన్ లాంటి లెజండరీ బౌలర్లను ఎదుర్కొన్నప్పుడు టెన్షన్ ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో సెంచరీ సాధించడం చాలా ఆనందంగా ఉ



ంది. మ్యాచ్ తర్వాత ధోనీ సర్‌ని కలిసి మాట్లాడాలనుకున్నా. కానీ, నేను ఇంటర్వ్యూ ముగించుకునేసరికి ఆయన వెళ్లిపోయారు. ఆయనతో మాట్లాడలేకపోయా'' అని ప్రియాంశ్ ఆర్య చెప్పాడు.

ఈ సందర్భంగా పంజాబ్ కోచ్ రికీ పాంటింగ్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ గురించి మాట్లాడుతూ.. "చెన్నైతో మ్యాచ్ కంటే ముందు రాజస్థాన్‌తో ఆడుతున్నప్పుడు తొలి బంతికే ఔట్ అయ్యా. దానికి చాలా బాధపడ్డా. కానీ పాంటింగ్ సర్, అయ్యర్ దాని గురించి ఒక్కసారి కూడా విమర్శించలేదు. బ్యాటింగ్ ఎలా మెరుగుపర్చుకోవాలో చెప్పి నాలో స్ఫూర్తి నింపారు" అని తెలిపాడు.

ఏప్రిల్ 8న జరిగిన మ్యాచ్‌లో ఈ పంజాబ్ యువ ఓపెనర్.. చెన్నై బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఎనిమిది ఓవర్లలోనే ఐదు వికెట్లు పడిపోయినా.. ఏ మాత్రం



# భారత్‌లో ఎందుకంత బిజీగా ఉంటారు..?

# నిఖిల్ కామత్ ప్రశ్నకు బిల్‌గేట్స్ సమాధానం

ప్రముఖ జిరోదా సంస్థ సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ నిర్వహిస్తున్న పాడ్‌కాస్ట్‌లో ప్రపంచ కుబేరుల్లో ఒకరు, మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ (గతేడాది పాల్గొన్న సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన రెండో భాగాన్ని శుక్రవారం విడుదల చేశారు. ఈ పాడ్‌కాస్ట్‌లో పలు ఆసక్తిర విషయాల గురించి వీరిరువురూ చర్చించుకున్నారు. భారత్ )లో ఉన్నన్ని రోజులు ఎందుకు బిజిబిజీగా కనిపిస్తారని నిఖిల్ ప్రశ్నించారు. దీనికి గేట్స్ చాలా ఫన్నీగా బదులిచ్చారు.

'ఎందుకంటే అలా ఉండటం నాకు చాలా సరదాగా ఉంటుంది. కఠినంగా ఉంటూ పనిచేయాలి అనుకుంటూ మిమ్మల్ని మీరు మోసం చేసుకోకూడదు' అని ఆయన పేర్కొన్నారు. గేట్స్ ఇప్పటికే అనేకసార్లు భారత్‌లో పర్యటించారు. ఈ ఏడాది మార్చిలోనూ ఆయన ఇక్కడికి వచ్చారు. ఆ సమయంలో ప్రధాని మోదీతో సహా పలువురు కేంద్ర మంత్రులను కలిశారు.

ఇక, పెట్టుబడుల కోణంలో అధిక జనాభా మంచిదా, కాదా అని నిఖిల్ ప్రశ్నించారు. దీనికి గేట్స్ బదులిస్తూ.. దాదాపు రెండేళ్లలో ఏఐ అన్నింటినీ మార్చేస్తుందన్నారు. ప్రజలు తొందరగా పదవీ విరమణ చేసేయొచ్చని, పని వారాలు కూడా తగ్గిపోతాయన్నారు. ప్రజలు తమ సమాయాన్ని ఎలా గడపాలి అనే దానిపై ఆలోచనలు చేయాల్సిఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా తనకు పని లేకపోయినా తాను దాన్ని కల్పించుకుంటున్నానని ఆయన తెలిపారు. ప్రస్తుతం ప్రజలు కూడా ఏఐతో వచ్చే మార్పుల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. ఈ పాడ్‌కాస్ట్‌లో గేట్స్ దాతృత్వం గురించి కూడా చర్చించుకున్నారు.

# యూపీఐ సేవల్లో మరోసారి అంతరాయం.. స్పందించిన NPCI

డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ యూపీఐలో ( మరోసారి అంతరాయం ఏర్పడింది. దేశవ్యాప్తంగా ఈ సేవలకు ఆటంకం ఏర్పడింది. ఎవరికైనా చెల్లింపులు చేస్తుంటే జరగడం లేదంటూ సామాజిక మాధ్యమాల్లో వందలాది మంది పోస్టులు పెడుతున్నారు. గూగుల్ పే, ఫోన్‌పే, పేటీఎం వంటి యాప్స్ పనిచేయడం లేదు. డౌన్ డిటెక్టర్ వెబ్‌సైట్ ప్రకారం.. మధ్యాహ్నం 12 గంటల సమయానికి దాదాపు వెయ్యి మందికి పైగా యూపీఐ సేవల్లో అంతరాయం గురించి ఫిర్యాదు చేశారు.

దీనిపై ఎన్‌పీసీఐ స్పందించింది. సాంకేతిక సమస్య వల్ల చెల్లింపుల్లో అవాంతరం ఎదురవుతోందని పేర్కొంది. దీన్ని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపింది. కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. ఇవాళ ఒక్కరోజే కాదు.. యూపీఐ సేవల్లో ఇటీవల తరచూ ఈ అవాంతరం ఎదురవుతోంది. మార్చి 26న ఇదే పరిస్థితి నెలకొనగా.. సాంకేతిక



కారణంతో ఈ పరిస్థితి తలెత్తిందని ఎన్‌పీసీఐ అప్పట్లో వివరణ ఇచ్చింది. ఏప్రిల్ 2న కూడా యూపీఐ చెల్లింపులు కొంతసేపు నిలిచిపోయాయి. రోజుల వ్యవధిలో తాజాగా మరోసారి ఈ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ సేవల్లో ఆటంకం ఏర్పడింది.






# మనిషి ఆలోచనలు.. సంభాషణ కూడా

హైదరాబాద్

కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత అంటే.. మనం ప్రశ్నలు టైప్ చేస్తే, దానికి సమాధానాలు అక్షర రూపంలో వస్తోందే ఇప్పటివరకు చూస్తున్నాం. దీనికి భిన్నంగా ఒక వ్యక్తిలా ఆలోచించి, సంభాషించేలా సరికొత్త ఏఐని రూపొందించినట్లు హైదరాబాద్‌కు చెందిన ఎలక్ట్రానిక్ బ్రాండ్ సంస్థ మివి తెలిపింది. 'మివి ఏఐ' పేరుతో దీన్ని అభివృద్ధి చేసినట్లు సంస్థ సహ వ్యవస్థాపకులు, సీఎంఓ మిధులా దేవభక్తుని శుక్రవారం ఇక్కడ వెల్లడించారు. ఏఐ పరిశోధన, అభివృద్ధిలో ఇదొక కీలక అడుగని ఆమె వివరించారు. అధునాతన ఎల్‌ఎల్‌ఎం (లాంగ్ లాంగ్వేజ్ మోడల్)తో దీన్ని ఆవిష్కరించినట్లు పేర్కొన్నారు. 'మివి ఏఐలో ఉపయోగించిన ఎన్ఎల్‌పీ (నాచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్) మనిషి భావోద్వేగాలను అర్థం చేసుకుంటుంది. సందర్భాన్ని బట్టి మన సంభాషణలను అనుకరిస్తుంది. వినియోగదారుల మాటలను అర్థం చేసుకుని, దానికి తగ్గట్లు సమాధానాలు ఇస్తుంది. ఎన్నో రకాల మాండలికాలతో దీన్ని తయారు చేశాం. ప్రత్యేకంగా 'హాయ్ మివి' అనే వేక్ వర్డ్‌ను రూపొందించాం. ప్రపంచంలో కొన్ని ప్రముఖ సంస్థలే వేక్ వర్డ్‌ను తీసుకొచ్చాయి' అని వివరించారు.

ఈ పరికరాల్లో అందిస్తున్నాం

మివి ఏఐ సాంకేతికతను తమ ఇయర్‌బడ్స్, హోమ్ మానిటరింగ్ కెమేరాలు, స్మార్ట్ వేరబుల్స్, ఐఓటీ పరికరాల్లో అందిస్తున్నట్లు తెలిపారు. సంస్థలో 1,500 మందికి పైగా ఉద్యోగులున్నారని వెల్లడించారు. మివి ఏఐ కోసం 100 మంది ఇంజినీర్లు పనిచేశారని తెలిపారు. దీనికోసం రూ.86 కోట్ల పెట్టుబడులు పెట్టినట్లు వివరించారు. మివి ఏఐ ద్వారా వినియోగదారులకు వ్యక్తిగతీకరించిన కృత్రిమ మేధ అనుభవాన్ని అందించే లక్ష్యంతో ఉన్నట్లు తెలిపారు. భవిష్యత్తులో స్మార్ట్ హోమ్ పరికరాలు, వినియోగదారుల సేవా కేంద్రాలు, ఇతర ఏఐ ఆధారిత ఉత్పత్తులలో దీన్ని వినియోగించే అవకాశం ఉందని పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో సంస్థ రూ.250 కోట్ల ఆదాయాన్ని ఆర్జించిందని, 2025-26లో రూ.300 కోట్ల లక్ష్యాన్ని విధించుకున్నట్లు మివి సహ వ్యవస్థాపకుడు, సీఈఓ విశ్వనాథ్ కందుల తెలిపారు.



# హైడ్రో-పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు CEA ప్రణాళిక

%విద్యుత్ మంత్రిత్వ శాఖ పరిధిలోని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ( 2024-25లో దాదాపు 7.50 %+ఔ% సామర్థ్యం గల 6 హైడ్రో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల నివేదికలను() ఆమోదించింది. ఈ ఆరు ప్రాజెక్టులు..ఒడిశా, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయి. ఈ విభాగంలో ప్రైవేట్ రంగ భాగస్వామ్యం చాలా ప్రోత్సాహకరంగా ఉంది.

2025-26 సంవత్సరంలో 22 గిగావాట్ల సామర్థ్యంగల 13 హైడ్రో-పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల()ను ఏర్పాటు చేయడానికి సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ( ప్రణాళికను కలిగి ఉందని మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ లలో ఎక్కువ భాగం 4 సంవత్సరాలలో, తాజాగా 2030 నాటికి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

# 90 రోజుల్లో.. మధ్యంతర ఒప్పందం?

దిల్లీ: అధిక టారిఫ్ నుంచి మన దేశానికి 90 రోజుల గడువును అమెరికా ఇచ్చిన నేపథ్యంలో, ఈలోగానే ఇరు దేశాల మధ్య మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదిరేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఒప్పందం చర్చలను మొదలుపెట్టడానికి అవసరమైన షరతులకు ఇప్పటికే తుదిరూపు ఇచ్చినట్లు వెల్లడించారు. ఇరు దేశాలూ మేలని భావించే పక్షంలో, మధ్యంతర ఒప్పందం కుదిరేందుకు ఎక్కువ అవకాశం ఉంటుందని అన్నారు. వాణిజ్య ఒప్పందంపై తొలి దశ చర్చలను సెప్టెంబరు-అక్టోబరు కల్లా పూర్తి చేయాలని ఇరు దేశాలు లక్ష్యంగా పెట్టుకున్న సంగతి తెలిసిందే. 191 బిలియన్ డాలర్లుగా ఉన్న ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 కల్లా 500 బిలియన్ డాలర్లకు చేర్చాలనీ లక్ష్యంగా పెట్టుకున్నారు. 'పని మొదలైంది. వాణిజ్య ఒప్పందంపై చర్చల విషయంలో ఇతర దేశాలతో పోలిస్తే భారత్ చాలా ముందుంద'ని ఆ అధికారి తెలిపారు. భారత్ వస్తువులపై 26% సుంకాన్ని ఈనెల 2న అమెరికా ప్రకటించింది. జులై 9 వరకు దీనికి విరామాన్ని ఇస్తున్నట్లు ఈనెల 9న స్పష్టం చేసింది. అయితే ప్రపంచ దేశాలతో పాటు 10% సుంకం మాత్రం మన ఉత్పత్తులపై విధిస్తోంది. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ త్వరలోనే మనదేశంలో పర్యటించనున్నారు.

చైనా నుంచి ఎఫ్‌డీఐలను ప్రోత్సహించం: చైనా నుంచి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)ను ప్రోత్సహించాలని మనదేశం భావించడం లేదని మంత్రి పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. 2020లో చైనాపై విధించిన పెట్టుబడుల ఆంక్షలను సడలించే అవకాశం లేదని సంకేతాలిచ్చారు. అప్పుడు జారీ చేసిన విధానం ప్రకారం.. భారత్‌తో సరిహద్దును పంచుకుంటున్న దేశాల నుంచి, ఏ రంగంలోకి ఎఫ్‌డీఐ రావాలన్నా, కేంద్రప్రభుత్వ అనుమతులు పొందాల్సిందే.

జాతి ప్రయోజనాలను పణంగా పెట్టం: గోయల్

అమెరికాతో ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్యం (బీటీఏ)పై చర్చలు కొనసాగుతాయని, అదే సమయంలో దేశ, ప్రజల ప్రయోజనాలను ప్రభుత్వం కాపాడుతూనే ఉంటుందని, తొందరబాటు నిర్ణయాలేవీ ఉండవని వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. 'ఇండియా ఫస్ట్' స్ఫూర్తితోనే అన్ని చర్చలు ముందుకెళతాయని.. 2047 కల్లా 'వికసిత్ భారత్' దిశగా అడుగులు పడేలా చూస్తామని అన్నారు. 'బెదిరింపుల వల్ల హడావుడిగా చర్చలు జరగవని చాలా సార్లు చెప్పాను. గడువు పెట్టుకోవడం మంచిదే. చర్చల వేగవంతాన్ని అది ప్రోత్సహిస్తుంది. అయితే జాతి ప్రయోజనాలను మాత్రం పణంగా పెట్టం. ఎట్టి పరిస్థితుల్లోనూ అది మంచిది కాద'ని ఆయన అన్నారు.

# అంతర్జాతీయ చెల్లింపులకు క్యూఆర్ పంపిస్తే కుదరదు

హైదరాబాద్: డిజిటల్ చెల్లింపుల విషయంలో మరో కొత్త నిబంధన అమల్లోకి వచ్చింది. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా అంతర్జాతీయ చెల్లింపుల కోసం 'క్యూఆర్ షేర్ అండ్ పే' పద్ధతిని



రద్దు చేస్తున్నట్లు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) తెలిపింది. దీంతో విదేశాల్లో ఉన్న భారతీయ ప్రయాణికులు, ప్రవాసులు.. ఇక్కడి వ్యాపారులు పంపిన క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేసి, చెల్లింపులు చేయలేరు. చెల్లింపుల విషయంలో వినియోగదారులకు మరింత భద్రత కల్పించేందుకు ఈ నిర్ణయం తోడ్పడనుంది. అయితే వినియోగదారులకు ఉన్న సౌలభ్యం కొంత తగ్గుతుంది.

ఇప్పటివరకు ఇలా: వ్యాపారులు వాట్సప్ లేదా ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా క్యూఆర్ కోడ్‌ను పంపించేవారు. విదేశాల్లో ఉన్న వారు యూపీఐ అనుసంధాన యాప్‌లతో దాన్ని స్కాన్ చేసి, చెల్లింపులు చేసేవారు. కొత్త నిబంధనల నేపథ్యంలో దేశీయ లావాదేవీలకు మాత్రమే క్యూఆర్ పరిమితం అవుతుంది. దేశీయ లావాదేవీలపైనా పరిమితులు: దేశీయ చెల్లింపుల కోసమూ కొన్ని పరిమితులు విధించింది. ఎన్‌పీసీఐ దగ్గర నమోదు కాని వ్యాపారులకు ఈ పద్ధతిలో ఒకేసారి రూ.2,000కు మించి చెల్లించడం సాధ్యం కాదు.



# 'టచ్ మీ నాట్' టీమ్ సర్‌ప్రైజ్.. ఫస్ట్ ఎపిసోడ్ ఉచితమే..

దీక్షిత్‌శెట్టి, నవదీప్ ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్‌సిరీస్ 'టచ్ మీ నాట్' ( ఇటీవల 'జియో హాట్‌స్టార్' వేదికగా ప్రేక్షకుల ముందుకువచ్చి మంచి ఆదరణను సొంతం చేసుకుంది. ఇప్పుడీ ఓటీటీ సంస్థ ప్రేక్షకులకు సర్‌ప్రైజ్ ఇచ్చింది. ఈ సిరీస్‌కు సంబంధించిన తొలి ఎపిసోడ్‌ను ఉచితంగా చూసే వెసులుబాటును కల్పించింది 'జియో హాట్‌స్టార్'. యూట్యూబ్‌లో దీని తొలి ఎపిసోడ్‌ను అందుబాటులోకి తెచ్చింది. మిగతా 5 ఎపిసోడ్‌లను మాత్రం యాప్‌లోనే చూడాలని పేర్కొంది.

కథేంటంటే: రిషి (దీక్షిత్) చిన్నప్పుడు భవనంపై నుంచి కిందపడడంతో 'సైకోమెట్రిక్' బారిన పడతాడు. దీనివల్ల అతడిని ఎవరైనా తాకినా, తాను ఏదైనా వస్తువును తాకినా వాటి తాలుకా గతాన్ని చెప్పగలడు. మరి, ఇలాంటి వ్యక్తి నేరం జరిగిన ప్రదేశంలోని వస్తువులతో క్రైమ్ చేసిందెవరన్న దానికి క్లూ ఇవ్వగలడా? అదే టెస్ట్ చేస్తారు పోలీసులు. 'గోదావరి హాస్పిటల్'కు సంబంధించిన ఫైర్ యాక్సిడెంట్ కేసును ఛేదించేందుకు పోలీస్ టీమ్ రిషి (దీక్షిత్)ని సంప్రదిస్తుంది. ఆ బృందంలోని ఎస్పీ రాఘవ్ (నవదీప్)కు, రిషికి ముందునుంచీ మంచి అనుబంధం ఉంటుంది. ఆస్పత్రిలో జరిగినట్టే కొన్నాళ్ల క్రితం ఓ అపార్ట్‌మెంట్‌లోనూ ప్రమాదం చోటుచేసుకోవడంతో.. కొత్త కేసు కోసం పాత కేసును రీ ఇన్వెస్టిగేషన్ చేయాలని ప్రయత్నిస్తారు. మరి, ఆ ప్రమాదాలకు కారణం ఎవరు? రాఘవ్ టీమ్ ఈ కేసును సాల్వ్ చేసిందా? రిషి ప్రేమించిన అమ్మాయి మేఘ (కోమలీ ప్రసాద్) తండ్రికీ, ఈ ప్రమాదాలకు ఏదైనా సంబంధం ఉందా? తదితర ప్రశ్నలకు సమాధానాలు సిరీస్ చూసి తెలుసుకోవాల్సిందే.

200 మిలియన్ల సబ్‌స్క్రైబర్లు..

ప్రముఖ ఓటీటీ ఫ్లాట్‌ఫామ్ 'జియో హాట్‌స్టార్' సబ్‌స్క్రైబర్ల సంఖ్య 200 మిలియన్లకు చేరినట్లు తెలిపింది. అతితక్కువ కాలంలో ఇంతమంది సబ్‌స్క్రైబర్లు రావడం ఆనందంగా ఉందని సంస్థ వైస్ ఛైర్మన్ తెలిపారు.



# కేన్స్‌లో 'జాన్వీ' చిత్రం

'ధడక్' సినిమాలో ప్రేమికులుగా కనిపించి హిట్ జోడీ అనిపించుకున్నారు బాలీవుడ్ అందాల తార జాన్వీ కపూర్ ఇషాన్ ఖట్టర్. ఈ విజయవంతమైన కలయికలో రాబోతున్న చిత్రం 'హోమ్ బౌండ్' . నీరజ్ ఘైవాన్ దీన్ని తెరకెక్కించారు. విశాల్ జెత్వా కీలక పాత్ర పోషించారు. కరణ్ జోహార్ నిర్మించారు. తాజాగా ఈ చిత్రం ప్రతిష్ఠాత్మకమైన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఎంపికైనట్లు తెలిపింది చిత్రబృందం. మే 13నుంచి 24వరకు జరగనున్న ఈ వేడుకలో 'అన్ సర్టెన్ రిగార్డ్' విభాగంలో ఈ చిత్రం ప్రదర్శితం కానుంది. ఈ విభాగంలో వివిధ దేశాలకు చెందిన 15 చిత్రాలు ప్రదర్శితం కానున్నాయి. ఈ సందర్భంగా ఈ విషయంపై ఆనందం వ్యక్తం చేస్తూ నిర్మాత కరణ్ జోహార్ ఓ పోస్ట్ పెట్టారు.

"భారతీయ సినిమా శక్తికి నిదర్శనం 'హోమ్‌బౌండ్' చిత్రం. మన దేశ కథల గొప్పతనం ప్రపంచానికి తెలుస్తోంది. ఈ సినిమాతో మరోసారి కేన్స్ చిత్రోత్సవాల్లో అడుగుపెట్టబోతున్న దర్శకుడు నీరజ్‌కు అభినందనలు'' అని పేర్కొన్నారు. "భారతీయ సినిమా ప్రపంచాన్ని ఆకర్షించే క్షణాలివి. 78వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో మన భారతీయ సినిమా సందడి చేయడానికి సిద్ధమైనందుకు సంతోషంగా ఉంది. ఇది మా బృందానికి దక్కిన గౌరవంగా భావిస్తున్నా. 'హోమ్‌బౌండ్'ను మీ అందరి ముందు తీసుకురావడానికి ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా" అని ఇన్‌స్టా వేదికగా ఓ పోస్ట్ పెట్టింది జాన్వీ కపూర్. హైదరాబాద్‌కు చెందిన దర్శకుడు నీరజ్.. ఇప్పటికే 'మసాన్' అనే సినిమాతో కేన్స్‌లో సందడి చేశారు. ఈ ఏడాది కేన్స్‌కు ఎంపికైన ఏకైక భారతీయ చిత్రం ఆయన తెరకెక్కించిందే కావడం విశేషం.

# 'సారంగపాణి జాతకం' మరోవారం వెనక్కి.. కొత్త విడుదల తేదీ ఇదే..

: ప్రియదర్శి కథానాయకుడిగా దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి తెరకెక్కిస్తున్న చిత్రం 'సారంగపాణి జాతకం' . రూప కొడువాయూర్ హీరోయిన్. తాజాగా ఈ సినిమా మరోసారి వాయిదా పడింది. ఏప్రిల్ 18న విడుదల కావాల్సిన ఈ సినిమా ఏప్రిల్ 25న రానున్నట్లు తెలుపుతూ టీమ్ పోస్టర్ విడుదల చేసింది. 'అన్ని వయసుల వారిని అలరించే అచ్చమైన తెలుగు సినిమా' అని తెలుపుతూ పోస్టర్ విడుదల చేసింది. గతేడాది డిసెంబర్ 24న విడుదల కావాల్సిన ఈ చిత్రాన్ని ఈ ఏడాది ఏప్రిల్ 18కు వాయిదా వేశారు. తాజాగా మరో వారం వెనక్కి వెళ్తున్నట్లు తెలిపారు.




మనిషి భవిష్యత్తు అతడి చేతి రేఖల్లో ఉంటుందా? లేక అతడి చేతల్లో ఉంటుందా? అనే ప్రశ్నకు సమాధానంగా రూపొందుతున్న చిత్రమిది. తన నమ్మకాలు, తను ఇష్టపడిన అమ్మాయి ప్రేమ మధ్య కొట్టుమిట్టాడిన ఓ యువకుడి కథతో తెరకెక్కుతోంది.

# నా స్థానంలో ఆమెను తీసుకోవడం నాకేం నచ్చలేదు: హీరోయిన్ అసహనం



నటుడు ఆయుష్మాన్ ఖురానా( ), నటి నుశ్రత్ బరుచా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'డ్రీమ్ గర్ల్' ఈ సినిమాతోనే నుశ్రత్ కథానాయికగా గుర్తింపు తెచ్చుకున్నారు. దీనికి సీక్వెల్‌గా రూపొందిన 'డ్రీమ్ గర్ల్ 2' ( 2)లో హీరోయిన్‌గా తనకి బదులు నటి అనన్య పాండేను ఎంచుకోవడంపై తాజాగా నుశ్రత్ స్పందించారు. తన స్థానంలో మరో నటిని ఎంపికి చేయడంపై ఆమె అసహనం వ్యక్తంచేశారు. టీమ్ నిర్ణయాన్ని తప్పుపడుతూ తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు.

''టీమ్ నిర్ణయం నన్నెంతో బాధించింది. తొలి భాగంలో నటించిన నటీనటులందరూ సీక్వెల్‌లోనూ యాక్ట్ చేశారు. కేవలం హీరోయిన్ పాత్రలోనే నాకు బదులు వేరే నటిని తీసుకున్నారు. ఈ విషయాన్ని ఏమాత్రం జీర్ణించుకోలేకపోయా. అలా అని టీమ్‌తో నేనేమీ యుద్ధం చేయలేదు. ఎందుకంటే, ఆ రోల్ నేనే చేస్తానని పోరాటం చేసినంత మాత్రాన పరిస్థితులు ఏమీ మారవు కదా. ఒకవేళ నన్ను ఎందుకు తీసుకోవడం లేదని అడిగితే.. తమకు నేను అవసరం లేదని వాళ్లు సమాధానం చెబుతారు. వాళ్లు ఏం చెబుతారో కూడా నాకు తెలిసినప్పుడు ప్రశ్నించి ఏం లాభం. అందుకే ఈ విషయంపై నేను ఎవరితోనూ మాట్లాడలేదు. ఏది ఏమైనా తమ సినిమాలో ఎవరిని పెట్టుకోవాలి? ఎవరిని తీసుకోకూడదు? అనేది పూర్తిగా మేకర్స్‌పై ఆధారపడి ఉంటుంది. వాళ్ల ఇష్టాన్ని మనం ప్రశ్నించడానికి లేదు కదా" అని నుశ్రత్ బదులిచ్చారు.

ఆయుష్మాన్ ఖురానా, అనన్య పాండే నటించిన 'డ్రీమ్ గర్ల్ 2' 2023లో విడుదలైంది. బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రం మంచి వసూళ్లు రాబట్టింది. సీక్వెల్‌లో అనన్యని ఎంపిక చేసుకోవడంపై గతంలో ఆయుష్మాన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. "స్క్రిప్ట్‌కు అనుగుణంగానే ఆమెను ఈ కథలోకి తీసుకున్నాం. పార్ట్ 1తో పోలిస్తే సీక్వెల్‌లో హీరోయిన్ రోల్ చాలా సరదాగా ఉంటుంది. ఆ పాత్రకు ఆమె అయితేనే న్యాయం చేయగలదని మేకర్స్ భావించారు" అని తెలిపారు.




# జపాన్ వెళ్లిన రాజమౌళి కుటుంబం..


: 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమాతో భారతీయ సినీ పరిశ్రమకు ప్రపంచస్థాయిలో గుర్తింపుతెచ్చారు రాజమౌళి. ఈ చిత్రం జపాన్‌లోనూ భారీ విజయాన్ని సొంతం చేసుకొని రికార్డులు సృష్టించింది. ఈ సినిమా తెర వెనుక సంగతులతో 'ఆర్‌ఆర్‌ఆర్: బిహైండ్ అండ్ బియాండ్' డాక్యుమెంటరీ రూపొందించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ డాక్యుమెంటరీ జపాన్‌లో విడుదల కానుంది. దీని ప్రచారంలో భాగంగా రాజమౌళి, రమా రాజమౌళి, కార్తికేయ జపాన్ వెళ్లారు.

అక్కడి ప్రేక్షకులతో ఈ సినిమా, డాక్యుమెంటరీ విశేషాలు పంచుకున్నారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇక 'ఆర్‌ఆర్‌ఆర్' జపాన్‌లో విడుదలైనప్పుడు మంచి ఆదరణ సొంతం చేసుకుంది. 34 రోజుల్లోనే అత్యధిక కలెక్షన్లు రాబట్టి 300 మిలియన్ జపాన్ యెన్‌ల క్లబ్‌లో చేరింది. ఈ క్లబ్‌లో అత్యంత వేగంగా చేరిన తొలి భారతీయ సినిమాగా చరిత్ర సృష్టించింది. ఇప్పుడు దీని డాక్యుమెంటరీని కూడా జపాన్ ప్రేక్షకులు అలానే ఆదరిస్తారని రాజమౌళి అన్నారు.

ఈ 'ఆర్‌ఆర్‌ఆర్: బిహైండ్ అండ్ బియాండ్' విషయానికొస్తే.. సుమారు 3 ఏళ్ల ఈ సినిమా ప్రయాణానికి సంబంధించి 20టీబీ ఫుటేజ్ రాగా దాన్ని ఎడిట్ చేసి.. బెస్ట్ మూమెంట్స్‌ను తీసుకుని 1:38 గంటల నిడివితో ఈ డాక్యుమెంటరీని రూపొందించారు. యాక్షన్ సీక్వెన్స్ షూటింగ్ విజువల్స్, చిత్రబృందం అభిప్రాయం తదితర సంగతులు ఇందులో చూపించారు. ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్ లో అందుబాటులో ఉంది.

# అనుకున్న సమయానికే 'వీరమల్లు'

పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'హరిహర వీరమల్లు'. నిధి అగర్వాల్, బాబీ దేవోల్, అనుపమ్ ఖేర్ కీలక పాత్రలు పోషించారు. క్రిష్ జాగర్లమూడి, జ్యోతికృష్ణ దర్శకులు. మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ.దయాకర్‌రావు నిర్మిస్తున్నారు. ఎ.ఎం.రత్నం సమర్పకులు. ఈ చిత్రం ( మే 9న రానుంది. రీరికార్డింగ్, డబ్బింగ్, విజువల్ ఎఫెక్ట్స్‌కి సంబంధించిన పనులు శరవేగంగా సాగుతున్నట్టు సినీ వర్గాలు తెలిపాయి. ''మొఘల్ సామ్రాజ్యం నేపథ్యంలో సాగే విప్లవం లాంటి కథ ఇది. చారిత్రక యోధుడు వీరమల్లుగా పవన్‌కల్యాణ్ నటిస్తున్నారు. కరోనాతోపాటు, పవన్‌కల్యాణ్ రాజకీయ ప్రయాణం కారణంగా చిత్రీకరణ ఆలస్యమైనప్పటికీ ఎ.ఎం.జ్యోతికృష్ణ దర్శకత్వ బాధ్యతల్ని చేపట్టి రాజీపడకుండా చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు. అనుకున్న సమయానికే ఈ సినిమాని తెలుగుతోపాటు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నామ"ని సినీ వర్గాలు స్పష్టం చేశాయి



# నోటి క్యాన్సర్ జాగ్రత్త సుమా

నోరు మంచిదైతే ఆరోగ్యమూ మంచిదవుతుంది. శరీర పోషణకు అవసరమైన ఆహారం, పానీయాలు లోపలికి చేరేది దీన్నుంచే. తిన్న ఆహారం లాలాజలంతో కలిసి.. జీర్ణక్రియ ఆరంభమయ్యేదీ ఇక్కడే. ఇంత కీలకమైంది కాబట్టే నోటికి ఏ సమస్య వచ్చినా ఇబ్బందే. చిన్న నంజు పొక్కు పుడితేనే విలవిల్లాడిపోతాం. అలాంటిది క్యాన్సర్ పుండు పడితే? శరీరం మొత్తం అతలాకుతలమవుతుంది. మంచి విషయం ఏంటంటే- దీన్ని చాలావరకూ నివారించుకునే వీలుండటం. తొలిదశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం కావటం. అయినా మనదగ్గర రోజురోజుకీ నోటి క్యాన్సర్ బాధితుల సంఖ్య పెరుగుతుండటం ఆందోళనకరం. ప్రపంచవ్యాప్తంగా ఏటా సుమారు 4 లక్షల మంది కొత్తగా దీని బారినపడుతుండగా వీరిలో పావు వంతు మంది మనదేశానికి చెందినవారే! వీరిలోనూ 60-70% మందిలో బాగా ముదిరిన తర్వాతే జబ్బు బయటపడుతుండటం గమనార్హం. నోటి క్యాన్సర్ మీద అవగాహన లేకపోవటం, భయం వంటివన్నీ ఇందుకు దోహదం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రపంచ నోటి క్యాన్సర్ అవగాహన మాసం సందర్భంగా సమగ్ర కథనం మీకోసం.



నోటి క్యాన్సర్ పెద్ద సమస్య. ఇది పెదవుల దగ్గరి నుంచి నాలుక, నాలుక కింది భాగం, చిగుళ్లు, దంతాలు, లోపలి బుగ్గలు, అంగిలి, నాలుక వెనకాల గొంతు వరకూ ఎక్కడైనా రావొచ్చు. మిగతా దేశాలతో పోలిస్తే భారత ఉపఖండంలో నోటి క్యాన్సర్లు చాలా ఎక్కువ. ప్రపంచవ్యాప్తంగా వీటితో బాధపడుతున్నవారిలో సగం మంది ఇక్కడి వారే కావటం గమనార్హం. దీనికి చాలావరకూ కొన్ని ప్రత్యేకమైన దురలవాట్లే కారణం. మనదేశంలో కనిపించే క్యాన్సర్లలో 25-35% వరకూ నోటి క్యాన్సర్లే. ఇవి ఆడవారిలో కన్నా మగవారిలో ఇంకాస్త ఎక్కువ. సాధారణంగా నోటి క్యాన్సర్ పుండుగానే మొదలవుతుంది. అయితే మనదగ్గర నోట్లో పుండ్లను పెద్దగా పట్టించుకోరు. అదే తగ్గిపోతుందిలే అని నిర్లక్ష్యం చేస్తుంటారు. దీంతో చాలామందిలో ముదిరిన తర్వాతే బయటపడుతోంది. నిజానికి తొలిదశలో గుర్తిస్తే చికిత్స తేలిక. ఫలితమూ బాగుంటుంది. దాదాపు 70-90% మందికి పూర్తిగా నయమవుతుంది. అదే ముదిరిన దశలోనైతే సంక్లిష్ట చికిత్స అవసరమవుతుంది. ఫలితమూ అంతంతే. ఈ దశలో కేవలం 30-35% మందిలోనే నయమవుతుంది. అంటే బోలెడంత ఖర్చు పెట్టి చికిత్సలు చేసినా చాలామందిని కాపాడుకోలేకపోతున్నామనే అర్థం. కాబట్టి నోటి క్యాన్సర్‌ను ముందే గుర్తించటం కీలకం. దీని ముప్పు కారకాలు, చికిత్స పద్ధతులు, నివారణ మార్గాల గురించి తెలుసుకొని ఉండటం ఎంతైనా అవసరం.

పునర్నిర్మాణమూ ముఖ్యమే

మాట్లాడటానికి, తినటానికి, ముఖం అందంగా కనిపించటానికి నోరే కీలకం. కాబట్టి క్యాన్సర్ బాధితులకు శస్త్రచికిత్సతో తొలగించిన భాగాలను తిరిగి నిర్మించకపోతే జీవితం హాయిగా సాగదు. సమాజంలోనూ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావొచ్చు. అందువల్ల పుండు మరీ పెద్దగా ఉండి, ఆయా భాగాలను ఎక్కువగా తొలగించినవారికి వాటిని తిరిగి నిర్మించి, అతికించటం చాలా ముఖ్యం. ఉదాహరణకు- నాలుకను సగం, అంతకన్నా ఎక్కువగా తొలగిస్తే శరీరంలోని ఇతర భాగాల నుంచి చర్మం, మాంసం, కొవ్వుతో పాటు కండరాన్ని తీసుకొచ్చి నాలుక రూపంలోకి మార్చి.. అతికిస్తారు. అలాగే దవడ ఎముక, బుగ్గల వంటి భాగాలనూ పునర్‌నిర్మిస్తారు. కొత్త శిక్షణా ఇస్తారు. కొన్ని వ్యాయామాలతో నాలుకను ఎలా కదిలించాలో, ఎలా మింగాలో నేర్పిస్తారు. అప్పటికే ఉన్న నాలుక కొత్తగా అమర్చిన నాలుక కదలికలకు తోడ్పడుతుంది. దీనికి రుచి తెలియక పోవచ్చు గానీ మింగటం, మాట్లాడటం వంటివి సులభ మవుతాయి. ముఖమూ అందంగా కని పిస్తుంది.

చికిత్స- దశలను బట్టి

ఒకటి, రెండు దశల్లో.. నోరు బాగా తెరచుకుంటూ ఉంటే చాలావరకూ శస్త్రచికిత్సతోనే నయం చేయొచ్చు. క్యాన్సర్ బయటకు కనిపించకుండా చుట్టుపక్కల కొంత వరకూ విస్తరించి ఉంటుంది. అందువల్ల పుండు పడ్డ చోటుతో పాటు ఆ భాగాన్ని కూడా అదనంగా కత్తిరిస్తారు. స్కాన్ పరీక్షల్లో కనిపించకపోయినా 20-25% మందిలో క్యాన్సర్ లింఫ్ గ్రంథులకూ విస్తరించే ప్రమాదముంది. కాబట్టి వీటిని కూడా తొలగించి, పరీక్షకు పంపిస్తారు. దీంతో గ్రంథుల్లో క్యాన్సర్ కణాలున్నాయో లేదో తెలుస్తుంది. కొన్నిసార్లు శస్త్రచికిత్స చేసేటప్పుడే కత్తిరించిన భాగాన్ని ఫ్రీజ్ చేసి, పరీక్షించాల్సి ఉంటుంది. దీన్ని తక్షణ బయాప్సీ అనుకోవచ్చు. క్యాన్సర్ కణాలున్నట్టయితే ఇందులో బయట పడుతుంది. క్యాన్సర్ ఉన్నట్టయితే ఇంకొంత ఎక్కువ భాగాన్ని కత్తిరించాల్సి వస్తుంది. కీలకమైన భాగాల్లో క్యాన్సర్ ఉన్నప్పుడు ఇది బాగా ఉపయోగపడుతుంది. ఉదాహరణకు- దవడ ఎముక తీయాలా? వద్దా? అనే సందిగ్ధంలో పడ్డప్పుడు సరైన నిర్ణయం తీసుకోవటానికి తోడ్పడుతుంది. మూడో దశలో శస్త్రచికిత్సతో పాటు రేడియేషన్ అవసరమవుతుంది. నాలుగో దశలో సర్జరీ, రేడియేషన్‌తో పాటు కొందరికి కీమో కూడా చేయాల్సి ఉంటుంది.

నిర్ధరణ ఎలా?

ముందుగా టార్చిలైటు వేసి నోటిని నిశితంగా పరిశీలిస్తారు. గ్లవుజు ధరించిన వేళ్లతో నోటి లోపల తడిమి చూస్తారు. క్యాన్సర్ కావొచ్చని అనుమానిస్తే అక్కడి నుంచి చిన్న ముక్కను కత్తిరించి, పరీక్షిస్తారు (బయాప్సీ). దీని ఫలితాలు రావటానికి రెండు, మూడు రోజులు పడుతుంది. ఇందులో క్యాన్సర్ ఉందో, లేదో నిర్ధరణ అవుతుంది. పుండు తీరును బట్టి దశలను నిర్ణయిస్తారు. పుండు 2 సెం.మీ. కన్నా చిన్నగా ఉంటే తొలి దశగా.. 2 నుంచి 4 సెం.మీ. ఉంటే రెండో దశగా భావిస్తారు. పుండు అక్కడే ఉందా? లోపలికి ఎంతవరకు విస్తరించింది? మెడ వద్ద లింఫ్ గ్రంథులకు పాకిందా? అనే వాటిని బట్టి మూడు, నాలుగు దశలను నిర్ణయిస్తారు. పుండు 4 సెం.మీ. కన్నా పెద్దగా ఉండటం, క్యాన్సర్ మెడలోని ఒక లింఫ్ గ్రంథికి పాకితే మూడో దశగా భావిస్తారు. దవడ ఎముక క్షీణించటం, పై చర్మం వరకూ పుండు విస్తరించటం, నోరు తెరవటానికి తోడ్పడే కండరాలు బిగుసుకుపోవటం వంటి వాటిని బట్టి నాలుగో దశగా నిర్ణయిస్తారు. పుండు తీవ్రమైతే బుగ్గ మీద రంధ్రమూ పడొచ్చు. దురదృష్టవశాత్తూ మనదగ్గర చాలామంది ఇలాంటి దశలోనే వస్తుంటారు. తొలి రెండు దశల క్యాన్సర్లలో అవసరాన్ని బట్టి సీటీ, ఎంఆర్ఐ స్కాన్ వంటి పరీక్షలు చేస్తారు. మూడు, నాలుగు దశలకైతే ఇవి తప్పనిసరి. వీటితో క్యాన్సర్ తీవ్రత, ఎక్కడెక్కిడికి పాకిందనే వివరాలు తెలుస్తాయి.

ముప్పు కారకాలు ఇవీ..

పొగాకు వాడకం: అతి ముఖ్యమైన కారణం ఇదే. మనదగ్గర సిగరెట్లు, చుట్టలు, బీడీల వంటివి కాల్చటమే కాకుండా పొగాకు, పొగాకు కట్టెలు, జర్దా, గుట్కాలనూ నమలుతుంటారు. ఇలాంటి అలవాటు భారత ఉపఖండంలోనే చూస్తుంటాం. పొగాకులో వందలాది క్యాన్సర్ కారకాలుంటాయి. జర్దా, గుట్కాల వంటి వాటిల్లో కలిపే రసాయనాలూ క్యాన్సర్ ముప్పును పెంచుతాయి. గత 20 ఏళ్లలో నోటి క్యాన్సర్లు పెరగటానికి ఇదీ ఒక కారణమే.

వక్కలు నమలటం: ఇదీ ప్రమాదమే. వక్కల్లో ఉండే పలు రసాయనాలు క్యాన్సర్ ముప్పును తెచ్చిపెడతాయి. మరోవైపు వీటిని అదేపనిగా నమలటం వల్ల నోట్లో అతి సూక్ష్మంగా పగుళ్లు ఏర్పడతాయి. ఇవి నయమయ్యే క్రమంలో వాపు ప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్) మొదలవుతుంది. ఇది నిరంతరం ఇలాగే కొనసాగుతూ వస్తుంటే క్యాన్సర్ వచ్చే అవకాశముంది. వక్కలతో మరో ప్రమాదం నోట్లోని జిగురు పొరలు గట్టిపడటం (సబ్ మ్యూకోజల్ ఫైబ్రోసిస్). దీంతో నోరు సరిగా తెరచుకోదు. దీన్ని క్యాన్సర్‌కు ముందస్తు దశగానూ చెప్పుకోవచ్చు.

మద్యం: ఇది మామూలుగానే నోట్లో చికాకును కలిగిస్తుంది. మరోవైపు శరీరంలోకి వెళ్లిన తర్వాత మద్యం ఎసిటాల్‌డిహైడ్‌గానూ మారుతుంది. ఇది బలమైన క్యాన్సర్ కారకం. మద్యానికి పొగ అలవాటూ తోడైతే ప్రమాదం రెట్టింపవుతుంది.

క్యాన్సర్ ముందు జబ్బులు: నోట్లో తెల్లటి, ఎర్రటి మచ్చలుగా కనిపించే లూకోప్లేకియా, ఎరిత్రోప్లేకియా, లైకన్ ప్లానస్.. అలాగే నోటి కణజాలం గట్టిపడటం (ఓరల్ సబ్ మ్యూకోజల్ ఫైబ్రోసిస్) వంటివి కొందరిలో క్యాన్సర్‌గా మారే అవకాశముంది.

పంటి గాయాలు: కృత్రిమ దంతాలు, కట్టుడు పళ్లు స్థిరంగా లేకపోతే తరచూ బుగ్గలకు తాకొచ్చు. పళ్ల మధ్య చర్మం పడి, పుండు ఏర్పడొచ్చు. పళ్లు మరీ వాడిగా ఉన్నవారిలోనూ తరచూ పుండ్లు పడుతుంటాయి. ఇవి మానకుండా పెద్దగా అయ్యి, క్యాన్సర్‌గా మారొచ్చు. ఎలాంటి దురలవాట్లూ లేని వారిలోనూ.. ముఖ్యంగా మహిళల్లో నోటి క్యాన్సర్ రావటానికి ఇదొక ముఖ్య కారణం.

నోటి శుభ్రత లోపించటం: నోరు పరిశుభ్రంగా లేకపోయినా ప్రమాదమే. ఇది దీర్ఘకాలంగా నోట్లో వాపు ప్రక్రియకు (ఇన్‌ఫ్లమేషన్) దారితీయొచ్చు. ఇలా క్యాన్సర్ ముప్పు పెరిగేలా చేయొచ్చు.

హెచ్‌పీవీ: హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కే కాదు.. నోటి క్యాన్సర్‌కూ కారణమే. సుమారు 18-20% నోటి క్యాన్సర్లు దీని మూలంగానే వస్తున్నాయి. ఇటీవల ఎలాంటి దురలవాట్లు లేని 18-25 ఏళ్ల యువతుల్లోనూ నోటి క్యాన్సర్ కనిపిస్తుండటానికి ఇదొక కారణం కావొచ్చని భావిస్తున్నారు.

పర్యావరణ కాలుష్యం: మన శరీరంలో క్యాన్సర్‌ను అడ్డుకునే, క్యాన్సర్‌ను ప్రోత్సహించే జన్యువులు రెండూ ఉంటాయి. ఏదైనా భాగంలో ప్రోత్సహించే జన్యువులు ఉత్తేజితమైతే క్యాన్సర్ వచ్చే అవకాశముంది. ఇలాంటి ప్రక్రియ ఎక్కడ, ఎందుకు జరుగుతుందనేది కచ్చితంగా తెలియదు, కానీ రకరకాల కాలుష్య కారకాలు దీనికి దోహదం చేస్తుండొచ్చని అనుమానిస్తున్నారు. కలుషిత గాలి, నీరు ద్వారా శరీరంలోకి వెళ్లే రసా యనాలు జన్యువుల పనితీరును దెబ్బతీసే ప్రమాదముంది. ప్లాస్టిక్ వినియోగం పెరగటమూ ముప్పును తెచ్చిపెడుతోంది.

వయసు: వయసు మీద పడుతున్నకొద్దీ క్యాన్సర్‌ను అడ్డుకునే కణాల పనితీరు మందగిస్తుంటుంది. అందుకే వృద్ధాప్యంతోనూ క్యాన్సర్ ముప్పు పెరుగుతుంది.

పోషణలేమి: రక్తహీనత, విటమిన్ బి12 లోపం, విటమిన్ డి లోపం గలవారికీ కొంతవరకూ క్యాన్సర్ ముప్పు పొంచి ఉంటుంది. జన్యువులు ఎప్పుడైనా దెబ్బతింటే అవి తిరిగి కుదురుకునే ప్రయత్నం చేస్తాయి. విటమిన్లు, ఖనిజాల లోపం గలవారిలో ఈ స్వభావం తగ్గుతుంది. దీంతో క్యాన్సర్ ముప్పు పెరుగుతుంది. ముఖ్యంగా పెదవులు, స్వరపేటిక వెనకాల భాగంలో క్యాన్సర్లు వచ్చే అవకాశముంది.

రోగనిరోధకశక్తి క్షీణించటం: రోగనిరోధక వ్యవస్థ మందగించినవారికి, రోగనిరోధకశక్తిని అణచిపెట్టే మందులు వేసుకునేవారికి కూడా నోటి క్యాన్సర్ వచ్చే అవకాశముంది.

లక్షణాలేంటి?

పుండు: చాలావరకూ నోటి క్యాన్సర్ పుండుగానే మొదలవుతుంది. కణితి రూపంలో ఏర్పడటం చాలా అరుదు. పెదవులు, నాలుక, అంగిలి, నాలుక కింద, బుగ్గల్లో ఎక్కడైనా పుండు ఏర్పడొచ్చు. సాధారణంగా నోట్లో పుండ్లు రెండు, మూడు వారాల్లో నయమవుతాయి. కనీసం మానే స్థితికైనా చేరుకుంటాయి. కానీ క్యాన్సర్ పుండు మానదు. అందువల్ల మూడు వారాలు దాటినా పుండు మానకపోయినా, మానుతున్న లక్షణాలు కనిపించకపోయినా వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.

నొప్పి లేకపోవటం: పుండు అనగానే నొప్పి గుర్తుకొస్తుంది. అయితే క్యాన్సర్ ఏర్పడుతున్నప్పుడు దగ్గర్లోని నాడులు క్షీణిస్తాయి కాబట్టి తొలిదశలో నొప్పి తెలియదు. కానీ క్యాన్సర్ ముదురు తున్నకొద్దీ నొప్పి మొదలవుతుంది. మొదట్లో ఆహారాన్ని నములుతున్నప్పుడు, మింగుతున్నప్పుడు నొప్పి పుట్టొచ్చు. తీవ్రమవుతున్నకొద్దీ ఆహారం తినటమూ కష్టమవుతుంది.

లాలాజలం ఊరటం: పుండు మూలంగానో, నొప్పి మూలంగానో సరిగా మింగలేక పోవటం వల్ల లాలాజలం ఊరొచ్చు.

నోరు సరిగా తెరచుకోకపోవటం: క్యాన్సర్ తీవ్రమైతే నోటి కండరాలూ క్షీణిస్తాయి. దీంతో నోరు తెరవటం కష్టమవుతుంది. పెద్దగా నోరు తెరవలేకపోతున్నారంటే క్యాన్సర్ ముదిరిందనే అర్థం.

మొద్దుబారటం: నోట్లో నాడులు దెబ్బతింటే నాలుక, దవడ వంటి భాగాల్లో సర్శ తగ్గొచ్చు. ఫలితంగా మొద్దుబారినట్టు అనిపించొచ్చు. రుచి తెలియకపోవచ్చు. నాలుకకు ఒకవైపు నాడులు దెబ్బతింటే కదలికలూ అస్తవ్యస్తం కావొచ్చు.

చెవి నొప్పి, దిబ్బడ: గొంతు వెనకాల, పైభాగంలో క్యాన్సర్ తలెత్తితే చెవి దిబ్బడ, నొప్పి కలుగుతుంది. సమస్య తీవ్రమైతే శ్వాసకూ ఇబ్బంది కలగొచ్చు. నోట్లోనూ నాలుక వెనకాల మరీ పెద్దగా పుండు పడితే చెవిలో నొప్పి రావొచ్చు.

బరువు తగ్గటం: తీవ్రమైన దశలో తినటం కష్టం కావటం, మెత్తటి పదార్థాలు ఎక్కువగా తినటం వల్ల బరువు తగ్గొచ్చు.

దుర్వాసన: క్యాన్సర్ పుండు మరో లక్షణం ఎనరోబిక్ ఇన్‌ఫెక్షన్. దీంతో రకరకాల రసాయనాలు పుట్టుకొస్తాయి. దీంతో ముదిరిన దశలో నోటి దుర్వాసన రావొచ్చు. రక్తం సరఫరా కాకపోవటం వల్ల కొంత క్యాన్సర్ కణజాలం చచ్చుబడుతుంది. దీంతోనూ నోటి నుంచి చెడు వాసన రావొచ్చు.

దంతం కదలటం: ఇదో ప్రత్యేక లక్షణం. చిగుళ్ల భాగంలో క్యాన్సర్ ఉన్నట్టయితే పన్ను వదులై, కదిలిపోవచ్చు. అందువల్ల అకారణంగా.. అంటే దెబ్బలేవీ తగలకపోయినా దంతం దానంతటదే కదులుతుంటే నిర్లక్ష్యం చేయొద్దు.

నివారణ ఉత్తమం

మనదేశంలో వచ్చే నోటి క్యాన్సర్లలో 85-90% దురలవాట్లతో ముడిపడినవే. వీటిల్లో ముఖ్యమైనవి పొగాకు, మద్యం అలవాట్లు. కాబట్టి వీటి జోలికి వెళ్లకుండా చూసుకోవటం ముఖ్యం. ఇందుకు ఎవరికివారు వ్యక్తిగతంగా శ్రద్ధ తీసుకోవటంతో పాటు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల తోడ్పాటూ అవసరం. పొగ తాగటం, పొగాకు నమలటం చాలావరకూ 14-20 ఏళ్ల వయసులోనే అలవడతాయి. ఉత్సుకతతో రుచి చూడటంతో మొదలై.. క్రమంగా అలవాటుగా మారుతుంది. పొగాకులోని నికొటిన్ దాన్ని వదలనీయకుండా చేసి, వ్యసనంగా మార్చేస్తుంది. కాబట్టి బడుల్లోనే పొగాకు అనర్థాల మీద బోధించటం మంచిది. పిల్లల మీద ఉపాధ్యాయుల ప్రభావం చాలా ఎక్కువ. చిన్న వయసులోనే అవగాహన కలిగితే పిల్లలను పొగాకు జోలికి వెళ్లకుండా కాపాడుకోవచ్చు. అలాగే పాఠశాలలకు చుట్టుపక్కల 100 మీటర్ల లోపు పొగాకు ఉత్పత్తులు అమ్మకూడదనే నిబంధన కచ్చితంగా అమలయ్యేలా చూడాలి. స్వచ్ఛంద సంస్థలూ పొగాకు అనర్థాల మీద మరింత ఎక్కువగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. డాక్టర్లు కూడా రోగులు ఏ కారణంతో వచ్చినా ఒకసారి దురలవాట్లు ఏవైనా ఉన్నాయా అనీ అడగాలి. పొగాకు, మద్యం అలవాట్లుంటే నోట్లో టార్చిలైటు వేసి, పరీక్షించాలి. దీంతో క్యాన్సర్ ముందస్తు సమస్యలు, లక్షణాలుంటే తేలికగా గుర్తించొచ్చు.

ముందస్తు పరీక్షలు (స్క్రీనింగ్): సమాజంలో దురలవాట్లు గలవారికి తరచూ ముందస్తు పరీక్షలు చేయటం వల్ల నోటి క్యాన్సర్‌తో సంభవించే మరణాలు 30% వరకూ తగ్గుతున్నట్టు కేరళలో నిర్వహించిన ఒక భారీ అధ్యయనంలో వెల్లడైంది. అంతేకాదు.. చాలామందిలో తొలిదశలోనే జబ్బును గుర్తించటమూ సాధ్యమైంది. కాబట్టి ముందస్తు నోటి పరీక్షలు చాలా ముఖ్యం.

పోషకాహారం: తాజా కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు, గింజపప్పులు (నట్స్) ఎక్కువగా తినాలి. డబ్బాల్లో నిల్వచేసే పదార్థాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది.

కంటి నిండా నిద్రపోవాలి.

క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. దీంతో ఆరోగ్యం, పుండ్లు నయమయ్యే సామర్థ్యం ఇనుమడిస్తాయి. ఇవి క్యాన్సర్ నివారణకు తోడ్పడతాయి. ఒకవేళ క్యాన్సర్ వచ్చినా త్వరగా నయమయ్యే అవకాశముంటుంది.

మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలి.

లూకోప్లేకియా, లైకన్ ప్లానస్ వంటి క్యాన్సర్ ముందస్తు సమస్యలు గలవారు మూడు, నాలుగు నెలలకోసారి తప్పనిసరిగా నోటి పరీక్ష చేయించుకోవాలి.

# మొటిమ బాధ తగ్గాలంటే..

%యుక్తవయసులో మొటిమలు సర్వ సాధారణ సమస్య. దీనికి మూలం హార్మోన్ల మార్పులు. సాధారణంగా మొటిమలు ముఖం మీదే కనిపించినప్పటికీ కొన్నిసార్లు వీపు, ఛాతీ, భుజాల మీదా రావొచ్చు. కొన్ని జాగ్రత్తలతో వీటి బాధను తగ్గించుకోవచ్చు.

ముఖం శుభ్రంగా: రోజుకు రెండు సార్లు ముఖాన్ని శుభ్రంగా కడుక్కోవాలి. దీంతో చర్మం జిడ్డు తగ్గుతుంది. మృతకణాలు వదిలిపోతాయి. అలాగని ఎక్కువసార్లు ముఖం కడుక్కుంటే మేలు కన్నా కీడే ఎక్కువ. కఠినమైన సబ్బులు చర్మాన్ని చికాకు పరుస్తాయి. కాబట్టి మృదువైన సబ్బులనే వాడుకోవాలి. తువ్వాలుతో గట్టిగా రుద్దటం వంటివి చేయొద్దు. మెత్తటి తువ్వాలును ముఖానికి అద్దుతూ సున్నితంగా తుడుచుకోవాలి.

గిల్లొద్దు: తరచూ చేతులను ముఖానికి తాకిస్తుంటే బ్యాక్టీరియా వ్యాపించే అవకాశముంది. అప్పటికే ఉబ్బి ఉన్న చర్మం మరింత చికాకుకు గురవుతుంది. అలాగే



మొటిమలను గిల్లటం, గోకటం, నొక్కటం వంటివేవీ చేయొద్దు. దీంతో బ్యాక్టీరియా మరింత లోపలికి వెళ్లి ఇన్‌ఫెక్షన్‌కు దారితీయొచ్చు.

మలాములు: మొటిమలు తగ్గటానికి మందుల దుకాణాల్లో దొరికే లేపనాలు వాడుకోవచ్చు. వీటిల్లో చాలావరకూ బెంజైల్ పెరాక్సైడ్, శాలిసైలిక్ యాసిడ్, గ్లైకాలిక్ యాసిడ్, లాక్టిక్ యాసిడ్ వంటివి ఉంటాయి. ఇవి బ్యాక్టీరియాను నిర్మూలిస్తాయి. అయితే వీటిని ముందు కొద్ది మోతాదులోనే వాడుకోవాలి. ఫలితాలను బట్టి ఎంత వాడుకోవాలో నిర్ణయించుకోవాలి.

మేకప్‌తో జాగ్రత్త: మొటిమలు ఉద్ధృతంగా ఉన్నప్పుడు ఫౌండేషన్, పౌడర్ అద్దుకోవద్దు. ఒకవేళ మేకప్ వేసుకుంటే రాత్రిపూట పూర్తిగా తుడిచేసుకోవాలి. వీలుంటే నూనె లేని సౌందర్య సాధనాలు వాడుకోవాలి. మొటిమలకు కారణం కానివి ఎంచుకోవాలి.

షాంపూతో తలస్నానం: తల మీది నూనె నుదురుకు తాకి, మొటిమలు వచ్చే అవకాశముంది. అప్పటికే ఉన్న మొటిమలు మరింత ఎక్కువ కావొచ్చు కూడా. కాబట్టి మృదువైన షాంపూతో శుభ్రంగా తలస్నానం చేయాలి. తలకు నూనె రాసుకోవద్దు. ఇది ముఖం మీదికి వ్యాపించి, చర్మ రంధ్రాలను మూసేయొచ్చు. పొడవైన జుట్టున్నట్టయితే ముఖం మీదికి రాకుండా చూసుకోవాలి.

ఎండ తగలనీయొద్దు: ఎండలోని అతి నీలలోహిత కిరణాలు చర్మంలో వాపు ప్రక్రియను, ఎరుపును ప్రేరేపిస్తాయి. మొటిమలు తగ్గటానికి వాడే కొన్ని మందులు ఎండకు అతిగా స్పందించే అవకాశమూ ఉంది. కాబట్టి వీలైనంతవరకూ ముఖానికి ఎండ తగలకుండా చూసుకోవాలి. ముఖ్యంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య మరింత జాగ్రత్త అవసరం.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy